తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:56, Issue: 12
May - 2026, Price Rs.20/-

మే 2026
వెల రూ. 20/-
పుటలు - 56



తిరుపతి శ్రీగోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాలు

(23-05-2026 నుండి 31-05-2026 వరకు)






దక్షిణాది అయోధ్యగా పేరొందిన ఒంటిమిట్ట (కడపజిల్లా) శ్రీకోదండరామాలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 01-04-2026న రాత్రి 8.10 గంటలకు నిండుపున్నమి వెన్నెలలో శ్రీ సీతారాముల కల్యాణాన్ని తి.తి.దే. అత్యంత వైభవంగా నిర్వహించింది.

భక్తుల రామనామసంకీర్తనలు, పండితుల వేదపఠనం, మంగళవాయిద్యాల నడుమ ఆం.ప్ర. తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను గౌ॥ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు దంపతులు సీతాసమేత కల్యాణరామయ్యకు సమర్పించారు.

స్వామివారి కల్యాణాన్ని చూసే భక్తులతో ఒంటిమిట్ట జన సంద్రంగా మారింది. వేదిక ప్రాంగణంలో 121 గ్యాలరీలు ఏర్పాటు చేశారు. భక్తులు వీక్షించేందుకు పెద్ద ఎల్.ఈ.డీ. స్క్రీన్ ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నప్రసాదంతో పాటు ముత్యంతో కూడిన తలంబ్రాలను, శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని తి.తి.దే. అందించింది.






# గీతాశ్లోకార్థసారం

**శ్లో : నేహాభిక్రమనాశోఽస్తి ప్రత్యవాయో న విద్యతే ।**
**స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ ॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-40వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** ఇహ= (మోక్షమార్గమైన) ఈ కర్మయోగమందు; అభిక్రమనాశః= ప్రారంభించింది నిష్ఫలమగుట, న అస్తి= లేదు; ప్రత్యవాయః= దోషం కూడా (లేక విరుద్ధ ఫలితమైనా); న విద్యతే= లేదు; అస్య ధర్మస్య= కర్మయోగమనే ధర్మం యొక్క; స్వల్పమపి= కొంచెమైనా, మహతః= గొప్పదైన; భయాత్= భయంనుండి; త్రాయతే= రక్షిస్తున్నది.

**భావం:** ఈ కర్మయోగం ప్రారంభింపబడింది నిష్ఫలమెన్నటికీ కాదు. పూర్తి అవడానికి ముందుగా ఏ కారణంచేతైనా మధ్యలో నిలిచిపోయినా దోషం లేదు. ఈ కర్మయోగానుష్ఠానాన్ని ధర్మం ఒకింతైనా గొప్పదైన సంసారభయమునుండి రక్షిస్తోంది.

---

## విశ్వమాత ఎదుట విశ్వరూప ప్రదర్శన!

అందరిలోనా నెక్కుడు హనుమంతుఁడు.
కందువ మతంగగిరికాడి హనుమంతుఁడు

కనకకుండలాలతో కౌపీనముతోడ
జనియించినాఁడు యీ హనుమంతుఁడు
ఘన ప్రతాపముతోడ కఠినహస్తాలతోడ
పెనుతోఁక యెత్తినాఁడు పెద్దహనుమంతుఁడు

తివిరి జలధిదాఁటి దీపించి లంకయెల్లా
అవలయివల నేసె హనుమంతుఁడు
వివరించి సీతకు విశ్వరూపము చూపుతా
ధ్రువమండలము మోచె దొడ్డ హనుమంతుఁడు

తిరమైనమహిమతో దివ్యతేజముతోడ
అరసి దాసులఁ గాచీ హనుమంతుఁడు
పరగ శ్రీవేంకటేశుబంటై సేవింపుచు
వరములిచ్చీఁ బొడవాటిహనుమంతుఁడు

సంపుటం-2, సంకీర్తన-207




శ్రీరాముని సేనలో అందరికంటే గొప్పవాడు హనుమంతుడు. అందమైన మతంగపర్వతం వద్ద ఉండే హనుమంతుడు. బంగారు కుండలాలతో, కౌపీనంతో పుట్టినవాడు ఈ హనుమంతుడు. గొప్పశౌర్యంతో బలమైన చేతులతో, పెద్దతోకను పైకెత్తి విరాజిల్లే పెద్దహనుమంతుడితడు. ప్రయత్నించి పూనికతో సముద్రాన్ని దాటి ప్రకాశమానుడై లంకనంతా చిందరవందర చేసిన హనుమంతుడు. తానెవరో ఎక్కడనుండి వచ్చాడో, రామలక్ష్మణుల సమాచారం ఎట్టిదో సీతకు వివరంగా చెప్పాడు. ఆమెకు నమ్మకం కలిగించడానికి విశ్వరూపం కూడా చూపాడు. విశ్వరూపం చూపినప్పడు ధ్రువనక్షత్రమండలం తలమీద తగిలే అంత ఎత్తు ఎదిగాడు దొడ్డహనుమంతుడు. స్థిరమైన మహిమతో, దివ్యతేజంతో ప్రకాశిస్తూ తన దాసులను, రామదాసులను కూడా కాచి రక్షించే హనుమంతుడు శ్రీవేంకటేశునకు సేవకుడై నిత్యం సేవిస్తూ భక్తజనులకు వరాలు ఇచ్చే పొడవాటి హనుమంతుడితడు అని అన్నమయ్య హనుమ వర్ణన చేశాడు.



# మీరు హిందువులు - అందుకు గర్వించండి!



- అతిశ్రేష్ఠపరంపరకు వారసులు- మరువవద్దు!
- సుదృఢమైన ఆధ్యాత్మికపు పునాదులపైన నిర్మితమైన ఈ హిందూధర్మం - అన్నిటికి మూలధర్మం.
- నిజమైన హిందువుకండి - క్రింది సలహాలు పాటించండి!
- మీ మీ సంప్రదాయానుగుణమైన బొట్టు (తిలకం, గంధం, విభూతి) నుదుట ధరించటం అలవర్చుకోండి.
- ప్రతిదినం ఒక్కపూటైనా స్నానానంతరం మీకిష్ట మైన దైవధ్యానం అలవర్చుకోండి
- ప్రతి దినమూ శ్రీవేంకటేశ్వర సుప్రభాతంలోని కనీసం పది శ్లోకాలను పఠించటం అలవాటు చేసుకోండి.
- మీ ఇంటి ముందు ఓంకారాన్ని అతికించండి.
- భగవద్గీత నుండి రోజుకొక్క శ్లోకం పఠించండి.
- వారానికొకసారి లేదా ముఖ్యమైన పండుగలలో సకుటుంబంగా దగ్గరి దేవాలయాన్ని సందర్శించి, సేవించండి.
- హిందువుల సామాజిక ఉత్సవాలలో పాల్గొనండి, చేతనైనంత సహాయం చేయండి!
- 'ఓం నమో వేంకటేశాయ' అనే విధంగా మీ ఇష్ట దైవాన్ని రోజూ 108సార్లు జపించండి
- సమయం దొరికినప్పుడల్లా ఆలయాలకు వెళ్లి సత్సంగంలో పాల్గొనండి!
- గోపూజ అలవర్చుకోండి!
- ఇంటిలో పెరటివెల్లు తులసీమాతను తప్పక ఏర్పాటు చేసుకోండి!

**దేవుని పై విశ్వాసం - మనరక్షణ కదే మూలం**

**తి.తి.దేవస్థానములు, తిరుపతి.**

తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 56 మే 2026 సంచిక : 12



వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి॥

గౌరవ సంపాదకులు
శ్రీ ముద్దాడ రవిచంద్ర, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు

ప్రచురణకర్త-సంపాదకులు,
ప్రధాన సంపాదకులు (ఎఫ్.ఏ.సి.)
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉపసంపాదకులు
'కళారత్న' డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., తెలుగు & ఇంగ్లీషు, ఎం.ఫిల్., పిహెచ్.డి.,

ముద్రాపకులు
శ్రీ ఆర్.వి.విజయకుమార్, బి.ఏ., బి.ఎడ్.,
ఉపకార్యనిర్వహణాధికారి, (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం), తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
ప్రధానసంపాదకులు-0877-2264363
కార్యాలయం -0877 -2264543
0877 -2264359

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri_helpdesk@tirumala.org;
ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.
0877 2277777 / 2233333

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| చల్లనిదీవెనలిచ్చే తల్లి! | డా॥ఆకెళ్ల విభీషణశర్మ | 07 |
| మారుతికి వందనం! | 'కళారత్న' డా॥కంపల్లె రవిచంద్రన్ | 09 |
| సందేహాలు-సమాధానాలు | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 12 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 13 |
| కూర్మావతార నారాయణ! | ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు | 15 |
| అణువణువునా భగవత్ తత్త్వాన్ని దర్శించిన యోగి | పద్మశ్రీ డా॥శోభారాజు | 17 |
| అనుకున్నవన్నీ జరగాలంటే..! | శ్రీ డి.వి.ఆర్.భాస్కర్ | 19 |
| విశేషాల వైశాఖం | శ్రీమతి పి.రమాదేవి | 21 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 23 |
| నిరాశ ఉండదు! | శ్రీ ఆర్.సి.కృష్ణస్వామి రాజు | 24 |
| తిరుక్కురుంగుడి (108 దివ్యదేశాలు) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| హనుమాన్ చాలీసా | | 27 |
| వ్రత కథలూ - పరమార్థం | బ్రహ్మశ్రీ డా॥ మైలవరపు శ్రీనివాసరావు | 31 |
| శ్రీనివాస విలాస సేవధి (ద్విపద) | సంక్షిప్తవచనం- ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి | 35 |
| ఏకాదశీవ్రత మాహాత్మ్యం | శ్రీ కె.ఎస్.వి.కె.స్రవంతి | 36 |
| ధర్మం కాపాడడానికే భగవంతుని అవతారాలన్నీ | శ్రీ సన్నిధానం నరసింహశర్మ | 38 |
| ప్రాణాధారం! | డా॥యల్లాప్రగడ మల్లికార్జునరావు | 41 |
| అన్నమయ్య జానపదం | శ్రీ గంధం బసవ శంకరరావు | 42 |
| శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయం | ఆచార్య వేదాన్తం శ్రీవిష్ణుభట్టాచార్యులు | 44 |
| మనిషి కర్తవ్యం..! | శ్రీ యు.విజయశేఖర రెడ్డి | 47 |
| ప్రాణం కాపాడిన శ్లోకం (చిత్రకథ) | కథ: 'కళారత్న' డా॥కంపల్లె రవిచంద్రన్<br>చిత్రాలు: శ్రీ తుంబలి శివాజీ | 48 |
| ఇంటిలోనిపోరు (వేమన శతకం) | కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు | 50 |
| క్విజ్ | | 51 |
| బాలవినోదం | | 52 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| శ్రీపదకేళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : ఉభయదేవేరి సమేత శ్రీగోవిందరాజస్వామివారు, తిరుపతి
వెనుకచిత్రం : శ్రీవీరవేంకటసత్యనారాయణస్వామివారు, అన్నవరం



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

## జగమంతా లక్ష్మీనివాసం!

నియతం కురు కర్మ త్వం కర్మజ్యాయో హ్యకర్మణః।
శరీరయాత్రాపి చ తే న ప్రసిద్ధ్యేదకర్మణః॥ (3-8)

ఎవ్వరూ ఏ పనీచేయకుండా ఉండకూడదు. పనిచేయకుండా ఉండటం కంటే పనిచేయడం శ్రేష్ఠం. దానివల్ల జీవనం కూడా జరుగుతుంది. పనిచేయనివారికి జీవయాత్ర కూడా కష్టమై పోతుంది- అంటుంది భగవద్గీత. పని చేయడం ఆరోగ్యానికి, సంపదకు ఆధారభూతం. సంపద, ఆరోగ్యం రెండూ లక్ష్మీస్వరూపాలు, లక్ష్మీదేవిని ఆరాధించడమంటే సోమరితనం విడిచి నిరంతరం కార్యనిమగ్నులు కావడమే. కొందరు శారీరకశ్రమ చేస్తే, మరికొందరు మానసికపరిశ్రమ చేస్తూ ఉంటారు. ఈ రెంటికీ ఆధార ఆధేయ సంబంధం ఉంటుంది. అందువల్ల ఎవ్వరూ ఎవరినీ కించపరచరాదు. పరస్పరం గౌరవించుకోవాలి.

ఉద్యోగినం పురుష సింహం ఉపైతి లక్ష్మీ
దైవేన దేయమితి కాపురుషా వదంతి
దైవం నిహత్య కురు పౌరుషం ఆత్మశక్త్యా
యత్నే కృతే యది న సిద్ధ్యంతి కోఽత్ర దోషః

ఎవరైతే ఉత్సాహంతో, కష్టించి పనిచేయగలరో వారి దగ్గరకు లక్ష్మి వస్తుందని చెపుతోంది ఈ శ్లోకం. 'ఉద్యోగినం' కష్టించి పని చెయ్యగలిగిన పురుషులైనా, స్త్రీలైనా సింహం లాంటి వాళ్లు. 'ఉపైతి లక్ష్మీ'- లక్ష్మీదేవి వాళ్ల దగ్గరకు ఆశీర్వదించడానికి పరుగులెత్తుతోంది. "ఏదైతే అది జరుగుతుందిలే! మన చేతుల్లో ఏముంది?" అంటూ నిస్సత్తువుగా మాట్లాడుతుంటారు చాలామంది. అది సరికాదు. 'దైవం నిహత్య కురు పౌరుషం ఆత్మశక్త్యా'- అని ఆత్మశక్తితో కార్యరంగంలో ఉద్యమించాలి గానీ, "ఏదైతే అది అవుతుంది" అని సర్ది చెప్పుకోగూడదు.

జనకుడు, ప్రహ్లాదుడు, అంబరీషుడు, ధర్మవ్యాధుడు, భగీరథుడు తమ తమ విధులను, విధ్యుక్త కర్మలను ఆచరించి, ఆత్మ విచారణతో మోక్షపదవిని పొందారు. 'శ్రమ పడుటే జాతికి సిరి'- లౌకిక, ఆధ్యాత్మికసంపదలకు శ్రమే మార్గం. శ్రమద్వారా సంపద లభిస్తుంది. సమస్త ఉత్పత్తికీ శ్రమే మూలం. శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైంది లేనే లేదు. శ్రమలో అందం మాత్రమే కాక ఆనందం కూడా ఉంది.

చిన్నచిన్న పనులు చేసేవారు, వ్యవసాయ క్షేత్రాల్లో, పారిశ్రామిక వాడల్లో పనిచేసే అసంఘటిత శ్రామికులు లేకపోతే ఉత్పత్తి ఆగిపోతుంది. తద్వారా జీవన ప్రమాణాలు కుంటుపడతాయి. అందుకే శ్రమను సంపదగా, శ్రామికుణ్ణి సంపద సృష్టికర్తగా గౌరవించాలి. ధార్మికవ్యవస్థల్లో కూడా శ్రామికుల పాత్ర గణనీయమైందే. భక్తులకు కావాల్సిన అనేక సౌకర్యాలు మొదలుకుని దేవాలయాల ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉంచడం వరకు వివిధశాఖలలో పనిచేసేవారిలో భగవదంశ ఉంటుందని గుర్తించి వారిని గౌరవించడమే శ్రామికదినోత్సవ వైభవం. శ్రమ లక్ష్మీస్వరూపం- శ్రామికులు నిజమైన లక్ష్మీ సమారాధకులు!

శ్రమకు వందనం - శ్రామికులకు వందనం



# చల్లనిదీవెనలిచ్చే తల్లి!

- డా॥ ఆకెళ్ల విభీషణశర్మ

**ఈ నెల 05వ తేదీ నుండి తిరుపతి గంగజాతర ప్రారంభం...**

భారతావనిలో అనేక ప్రాంతాల్లో గ్రామదేవతలకు జాతరలు జరుగుతుంటాయి. ఇవి ప్రజల భక్తి, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు. తరతరాలుగా వస్తున్న ఆచారాలు, వేషధారణలు, ఆటపాటలు, నైవేద్యాలు, సామూహిక ఉత్సవాలు ఇవన్నీ ఈ జాతరల ద్వారా సజీవంగా అలరారుతున్నాయి. ముఖ్యంగా గ్రామదేవతను ఆరాధించడం ద్వారా ఆ గ్రామంలో మశూచి (అమ్మవారు)వంటి జ్వరవ్యాధులు, శారీరక కష్టాలు, అనర్థాలు, కుటుంబకలహాలు తొలగుతాయని గ్రామీణుల విశ్వాసం. తిరుపతిలో గంగమ్మను తాళ్లపాక గంగమ్మ (పెద్ద గంగమ్మ) మరియు తాతయ్యగుంట గంగమ్మ (చిన్నగంగమ్మ) అనే రెండు ప్రధాన రూపాలలో ఆరాధిస్తారు. తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి ప్రత్యేక చారిత్రక నేపథ్యం ఉంది. నిత్యం తిరుమలనంబి వంశీయులు తిరుమలేశునికి నిత్యకైంకర్యాల్లో ఆకాశగంగ జలాన్ని పవిత్రంగా తెచ్చి అర్చకస్వాములకు సమకూరుస్తారు. ఆ తిరుమల నంబి ఇక్కడ కూడా చెరువు తవ్వి శ్రీవేంకటేశ్వరస్వామివారి సోదరి గంగమ్మకు కైంకర్యం చేశారని స్థానికుల విశ్వాసం.

ఈ నేపథ్యంలో తిరుపతిలో నిర్వహించే గంగమ్మ జాతర చాలా విశిష్టమైంది. పూర్వం అవిలాల గ్రామంలో అవతరించిన గంగమ్మ దేవి ఒక దుర్మార్గుడైన పాలేగాడి దుష్ప్రవర్తనకు ముగింపు పలికింది. గ్రామ యువతులను రక్షించేందుకు గంగమ్మ వివిధ వేషాలు ధరించి ఆ పాలేగాడిని వెతికి చివరకు సంహరించిందని ఈ దేవాలయ గాథ. ఈ దృక్పథంతో ప్రతి సంవత్సరం వారంరోజుల పాటు వివిధవేష ధారణలతో జాతర నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది.

స్థానిక భక్తులు గంగమ్మను శ్రీ వేంకటేశ్వరస్వామివారి చెల్లెలుగా తరతరాలుగా విశ్వసిస్తున్నారు. అందువల్ల అనేక మంది భక్తులు ముందుగా గంగమ్మను దర్శించి, తరువాత తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారిని దర్శించడం ఒక సంప్రదాయం. ఈ విశ్వాసం గంగమ్మ జాతరకు మరింత ఆధ్యాత్మిక ప్రాధాన్యతను అందించింది. అంతేకాక తిరుమల తిరుపతి దేవస్థానం గంగజాతర వేళ స్వామివారి పక్షాన పసుపు కుంకుమలు, మంగళద్రవ్యాదులు పుట్టింటిసారెగా అందించటం సంప్రదాయం. అంతేకాక ఈ దేవాలయ ప్రాకారాలను ఆలయాన్ని శిలానిర్మాణం చేయడంలో తి.తి.దే. ఎంతో ఆర్థిక సహకారాన్ని అందించింది.

గంగమ్మ జాతర సాధారణంగా చైత్రమాసం చివరి వారంలో జరుగుతుంది. ఒక వారం పాటు కొనసాగే ఈ ఉత్సవంలో ప్రతి రోజూ ప్రత్యేక వేషధారణలు ఉంటాయి. బైరాగివేషం, బండవేషం, తోటివేషం, దొరవేషం, మాతంగి వేషం, సున్నం కుండలు, సప్పరాలు, పేరంటాలవేషం ప్రధాన ఆకర్షణలు.








ఈ గంగజాతరలో పిల్లలు, యువకులు ప్రధానంగా పాల్గొంటారు. మహిళలు, వృద్ధులు కూడా ఎంతో శ్రద్ధగా జాతరలో మమేకమౌతారు. జాతర రోజుల్లో గ్రామ శుభ్రత, సేవాభావం, అహంకార నిర్మూలన సమాజంలో ప్రతిఫలిస్తాయి. చలివేంద్రాలు, చలువపందిళ్లు విరివిగా ఏర్పాటు చేస్తారు. ఇందులో వేసే బైరాగివేషం ఆధ్యాత్మికకు ప్రతీక. బండవేషం వేసిన రోజున చెడుమాటలు మాట్లాడతారు. అంటే లోకులు కాకులు అనే సామెత ఉంది. కనుక మంచి చేసినా కువిమర్శలు వస్తాయి. అందుకు తగిన గుండె బలాన్నిచ్చేది ఈ బండవేషం. కానీ ఆనాడు అమ్మవారు పాలేగాడిని వెతికేవేళ కోపంతో పలికిన మాటలు ఇందుకు మూలమని గుర్తు చేసుకోవాలి. తోటివేషం తోటివారికి తోడ్పడాలని సందేశం ఇచ్చే వేషం. ఈ వేషంతో నాటి దుర్మార్గాన్ని గుర్తు చేస్తున్నట్లుగా చెడుమాటలు మాట్లాడుతూ చెడ్డవారు నశించాలని పలుకుతారు. కారణం చెడుపై ఎప్పటికి మంచికే విజయం లభిస్తుందనే సందేశం ఇందులో ఇమిడి ఉంది. కైకాల కులస్థులే ఆనువంశికంగా ఈ దొరవేషం వేస్తారు. తిరుపతి పురవీథుల్లో ఊరేగే గంగమ్మను పూజించి ఇళ్లకు వెడతారు. ఉరకలేసే ఉత్సాహాన్ని ప్రదర్శిస్తారు. మాతంగి వేషం శక్తి, జ్ఞానం, మంగళాలకు సంకేతంగా భావించబడుతుంది. శుద్ధి, పవిత్రత, ఆధ్యాత్మికశాంతికి సూచకంగా సున్నం కుండలు వేషధారణలు జరుగుతాయి. తెలుగులో సప్పరం అంటే గుడారం. దీన్నే సప్పరాలవేషధారణ అంటారు. వెదురు దబ్బలతో తయారుచేసి ధరిస్తూ, ఒళ్ళంతా గంధం పూత పూసుకుంటూ, లయబద్ధంగా చిందులు వేస్తూ కళాత్మకంగా అమ్మవారి సేవలో పాలుపంచుకోవడం ఇందులో విశేషం. ఈ సప్పరాలు గోపురాకార నిర్మాణాలతో దేవాలయతత్త్వాన్ని ప్రతిబింబిస్తూ జీవుడే దేవుడు అనే అద్వైత భావాన్ని తెలియజేస్తాయి.

పేరంటాల వేషం స్త్రీశక్తి, మంగళకార్యతకు సంకేతంగా నిర్వహించబడుతుంది. ఈ వేషధారణలన్నీ కేవలం వినోదాత్మక ప్రదర్శనలు కావు, సామాజిక సమైక్యత, ధైర్యం, చెడుపై పోరాటం, భక్తి, సేవాభావం వంటి విలువలను బోధించే ఆధ్యాత్మిక పాఠాలు. మొత్తానికి, తిరుపతి గంగమ్మజాతర చారిత్రకగాథ, ఆధ్యాత్మిక భావం, సామాజికసందేశం, సాంస్కృతిక పరిరక్షణ అంశాలను సమన్వయం చేసిన మహోత్సవం.











# మారుతికి వందనం!



– 'కళారత్న' డా॥ కంపల్లె రవిచంద్రన్,
98487 20478

రామదాసు పరమ రామభక్తాగ్రేసరుడైన హనుమంతుని గుణగణాలనూ, శక్తిసామర్థ్యాలనూ, భక్తితత్పరతనూ, మహాబుద్ధిశక్తినీ సంస్కృతంలో సంబోధనాత్మకంగా రచితమైన కీర్తనలో ఘనంగా ప్రశంసించాడు. చివరలో ప్రసీద, పాహిమాం' అనేవి క్రియా పదాలు. మొదటనున్న పల్లవి నమస్కారరూపం.

**కీర్తన :**

**ప : మారుతే నమో౽స్తుతే మహామతే మారుతే నమో౽స్తుతే**

**చ : శ్రీ రఘూత్తమ పాదచింత నాపహత భేద**
**పూరితాంతర ప్రమోదభూషిత ధీతవేద (1)**
**॥మారుతే॥**

**బుద్ధిబలాదిదానపోషితాఖిలదీన**
**సిద్ధ యోగీశ ప్రధాన శ్రీహరే మంజులగాన (2)**
**॥మారుతే॥**

**భద్రగిరి రామపాద భక్తిజనిత వినోద**
**భద్రదాయక ప్రసీద పాహి మాం మంజులనాద (3)**
**॥మారుతే॥**

**భావం:** ఓ మారుతీ! నీకు నమస్కారం. ఓ మహామతీ! నీకు నమస్కారం, ఓ మారుతీ నీకు నమస్కారం. శ్రీరామచంద్రుని పాదపద్మచింతనం వల్ల సకలదుఃఖాలను పోగొట్టుకొన్నవాడా! నిరంతరం హృదయంలో శ్రీరాముణ్ణి నిల్పుకొన్నందున ఆనందంతో భూషింపబడినవాడా! అఖిలవేదాలను జుఱ్ఱుకొన్న వాడా (చక్కగా వేదాధ్యయనం చేసినవాడా!) మారుతీ! నీకు నమస్కారం. బుద్ధి, బలం మొదలైన శక్తులను దీనజనులకు ప్రసాదించి, పోషించేవాడా! సిద్ధయోగీశుల్లో ముఖ్యుడవైనవాడా! శ్రీ వానరోత్తమా! మధురమైన గానం కలవాడా! మారుతీ నీకు నమస్కారం. భద్రగిరి శ్రీరామచంద్రుని పాద (భక్తుల) భక్తి నుండి కల్గిన వినోదం, సంతోషం కలవాడా! మంగళదాయకా! మధురమైన నాదం కలవాడా! మారుతీ! నీకు నమస్కారం. భక్తశిరోమణీ! మారుతీ! నాయందు ప్రసన్నుడివి కమ్ము. నన్ను రక్షించు" అని ప్రార్థిస్తున్నాడు రామదాసు దేవభాషలో!

**విశేషం:** రామదాసు కీర్తనల్లో సంస్కృతకీర్తనలూ ఉన్నాయి. రామదాసు ఉద్యోగం రీత్యా నేర్చుకొన్న భాషలే కాక వంశ క్రమాగతంగా పెద్దలనుంచీ సంస్కృతమూ నేర్చి ఉంటాడు. వేదశాస్త్రపురాణేతిహాసాలతో చక్కని పరిచయమున్నవాడే అనడానికి అతని కీర్తనల్లో కన్పించే "ఆయు రన్నం ప్రయచ్ఛతి" మొదలైన వాక్యాలూ, సంస్కృతకీర్తనలూ, షడ్వింశత్తత్త్వవివేచన మున్నగునవి దృష్టాంతాలు. ఈ కీర్తనలో మొత్తం 13 సంబోధన లున్నాయి. వీటిల్లో 'మారుతీ' అనేది రెండు మార్లు వచ్చింది. ఆదరార్థంలో రెండుమార్లు చెప్పబడటం జరిగింది. 'మరుత్ అంటే వాయువు. వాయునందనుడు గనుక హనుమంతుడు మారుతి. "మరుత్" అంటే 'కుపితేన అనేన మ్రియతే లోక ఇతి మరుత్. 'మృజ్ ప్రాణత్యాగే' కోపించిన ఇతని వల్ల లోకం మృతి చెందుతుంది. కనుక మరుత్. అతని కొడుకైన మారుతి కూడా కోపిస్తే శత్రువుల ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. ఆంజనేయుని బలం, వేగం ఎంతటివో, అతని శక్తిసామర్థ్య

పరాక్రమాదులు ఎంతగొప్పవో రామాయణంలో చూడవచ్చు. ఇక్కడ రామదాసు హనుమంతుణ్ణి "మారుతే!" అని ప్రారంభంలో పేర్కొనడంవల్ల తనకు బాహ్యాంతశ్శత్రు పరిహారం గావించి, రక్షింపు మనే భావాన్ని వ్యక్తం చేస్తున్నాడు. హనుమ మహామతి. హనుమను "బుద్ధిమతాం వరిష్ఠం" అని సుతిస్తున్నాం. ఇతడు అనేక సందర్భాల్లో తన బుద్ధి కౌశల్యంతో సుగ్రీవాదులకూ, శ్రీరామాదులకూ, సీతాదేవికీ చేసిన సహాయాలూ, ఘటించిన మైత్రీ విశేషాలూ అతని మహామతిత్వాన్ని నిరూపిస్తాయి.



**ఎంత గొప్ప బలం విజ్ఞానం ఉన్నప్పటికీ, హనుమంతుడు ఎప్పుడూ నేను రాముని బంటును అని ఎంతో వినయంగా చెప్పుకునేవాడు. నిజమైన శక్తికి వినయమే అసలైన ఆభరణం.**

ఇక్కడ కీర్తనకర్త రామదాసు. స్తుతింపబడేవాడూ రామదాసు. 'దాసోఽహం కోసలేంద్రస్య' అంటూ రావణుని ఎదుట నిర్భయంగా తనను తాను "రామదాసు"గా ప్రకటించుకున్న ధీరగంభీరమమూర్తి– హనుమ. శ్రీరామునిపాదపద్మ చింతనచే సకలదుఃఖాలూ తొలగించుకోవడంలో హనుమ అగ్రగణ్యస్థానంలో ఉంటాడు. "పూరితాంతరప్రమోద భూషితుడు" హనుమ. నిరంతరం రామధ్యానైకతత్పరుడు గదా! గుండె చీల్చిచూచినా లోపల కన్పించేది శ్రీరాముడే – హనుమకు. కనుక అతని హృదయం నిండా రామానందమే నిండి ఉంటుంది. అదే అతనికి దివ్యాభరణం. ఇవన్నీ ఒక ఎత్తయితే "ధీతవేద" అనేది ఒక ప్రత్యేకత. 'ధీత'మంటే త్రాగడం. హనుమంతుడు వేదాలు అధ్యయనం చేసి, వల్లించడమే కాదు. వాటిల్ని త్రాగేశాడు. అందువల్ల వేదం అతని శరీరంలో, రక్తంలో లీనమైంది. ఏమాట మాట్లాడినా ఉచ్చారణ దక్షత అందులో స్పష్టంగా గోచరిస్తుంది. ప్రతిమాటా వేద మయంగానే ఉంటుంది.

## అంతారామమయం

శ్రీరామునితో హనుమంతుడు మాట్లాడిన మొట్టమొదటి సంభాషణలోనే హనుమంతుని వాగ్మహిమను శ్రీరాముడు గ్రహించి, లక్ష్మణునితో "లక్ష్మణా! మనం అన్నివేదాలూ అధ్యయనం చేసిన ఎందర్నో చూచాం. వారితో మాట్లాడాం. కానీ ఇతని మాటల్లో ఎక్కడా అపశబ్దం అనేది లేదు. మాటల్లో తేజస్సూ, ఓజస్సూ తొణికిసలాడ్తున్నాయి. ఇలాంటివాణ్ణి మంత్రిగా పొందిన వ్యక్తి ఎంత అదృష్టవంతుడో!" అని ప్రశంసించిన సన్నివేశం రామాయణంలో ఉంది. వేదమయుడైన శ్రీరామనారాయణుడే అంతగా హనుమ యొక్క వైదికసంస్కారాన్ని మెచ్చుకున్నాడంటే – హనుమంతుని వేదాధ్యయన దక్షత ఎట్టిదో గమనింపవచ్చు. ఇక్కడ 'అధీత' అంటే 'అధ్యయనం చేయబడిన' అని అర్థం. సాధారణంగా అందరూ 'అధీతవేద' అంటారు. కానీ రామదాసుకు హనుమవిషయంలో ఆ మాట తృప్తికరంగా తోచలేదు. 'అ' తొలగించాడు. 'ధీత' అన్నాడు. 'ధీతవేద'– వేదాన్ని ఆపోశనం పట్టేశాడన్నాడు. ఈ మాట క్రొత్త ప్రయోగం. హనుమంతుని విషయంలో సార్థకం. రామదాసునికి హనుమపై ఉన్న గౌరవాదరాలకు నిదర్శనం.

హనుమంతుడు భక్తులకు "బుద్ధిర్బలం యశోధైర్యం నిర్భయత్వ మరోగతా। అజాడ్యం వాక్పటుత్వంచ హనూమత్ స్మరణాద్భవేత్" అనే పెద్దలమాటను బట్టి బుద్ధి, బలమూ, యశస్సూ, నిర్భయత్వం, ఆరోగ్యం, అజాడ్యం, వాక్పటుత్వం ప్రసాదిస్తాడు. కనుకనే 'ప్రతిగ్రామాధిదేవత' అయ్యాడు– హనుమ. కొండల్లో, అడవుల్లో ఎక్కడ చూచినా హనుమంతుడు సాక్షాత్కరిస్తానే ఉంటాడు. రామదాసు ఈ విషయం స్వాను భవంతో గ్రహించినందున "దీనులకు బుద్ధి బలాదుల్ని దానంచేసి, వాళ్లను పోషించేవాడు" అని నుతించాడు. హనుమ మహాసిద్ధుడు – అంటే అణిమా, మహిమా, గరిమా, లఘిమా, ప్రాప్తి, ప్రాకామ్య, ఈశత్వ, వశిత్వాలు – అనే అష్టసిద్ధులూ కలవాడు. మహాయోగి. కనుకనే రామదాసు 'సిద్ధయోగీశప్రధాన' అన్నాడు. 'హరి' శబ్దానికున్న అనేకార్థాల్లో 'వానరం' అనీ ఉంది. అయితే హను మంతుడు మామూలు 'హరి' కాదు. అతడు రామ దాసుభావనలో "శ్రీహరి" శ్రీకరుడైన వానరం అనీ, శ్రీహరి అయిన భగవంతునితో సమాను డనీ రెండర్థాలూ వస్తాయి. "హరతీతి హరిః" అని వ్యుత్పత్తి కనుక 'సర్వాన్నీ హరించేవాడు. ధ్వంసం చేసేవాడు– "హరి" ఈ వ్యుత్పత్తి హనుమ విషయంలో సర్వత్ర సార్థకం! హనుమంతుడు సంగీతజ్ఞుడు. ఇతని పేరుతో 'హనుమత్తోడి' అని ఒక రాగమే ఉంది. హనుమ ఒక సంగీతసంప్రదాయ ప్రవర్తకుడు. హనుమ గొప్పగాయకుడు. కనుకనే 'మంజులగాన' అని అన్నాడు.



హనుమ 'భద్రగిరి రామపాద భక్తిజనితవినోదుడు'. కోసలాధిపుడైన ఆ రాముడే 'భద్రాచలాధిపుడుగా' దక్షిణాది వాళ్ళను అనుగ్రహిస్తున్నాడు. రాముడున్న చోటే హనుమ ఉంటాడు. భద్రాద్రి రాముని పాదభక్తివల్ల హనుమంతుడు ఎంతో వినోదాన్ని పొందాడు. అంతేగాక ప్రకృతిలీల లన్నింటినీ లీలావినోదంగా చూడగల్గే స్థితికి వచ్చాడు. హనుమ 'మంజుల నాదుడు'. హనుమకంఠం శత్రువులపై దూలినపుడు రణరంగంలో సింహనాదుడు. సంగీత విషయంలో హనుమ కంఠం చాలా శ్రావ్యమైంది. కనుకనే మహాగాయకుడుగా, సంగీత ప్రవర్తకుడుగా వాసికెక్కాడు.

మారుతి భద్రదాయకుడు. సమస్త మంగళప్రదాత. భద్రగిరీశుని పాదసేవకుడు భద్రదాయకుడు కావడం న్యాయమే! ఈ కీర్తనలోని ప్రతి– సంబోధనమూ సార్థకమైందిగా, హను మంతుని ప్రభావాన్ని యథార్థంగా నిరూపించేదిగా ఉన్నాయి. దాస్యభక్తికి హనుమ దృష్టాంతం. అందుకే 'హనుమా! నాయందు దయజూపు నన్ను రక్షించు' అని రామదాసు ప్రత్యక్షరామ దాసుణ్ణి(హనుమను) అర్థిస్తున్నాడు.



# సందేహాలు సమాధానాలు

– బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

**ప్ర) రామాయణంలో హనుమంతుడు 'రామదూత' మాత్రమే కదా? రామభక్తునిగా చెప్పబడలేదు. ఎందుకని?**

**జ)** భక్తి అంటే భజన చేయడం కాదు. ప్రేమ, గౌరవం, 'సర్వస్వం' అనే భావన. ఆ మూడూ రాముని పట్ల హనుమంతునికున్నాయి. 'దాసోహం కోసలేంద్రస్య రామస్య' (రాముని దాసుడను) అని హనుమంతుడు ప్రకటించాడు. అంతేకాక సీతాన్వేషణ సమయంలో, అశోకవనంలోకి ప్రవేశించే సమయంలో రుద్ర, ఇంద్ర, యమాదులకు నమస్కరించడానికి ముందు సీతాదేవిని, లక్ష్మణసహితుడైన రామునికి నమస్కరించాడు. దీన్నిబట్టి దైవంగా కూడా హనుమంతుడు రాముణ్ణి ప్రథమస్థానంలో ఉంచాడని స్పష్టమౌతుంది. ఇలాంటి ఉదాహరణలు వాల్మీకి రామాయణంలో అనేకం కనబడతాయి.

**ప్ర) ఆంజనేయుడు సూర్యుని పుత్రిక అయిన సువర్చలను వివాహమాడాడనీ, వారిరువురికీ కల్యాణాలు కూడా చేస్తున్నారు. ఇది రామాయణంలో ఉందా? ఇంకా అనేక హనుమంతుని రూపాలలో అంతరార్థం ఏమిటి?**

**జ)** సువర్చల ప్రసక్తి రామాయణంలో లేదు. ఇది రామాయణాలకు సంబంధించిన కథకాదు. అలాగని దీన్ని తోసిపుచ్చడమూ తగదు. ఇది పూర్తిగా 'ఉపాసన'కు సంబంధించింది. ఒక మంత్రం ద్వారా ఒక దేవత చెప్పబడుతుంది. అలానే మంత్రశాస్త్రంలో హనుమ మూర్తులు, దానికి సంబంధించిన మంత్రాలు చాలా ఉన్నాయి. అందులో ఒకటి సువర్చలాంజనేయం. ఇది లౌకికమైన విషయం కాదు. మంత్రశక్తికి సంబంధించిన మంత్రం. హనుమ సూర్యుని శిష్యుడన్నది పౌరాణికకథ. మంత్రపరంగా హనుమంతుని శక్తి 'సువర్చస్సు'– తపస్సు వల్ల వచ్చే తేజస్సును 'వర్చస్సు' అంటారు. అలాంటి శ్రేష్ఠమైన ప్రకాశమే హనుమ శక్తి. శక్తి హితంగా భగవంతుణ్ణి ఆరాధించే సంప్రదాయంలో, ఆయన శక్తి అయిన సువర్చస్సునే 'సువర్చల'గా ఉపాసిస్తాం. ఇది సౌరశక్తి. ఈ సౌరశక్తితో ప్రకాశించే దైవచైతన్యమే ఈ ఆంజనేయుడు. ఈ శక్తీ సహితునిగా భగవంతుణ్ణి ఆరాధించేవారికి ఆ వర్చస్సువల్ల అన్ని ఫలాలు లభిస్తాయి. సౌర శక్తి గొప్ప వర్చస్సు గనుక దాన్ని 'సూర్యపుత్రిక' అన్నారు. సువర్చలాంజనేయులు లౌకికంగా భార్యాభర్తలు కారు. ఇది శక్తీసహితమైన దేవతోపాసన. శక్తి సమేతంగా చూడడమే కల్యాణంలో పరమార్థం. అంతేగానీ ఇది సీతారాముల, శివ పార్వతుల కల్యాణాల వంటిది కాదు.

ఒకే దేవతకు పలురూపాలు ఉండడంలో అర్థం– ఆ దేవతకు సంబంధించిన అనేక మంత్రాల వల్లనే అనేక రూపాలు. శబ్దాలకూర్పు బట్టి దేవతాకృతులు ఏర్పడతాయి. 'మంత్రం– దేవత' సంబంధం తెలిస్తే ఇది అర్థమౌతుంది. ఎన్ని మంత్రాలున్నాయో అందరు దేవతలు, అన్ని దేవతారూపాలు ఉంటాయి. అంతేగానీ అన్ని దేవతల రూపాలకూ పౌరాణికమైన కథలు ఉండవు. ఉన్నా అవీ మంత్రసంకేతాలే. అంతేగానీ జరిగిన ఇతిహాసాలు కావు. రూపం కేవలం ఆ దేవతాశక్తిని ప్రకటించే ఒక సాధనం మాత్రమే. ఆ శక్తి శబ్దంలో చెప్పినప్పుడు 'మంత్రం'. దృశ్యంగా ధ్యానించినప్పుడు 'రూపం'.

## ఆరోగ్యసమస్యలను సూచించే 12 శరీర సంకేతాలు



- నిరంతరం ఆవులింతలు– ఆక్సిజన్ స్థాయి తగ్గడం
- చెవుల్లో రింగుమనే శబ్దం– అధిక రక్తపోటు
- తల తిరగడం – లో షుగర్
- కాళ్ల వాపు – గుండె లేదా కిడ్నీ సమస్యలు
- నిరంతర అలసట– విటమిన్ డి లోపం
- చేతులు తిమ్మిర్లుపట్టడం– విటమిన్ బి12 లోపం
- నోటి దుర్వాసన – పేగుల్లో అసమతుల్యత
- నాలుక మంట – విటమిన్ బి లోపం
- తీపిపదార్థాల మీద విపరీతమైన కోరిక– మెగ్నీషియం లోపం
- వాసన తెలియకపోవడం– జింక్ లోపం
- కళ్లు పచ్చబడటం– కాలేయ(లివర్) సమస్యలు
- కాళ్లు, చేతులు చల్లబడడం– రక్తప్రసరణ లేకపోవడం



ఆంజనేయ పూజ ఒకటే ఎప్పుడూ చేయకూడదు. శ్రీరామపూజ చేసి ఆంజనేయపూజ చేస్తే చాలా మంచిది

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000



## గతసంచిక తరువాయి..

"మీ సందేహం సముచితమే! నేను కృష్ణపక్షంలో నడిరేయి పుట్టినవాణ్ణి. ఆ కారణం వల్ల నా మేను నలుపు" అన్నాడు.

"సరే! నన్ను మీదేకులం? గోత్రమేమిటి? తల్లిదండ్రులెవరు? అని నానా రకాల ప్రశ్న లడిగారు కదా! అన్నిటికి సమాధానాలు చెప్పాను. మరి మీ చెలికత్తె కులగోత్రాలు నాకు చెప్పండి" అన్నాడు శ్రీనివాసుడు.

అలాగా! తప్పక చెబుతాం. విను.

"అత్రి గోత్రజుడు, చంద్రవంశంలో పుట్టినవాడూ అయిన ఆకాశరాజుకు ఒక కూతురు. ఆమె పేరు పద్మావతి. మేము చిన్ననాటి నుండి పద్మావతి చెలికత్తెలం. మాతో ఏ మాత్రం అరమరిక లేకుండా ఉంటుంది" అన్నారు. అప్పుడా హరి-

"చెలికత్తెలారా! చాలా బాగుంది. మిమ్మల్ని ప్రీతితో, దయతో చూస్తున్న సువిలాసినితో నేను స్నేహం చేయాలని వచ్చాను. మీరు ఆవిడను పరిచయం చేయండి. నన్ను అనుమానించకండి" అన్నాడు.

ఈ మాటలన్నీ వింటున్న పద్మావతికి ఆ మాటలు తగని మాటలుగా అనిపించాయి. హరిని చూచి "వెంటనే ఇక్కడి నుండి దూరంగా వెళ్లిపో!" అని కసరింది. ఆ మాటలకు నొచ్చుకున్న హరి "లలితాంగీ! ఇంత మాత్రానికే కస్సుబుస్సులెందుకు? నాతో మంచిమాటలాడరాదా!... నేను వివాహార్థం తగిన కన్యకాన్వేషణం చేస్తున్నాను. నాకు నీవు వరించదగినదానవని అన్పిస్తుంది. నాకు కన్యాదానం చేసేవారికి ఇహపరసౌఖ్యాలూ, పరమపుణ్యాలు తథ్యం. మీ తండ్రి సమ్మతిస్తే నాకు కన్యాదానం చేయవచ్చు. నన్ను సామాన్యవ్యక్తిగా పరిగణించకండి. నేను చంద్రవంశజుణ్ణి సుమా!" అన్నాడు.

అప్పుడా పద్మావతి "మేము విహరించే పూదోట నుండి వెంటనే వెళ్లిపో! మాతో తప్పుడు మాటలెందుకు? అపరిచితుడువైన నీ మాటల్ని మా నాన్నవింటే నీ చేతికి సంకెళ్లు వేసి, కొట్టిస్తాడు. అలాంటి పరిస్థితి తెచ్చుకోకముందే నీవు వెళ్లిపోవడం మంచిది" అని కసిరింది.

"నేను అడగడంలో తప్పేమి లేదే! నేను పెళ్లికానివాణ్ణి, నీవు కన్యవు. పెళ్లి చేసుకోమనడం ధర్మప్రసంగమౌతుంది గానీ, ఏనాటికీ అధర్మం కాదు. నాతో నిష్ఠూరంగా మాట్లాడటం ఏ మాత్రం బాగులేదు" అన్నాడు హరి.

"నీవెవరవు? నాకు చిర్రెత్తేలా చేస్తున్నావు. నీకు బతకాలని లేదా?" అన్నది పద్మావతి.

"పుట్టిన వాడెవడైనా సరే పోక తప్పదు. దీనిపై నాకు ఎలాంటి విచారమూ లేదు. నేననుకున్న పని పూర్తి అయితే అన్నిటినీ నేను భరిస్తాను. నాకే మాత్రం భయం లేదు. నీవు నన్ను దయతో చూస్తే చాలు. అదే పదివేలు. పో పొమ్మని కసిరినంత మాత్రాన నేను ఈ చోటు కదలను. నిన్ను తప్పక చేపడతాను." అన్నాడు హరి. అని గట్టిగా చెప్పాడు హరి.

"తాత్కాలిక మోహంతో నీవు మాట్లాడటం మంచిది కాదు" అని మందలించింది పద్మావతి.

## 2026, జూన్ నెల ఉత్సవాలు, పర్వదినాలు

**25 - 29** తిరుచానూరు, శ్రీ పద్మావతీదేవి తెప్పోత్సవం

**25 నుండి జూలై 03 వరకు** అప్పలాయగుంట, శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం

**26 - 28** తిరుమల శ్రీవారి జ్యేష్ఠాభిషేకం

**29** ఏరువాకపూర్ణిమ

"నాకు వివేకం నేర్పుతున్నావు. బ్రహ్మదేవుడు నీ నొసట వ్రాసిన వ్రాత మాసిపోదు. నిన్ను వరించే వెళతాను" అని హరి పద్మావతికి దగ్గరగా వచ్చాడు. ఈ సన్నివేశాన్ని ఊహించని పద్మావతి చెలికత్తెలకు సైగ చేసి అతనిపై రాళ్లు విసరమని ఆజ్ఞాపించింది.

వారు అలాగే రాళ్లందుకుని గుబ్బమెక్కి అతనిపై శిలా వృష్టి కురిపించారు. హరి గాయపడ్డాడు. ఇక క్షణకాలం కూడా ఒక చోట నిలబడక, ఉత్తరం వైపు పరుగెడుతూ చివరకు వేంకటాద్రిలోని పుట్టలో ప్రవేశించి వకుళమాలిక ఆప్యాయంతో పరచిన పూలపాన్పుపై ప్రళయకాలంలో వటపత్రంపై శయనించిన పరమపురుషునిలాగా శయనించాడు.

పద్మావతి చెలికత్తెల్ని జూచి "సఖులారా! మా తల్లి చెప్పిన మాట వినని కారణాన ఇన్ని కష్టాలొచ్చాయి. నేను ఏనాటికీ మరలా పూలవనానికి రానే రాను చెలులారా! అతడు మనతో ఆడిన మాటల్ని మాత్రం అమ్మకు చెప్పకండి. అమ్మ వింటే మనకందరికీ సిగ్గుపాట్లు" అని అందలమెక్కి పట్టణానికి వెళ్లి అంతఃపురంలో మల్లెపూలపాన్పుపై పవ్వళించింది.

పరాత్పరుడైన హరి సామాన్య మానవుని లాగా మోహ, తాపాలతో ఆరాటపడుతూ వేడినిట్టూర్పులు విడుస్తూ, పాన్పుపై పొరలుతుంటే వకుళమాలిక అతని వాలకాన్ని గుర్తించింది. దగ్గరకు వచ్చి–

"అన్నా! వేంకటా! లే లే! ఆకలికి పడుకున్నావేమో! అన్నం, పరమాన్నం, భక్ష్యాలు అన్నీ సిద్ధంగా ఉన్నాయి. ఆలస్యమెందుకు? తిందువు గానీ రా!" అని పిలిచింది.

హరిలో చలనం లేదు. కళ్లవెంబడి నీళ్లు కారుస్తుంటే, వకుళమ్మ చలించిపోయింది. వేంకటమూర్తికి ఏమైందో ఏమో! అని ఆదుర్దాతో..

"నాన్నా! నీవెందుకు కన్నీళ్లు కారుస్తున్నావు. రోదించ వలసినంత అవసరం నీకేమి వచ్చింది? పగటిపూట నిద్ర తగదని తెలిసి కూడా నిద్రపోవడమెందుకు? ధైర్యం, స్థైర్యం అన్నీ వదలి దైన్యంగా కనబడుతున్నావెందుకు? లేచి కూర్చొని నాకేసి చూస్తూ నీ మనసులో ఏముందో చెప్పరాదా!" అని బతిమాలింది.

హరిలో నిట్టూర్పులు తప్ప సమాధానం రాకపోయే సరికి రకరకాల ఆలోచనలతో వకుళ సతమతమైపోయింది.

"వేంకటా! అడవికి వద్దన్నా వెళ్లావు. అక్కడి భయంకర మృగాలను చూచి జడుసుకొన్నావా? కరకురాళ్లపై అడుగులు వేస్తూ జారిపడ్డావా? వాగులోతు తెలీకపడిపోయి అతికష్టంపై లేచి వచ్చావా? నిజం చెప్పు! నేను నీకు చికిత్స చేస్తాను" అంది.

*(ఇంకా ఉంది)*

### శ్రీపదకేళి
### :: 124 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 ద్వా | ర | కా | 2 తి | రు | 3 మ | ల | | 4 రు |
| ప | | | న్న | | ర్యా | | 5 రు | క్మి |
| 6 ర | తి | | డు | | ద | | | ణి |
| యు | | | | 7 నం | | | 8 మ | |
| 9 గం | డ | కీ | న | ది | | 10 బృ | హ | తి |
| | | | | 11 ని | 12 మి | | తి | |
| 13 క | ళా | వ | తి | | త్రే | | | 14 కే |
| చ్ఛ | | | | | 15 విం | ధ్యా | వ | ళి |
| 16 పి | నా | క | ము | | ద | | | క |

# కూర్మావతార నారాయణ!

- ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు,
7893982500



శ్రీ మహావిష్ణువు దశావతారాల్లో కూర్మావతారం రెండవది. వేదాల్లో కూడా కూర్మావతార కథా ప్రస్తావన కనిపిస్తుంది. దేవదానవులు అమృత ప్రాప్తికి అబ్ధి మథనం చేశారు. మహా మంథరపర్వతాన్నే కవ్వంగా, సర్పరాజైన వాసుకిని తాడుగా మథనాన్ని ఆరంభించారు. కొంతకాలానికి మందరం సముద్రంలోకి కుంగిపోయింది. అపుడు మథన కార్యం కష్టతరమైంది. దానికి సర్వనియామకుడైన శ్రీమహావిష్ణువును దేవతలు ప్రార్థించారు. ఆ దేవదేవుడు కూర్మరూపం ధరించి ఆధారపీఠంగా నిలిచి, మంథర గ్రావాన్ని పైకెత్తి అమృత సాధనను సుసాధ్యం చేస్తాడు. ఇది కూర్మావతార కథ. ఈ అవతారానికి సముద్ర మథనం హేతువు.

**తైత్తిరీయారణ్యకం-** ప్రజాపతి, సృజించాలనే సంకల్పంతో తపస్సు చేసి శరీర కంపనం చేస్తాడు. అతడి రసం నీటిలో పడి కూర్మరూపంలో తిరుగుతూ ఉంటుంది. దాన్ని చూసిన ప్రజాపతి "నీవు నా శరీరం నుండి పుట్టిన దాన"వని అడుగుతాడు. దానికి కూర్మం "నేను ఎంతో పూర్వం నుండి ఇక్కడే ఉన్నాను" అని సహస్ర శీర్ష, సహస్రాక్షి, సహస్ర పాదాలతో తన విభవాన్ని చూపుతుంది.

**సంస్కృత సాహిత్యంలో-** సంస్కృతసాహిత్యంలో ప్రవక్తమైన కూర్మావతార వర్ణనావిభూతిని గమనింపవచ్చు. కూర్మపురాణం పేరుతో పురాణవాఙ్మయంలో కనిపిస్తూ ఉంది. కావ్య వాఙ్మయంలో కూడా కూర్మావతార కథ సూచనప్రాయంగా గోచరిస్తుంది. జయదేవుని గీతగోవిందంలో స్పష్టంగా చెప్పబడింది.

క్షితిరతి విపులతరే తవతిష్ఠతి పృష్ఠే
ధరణి ధరణ కిణ చక్ర గరిష్ఠే
కేశవ ధృత కచ్ఛపరూప జయ
జగదీశ హరే! ధ్రువం!!

(కృష్ణా! సర్వోన్నతుడవై ఉండుము. ఈ భూమి పాతాళానికి కృంగిపోకుండా, ఆది కూర్మావతారాన్నెత్తి మూపురం కాయలు కాసేటట్లు మోస్తున్నావు.

సహస్రనామాలలోనూ, స్తోత్రాలలోనూ కూర్మావతార ప్రస్తావన కనిపిస్తుంది.

ఓం అంధకార నిలయాయనమః (964) మహాద్రి ధృతేనమః (185) అని సహస్రనామాలలో కనిపిస్తుంది. అట్లే శ్రీవేంకటేశ్వర సహస్రనామాలలో పతన్మందర ధారకాయ (74) కచ్ఛపాంగాయ (76) అనే నామాలు గుర్తింపదగి ఉన్నాయి.

స్తోత్రవాఙ్మయంలో కూర్మావతార ప్రస్తావనను గమనింపవచ్చు. ముఖ్యంగా "నామ స్మరణా దన్యోపాయం నహిపశ్యామో భవతరణే" రామ హరే కృష్ణ హరే తవ నామ వదామి సదా నృహరే" అనే ప్రమాణం కనిపిస్తుంది.

"మంథరాచల ధారణ హేతో దేవాసుర పరిపాల విభో
కూర్మాకార శరీర నమో భక్తం తే పరిపాలయమామ్"

అని భజన సంప్రదాయంలో వర్ణించడం జరిగింది.

**తెలుగుసాహిత్యం:** తెలుగుసాహిత్యంలో పురాణ, కావ్య, శతక, పద, చాటుకవిత, అష్టావధాన ప్రక్రియలలో కూర్మావతార విశేషాలను గుర్తించవచ్చు. ఎర్రన నృసింహపురాణంలో కూర్మావతార వర్ణన కనిపిస్తుంది. భాగవతంలో దశావతారాల్ని, బ్రహ్మ నారదుడికి చెప్పినట్లుగా పోతన పేర్కొన్నాడు.

అమృతోత్పాదన యత్నులై విబుధులు, దైత్యులు మందరాన్ని కవ్వంగా చేసి, అబ్ధిని తఱచినపుడు, కవ్వపుకొండ వార్ధిలో మునిగింది. కూర్మరూపుడైన హరి కొండను తత్పర్వత భ్రమణ వ్యాజత వీపుతీట శమింపజేయగా తాల్చాడని బ్రహ్మ నారదునితో చెప్పాడు.

శ్రీనాథమహాకవి కూర్మావతార వర్ణన భావనాసామర్థ్యంతో

ప్రౌఢగుంభిత శబ్ద ప్రయోగరుచిరంగా, ధారాళ ధారాశైలీ మనోహరంగా కనిపిస్తుంది. శృంగారనైషధంలో కూర్మావతారాన్ని కవిసార్వభౌముడు వర్ణించాడు.

ప్రౌఢకవి మల్లన రుక్మాంగద చరిత్రలో కూర్మావతార ప్రస్తావన చేశాడు.

ప్రబంధ యుగానికి యుగపురుషుడైన శ్రీకృష్ణదేవరాయలు తన ఆముక్తమాల్యదలో విష్ణుచిత్తుడు శ్రీమహావిష్ణువును స్తుతించే సందర్భంలో దశావతారాల వర్ణన చేశాడు.

**మ॥ జలపూర్ణ ప్లవమాన మృణ్మయ మహీ సంరక్షకై గార యా**
**బలె ముక్తామణి శుక్తి శంఖ నికురంబం బెల్లం జూర్ణంబుగా**
**బలభిద్వజ్ర సదృక్షినోఁ పరిపరి భ్రామ్యన్మహా మందరా**
**చలసంఘృష్టి ఘరట్టమైన కమఠస్వామి న్నినుం గొల్చెదన్.**
**(ఆముక్తమాల్యద, 4-20)**

సముద్ర మథనకాలంలో ఆదికూర్మం వీపు మీద మందరం తిరగడం, వాటి నడుమ ముత్యాలు, ముత్యపు చిప్పలు, శంఖాలు, సున్నం లాగా నలిగిపోవడం, ఎలా ఉందంటే మృణ్మయ వికారమైన భూమి నీటిలో తేలడం చేత నాని నాని కరిగి పోతుందేమో అని స్థితికరుడవైన నీవు శంకించి భూమిని కరగ నీయక కాపాడేదానికి భూమికి గార పూయడంకోసం నీవు కూర్మ మూర్తివై వజ్రాయుధంలాగా కఠినమైన నీ వీపును పర్వతం క్రింద తిరగలిగా ఉంచి ముక్తామణి శుక్తి శంఖ నికురంభాన్ని సున్నంగా నూరిస్తున్నావో అన్నట్లుంది అని రాయలు చక్కగా ఉత్ప్రేక్షించాడు.

మనుచరిత్రలో స్వారోచిషుడు విష్ణువును గూర్చి తపస్సు చేస్తాడు. ఆ దేవదేవుడు ప్రత్యక్షమౌతాడు. అపుడు పెద్దన దశావతార వర్ణనను స్వారోచితో చేయించాడు. ఆ సందర్భంలో కూర్మావతారాన్ని -

**చ॥ చటులకృపీటసంస్థితరసాస్థలి వ్రీలక యుండ గార యి**
**చ్చుటకునుబోలె శంఖమణిశుక్తికదంబము నుగ్గుగా విశం**
**కటచరమాంగమంథగిరి ఘట్టనఁజేసి ఘరట్టమై కృపా**
**పటిమజగంబుఁ బ్రోచునల ప్రాక్కమఠంబునినున్ భజించెదన్.**
**(మనుచరిత్ర 6-108)**

నీళ్లలో తేలుతున్న భూతలాన్ని ప్రిదిలి విచ్చిపోకుండా కాపాడి సున్నపు గచ్చు చేయటానికో అన్నట్లు శంఖాలు, మణులు, ముత్యపు చిప్పలు- నుగ్గుగా చేయటం కోసం మంథరపర్వతం మీది రాయిగా, తన వీపు అడుగు రాయిగా చేసి లోకాల్ని దయతో బ్రోచిన ఆదికూర్మాన్ని భజిస్తాను అని వర్ణించాడు.

ముక్కుతిమ్మన పారిజాతాపహరణంలో, రామాభ్యుదయంలో అయ్యలరాజు రామభద్రుడు కూర్మావతార వర్ణన సూచన మాత్రంగా చేశారు. పాండురంగ మాహాత్మ్యంలో తెనాలి రామకృష్ణుడు, కళాపూర్ణోదయంలో పింగళిసూరన, రాధికా సాంత్వనంలో ముద్దుపళని మొదలైనవారు కూర్మావతార ప్రస్తావన చేశారు.

ధరణిదేవుల రామయమంత్రి దశావతార చరిత్రలో దశావతారాలను చాలా విపులంగా వర్ణించాడు. ఒక్కొక్క అవతారాన్ని ఒక్కొక్క ఆశ్వాసంలో చెప్పాడు. తరిగొండ వేంగమాంబ సూచన ప్రాయంగా కూర్మావతార ప్రసక్తి చేసింది. ఇక పదకవులైన అన్నమయ్యాదులు అనేక సంకీర్తనాలలో కూర్మావతార ప్రస్తావన చేశారు. అట్లే రుక్మిణీ శతకం, ముకుంద శతకం, సీతాపతి శతకం. మాధవ శతకం మొదలైన శతకాలలో కూర్మావతార వర్ణనలు కనిపిస్తాయి. అనేక చాటుపద్యాలలో కూడ కూర్మావ తార వర్ణనలు కనిపిస్తాయి. ముఖ్యంగా ఎలకూచి బాలసరస్వతి కూర్మావతార వర్ణనలు కనిపిస్తాయి. ముఖ్యంగా ఎలకూచి బాలసరస్వతి కూర్మావతార వర్ణన గల చాటుపద్యం గుర్తింపదగింది. తెలుగు సాహిత్యంలో పురాణ, కావ్య, ప్రబంధ, పదకవిత, శతక, చాటు కవితల్లో కూర్మావతార వర్ణనా వైచిత్రి ప్రతిభాపూర్వకంగా ప్రదర్శితమైన విధానం అత్యంత అద్భుతంగా కనిపిస్తుంది.



# అణువణువునా భగవత్ తత్త్వాన్ని దర్శించిన యోగి

– పద్మశ్రీ డా॥ శోభారాజు



రక్తసంబంధమున్న తండ్రి మనకు సంపదను ఇస్తాడు. అది ఖర్చు చేసుకుంటే తరిగి పోయే నిధి. కానీ మన తెలుగు జాతి ఎన్నిసార్లు పాడుకున్నా, ఎంతమందికి నేర్పించినా, తరగని సంకీర్తనానిధిని అన్నమాచార్యుల వారు మనకందించారు.

ఈ సంకీర్తనామంత్రాలతో, కరడుకట్టిన ఈప్రపంచాన్ని పునఃపునః పుణ్యాహ వచనం చేసి మనం ప్రక్షాళన చేసుకునేటువంటి అద్భుతమైన సంకీర్తనలు మనకు అందించిన సత్పురుషులు, మహావాగ్గేయకారులు అన్నమాచార్యులు.

పూర్వకాలంలో భగవదనుగ్రహం పొందాలంటే యజ్ఞయాగాదులూ, కఠోర తపస్సులూ, దానధర్మాలూ అనేకం చేసేవారు. కలియుగంలో మానవజాతి విలువలు తగ్గుతాయని బహుశా పెద్దలు గ్రహించారేమో భగవదనుగ్రహానికి చాలా సులభమైన మార్గాన్ని సూచించారు– అదేమిటంటే సంకీర్తన.

అడవుల్లోనూ, గుహల్లోనూ కూర్చుని మహా యోగులు చేసే తపస్సు ద్వారా వారికి భగవదనుగ్రహం కలిగేది అంటారు.

కానీ ఈ సంకీర్తన– ఆత్మను సంధానంచేసుకుని ఒక్కసారి సంకీర్తన పాడగలిగితే హృదయంలోనే స్వామి సాక్షాత్కరిస్తాడు. అంతటి సులభమైన గొప్ప సాధన కలియుగంలో మనకు సాధ్యమైంది. అందుకే అన్నమయ్య అంటారు–

చాలదా హరినామ సౌఖ్యామృతం తమకు
చాలదా హితవైన చవులెల్ల నొసగ
ఇది ఒకటి హరినామ మింతైన చాలదా
చెదరకీ జన్మములో చెఱలు విడిపింప
మదినొకటి హరినామ మంత్రమిది చాలదా
పదివేల నరక కూపములు వెడలింప

అన్నమయ్య సంకీర్తనలన్నీ మంత్రాలు. ఈ సత్యం అన్నమయ్య జీవితకాలంలోనే ఋజువైంది. మనకందరకూ తెలుసు సాళువ నరశింగరాయల రాజాస్థానంలో జరిగిన ఉదాహరణ రాజు తనమీద ఒక సంకీర్తన పాడమని ఆచార్యుల వారిని అభ్యర్థిస్తే – "హరిహరీ నరహరిని స్తుతియించు నా నాలుక నరుని స్తుతించగా నేరదు"– అని చెవులు మూసుకున్నారట. తన రాజ్య విస్తారానికి ఆశీర్వచనం కావాలని ఆచార్యుల వారిని ఎంతో గౌరవంగా రాజాస్థానానికి ఆహ్వానించిన రాజు, అది మరచి, కృతజ్ఞతావిహీనంగా ఆచార్యుల వారిని చెఱసాల పాలుచేస్తాడు. ఆ చెఱసాలలో అన్నమయ్య పాడిన పాట–

"ఆకటి వేళల అలపైన వేళలను
తేకువ హరినామమే దిక్కు మరి లేదు"

ఇంత గంభీరమైన సంకీర్తనారచన చేసిన అన్నమయ్య చిన్న చిన్న తెలుగు మాటలతో ఎన్నో జానపద గీతాలు రచించారు. అందులో చాలా ప్రజాదరణ పొందిన సంకీర్తన, దశావతారాల కీర్తన–

శిరుత నవ్వుల వాడె శిన్నెక
వెఱపెఱఁగడు సూడవే శిన్నెకా
------------------

అన్నమయ్య అణువణువునా భగవత్ తత్త్వాన్నే దర్శించారు. ప్రతి సంకీర్తనలోనూ అనంత తత్త్వాన్నే ప్రతిపాదించాడు, చాలా విశాలతత్త్వాన్ని ప్రతిపాదించాడు. ఆ తత్త్వాన్ని అర్థం చేసుకోకుండా కేవలం నాలుగు సంకీర్తనలు పాడుకోటానికి మాత్రమే వాడుకుంటే అది మహాదోషం. ఎందుకంటే ఆచార్యుల వారి సంకల్పం, సంకీర్తనల ద్వారా మనకందించిన తత్త్వం, ఆ సందేశాన్ని మనం జీవితంలోకి అనువదించుకుని, జీవితాన్ని క్రతువు చేసుకున్నప్పుడే ఆయన బృహత్ ప్రయత్నానికి ఒక సార్థకత. లేకపోతే వారిచ్చిన ఈ సంకీర్తనానిధికి మనం న్యాయం చేయలేం. అన్నమాచార్యసంకీర్తనల్లో ప్రస్ఫుటంగా గోచరించే భావం శరణాగతి. మనంగా మనం మోక్షానికి అర్హులు కావటం చాలా కష్టసాధ్యం. అదే స్వామికి శరణాగతి జొచ్చినపుడు అది అనంతుని దివ్యానుగ్రహంతో సులభమౌతుంది. మనం ఒక్క కొబ్బరికాయ కొట్టి స్వామిని వెయ్యికోరికలు అడుగుతాం గదా, 32 వేల సంకీర్తనలు రచించి, అంతటి ప్రతిభాపాటవాలున్న అన్నమయ్య ప్రబంధరచన చేసి ఉంటే బహుశా రాజాస్థానంలో ఆయన ఎంత పూజనీయస్థానం పొంది ఉండేవారో, ఎన్ని రాజమర్యాదలు, పదవులూ అందుకునేవారో. వాటన్నింటినీ గర్హించి అన్నమయ్య కోరుకున్నది ఒక్కటే అదే భగవదనుగ్రహం!

తన అగ్రహారాలన్నింటినీ స్వామిసేవకే అర్పించాడు. తన జీవితాన్నంతా స్వామివారికే అంకితం చేశాడు. ప్రతిగా కోరుకున్నది- స్వామిసేవ, స్వామి నామగానం, స్వామి సందర్శనం తప్ప ఇంకేమీ వద్దన్నాడు అన్నమయ్య.

**గ్రంథసమీక్ష**

# యద్భావం తద్భవతి

## ఆధ్యాత్మిక కథలు

**రచయిత-** ఆర్.సి.కృష్ణస్వామి రాజు; **సైజు-** 1/8 డెమ్మీ; **పుటలు**-136; **మూల్యం**-రూ. 160/-; (పోస్టేజీ అదనం) **ప్రతులకు-** 22-4-71, బ్యాంక్ ఎంప్లాయిస్ కాలనీ, అక్కారంపల్లి పోస్ట్, తిరుపతి. సెల్-93936 62821.

అధర్మం వైపు వెళ్తున్న ప్రతీసారీ మనిషిని అంతరాత్మ హెచ్చరిస్తూనే ఉంటుంది. ధర్మం తప్పకుండా మనల్ని ఓ కంట కనిపెడుతూ, మనలో ఉండే అంతరాత్మే దైవం! ఈ దేవుడు ఉన్నాడని ఋజువు చేసిన పుస్తకం **'యద్భావం తద్భవతి'**. ఆర్.సి.కృష్ణస్వామిరాజు రచించిన అరవై ఆధ్యాత్మిక కథల సమాహారమే ఈ 'యద్భావం తద్భవతి'.

ఆధ్యాత్మికత అంటే ఆమడ దూరం పారిపోయే యువతకు సైతం కనువిప్పు కలిగించే కథలు ఇందులో ఉన్నాయి. మన సనాతనధర్మంలో ఉన్న ఆచారాలన్నీ శాస్త్రీయ ఆధారాలతో మానవాళికి మేలు చేసేవే! అయితే భారతదేశం మీద జరిగిన వివిధ భౌగోళిక, సాంస్కృతిక దాడుల్లో మనం విజ్ఞాన సంపదను కొంత కోల్పోయినప్పటికీ, ప్రజల మనస్సులో నాటుకున్న ఆధ్యాత్మికత ఆ జ్ఞానాన్ని మనకు అందేలా చేసింది.




మన సంస్కృతి, సంప్రదాయాలను నిశితంగా పరిశీలిస్తే, నేటి తరానికి కావాల్సిన నైతిక విలువలెన్నో నిక్షిప్తమై ఉంటాయి. రచయిత తన కథ 'పూడిక తీత' ద్వారా అదే విషయాన్ని చెప్పారు. మన ప్రయత్నం లేకుండా అద్భుతాలేవీ జరగవని మరో కథ ద్వారా తెలిపారు. ఆధ్యాత్మికత మనిషిలో ఆత్మస్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపి మనిషిని పరిపూర్ణుడిగా తీర్చిదిద్దే సాధనంగా ప్రతీ కథలోనూ అభివర్ణించారు. చిన్న చిన్న విషయాలకే మనస్తాపం చెందుతూ, పెద్ద పెద్ద నిర్ణయాలు తీసుకుంటున్న వారికి ఇలాంటి కథలు జీవితం పట్ల సానుకూల దృక్పథాన్ని కలిగిస్తాయి.

మనసు, మాట ఎవరికైతే అదుపులో ఉంటాయో వారెప్పుడూ ధర్మ మార్గంలోనే నడుచుకుంటారు. వాటిని అదుపులో ఉంచే శక్తి దైవానికే సొంతం. అందుకే రచయిత ఈ పుస్తకానికి ఆధ్యాత్మికచింతన అనే అంశాన్ని ఆయువుపట్టుగా చేసుకుని ఆసక్తికరమైన కథలుగా మలిచి నేటి సమాజానికి తన వంతు బాధ్యతగా అందించారు.

**- డా॥హారిక చెరుకుపల్లి**

# అనుకున్నవన్నీ జరగాలంటే..!

- శ్రీ డి.వి.ఆర్.భాస్కర్,
99121 99394

వినాయకుని అనుగ్రహం పొందేందుకు మనం ప్రతియేటా భాద్రపదశుద్ధచవితినాడు వినాయకచవితి పర్వదినం జరుపుకుంటాం. అయితే తలపెట్టిన ఏ పనీ ముందుకు పోక, అన్నిటా విఘ్నాలు కలుగుతూ, అశాంతి, శారీరక, మానసిక రుగ్మతలు, రుణబాధలు, జీవితంలో అనేక రకాలైన కష్టాలు కలుగుతూ ఉన్నప్పుడు, దుష్టగ్రహాల పీడతో నానారకాలైన బాధలు అనుభవించే వారు ప్రతి మాసంలోనూ సంకటహర చతుర్థినాడు యథాశక్తి విఘ్నేశునికి పూజలు జరిపితే ఈ కష్టాలన్నీ తొలగి సుఖసంతోషాలు కలగడంతోబాటు, కార్య జయం కలుగుతుంది.

వేద, పురాణ, ఇతిహాసకాలాల నుంచి ఆధునిక కాలం వరకు గణపతి ఆరాధన విస్తృతంగా జరగటం తెలిసిందే. వినాయక శబ్దానికి విశిష్టమైన వాడని, నాయకులు లేనివాడని అర్థం. గణపతి జ్ఞానానికి అధిదేవత. గణాల అధిపతిగా



గణపతి పేరు సార్థకమైంది. మానవులందరికీ మంచి చేసే వారిని గణపతి అని అంటారు. మానవునిలోని చెడును హరించే వాడికి గణపతి అని, వినాయకుడని పేరు. వినాయకునికి రోగహర శక్తి ఉంది.

గణపతితో సమానమైన పేరుగల బ్రాహ్మణస్పతి లేదా బృహస్పతి గురించి ఋగ్వేదంలో సవివరమైన ప్రస్తావన కనిపిస్తుంది. తనను ఆరాధించేవారిని గణపతి ఎల్లవేళలా కాపాడుతుంటాడు. బ్రహ్మచర్యం అవలంబించి వేదవేదాంగాలు, శాస్త్రాలు అధ్యయనం చెయ్యవలసిన విద్యార్థులకు గణేశుడు ఆశ్రయదాత పోషకుడు.

## సంకటహరచతుర్థి ఎప్పుడు వస్తుంది?

ప్రతిమాసంలోనూ వచ్చే బహుళచతుర్థి (బహుళ చవితి)ని సంకటహర చతుర్థి లేదా సంకట విమోచకచతుర్థిగా పిలుస్తారు. జాతకంలో కేతు మహర్దశ నడుస్తున్నవారు, కష్టాలు కడగళ్లను అనుభవించేవారు, తరచు కార్యహాని కలుగుతున్న వారు ఈ వ్రతం చేయడం మంచిది. ఆ రోజున పగలంతా ఉపవాసం ఉండి సాయంత్రంపూట గుడికెళ్లి గరికపై ప్రమిద నుంచి దీపారాధన చేసి, గరికపోచలు, పుష్పాలు, పత్రితో గణపతిని పూజించి, లడ్డూలు లేదా ఉండ్రాళ్లు నివేదించి ఆ ప్రసాదాన్ని స్వీకరించాలి. ప్రతి మాసంలోనూ వచ్చే సంకట హరచతుర్థినాడు ఇదేవిధంగా ఆచరించగలిగితే సకలదోషాలూ పోయి, సత్ఫలితాలు కలుగుతాయి. కార్యజయం కలుగుతుంది. ప్రతి బహుళచతుర్థి నాడు వినాయకచవితిరోజు చేసినట్లే పత్రితోనూ, పుష్పాలతోనూ గణపతికి పూజ చేస్తే అన్నివిధాలుగా



అభివృద్ధి చెందుతారు. కష్టాలతోనూ, సమస్యలతోనూ బాధపడేవారు సంకటహరచతుర్థి వ్రతంతోపాటు సంకట విమోచక గణపతి స్తోత్రాన్ని విడవకుండా ఆరుమాసాలపాటు పఠించడం వల్ల చక్కటి ఫలితముంటుంది. వ్రతాన్ని ఆచరించలేనివారు కనీసం సంకటహర గణపతి స్తోత్రాన్ని నాలుగుసార్లు పారాయణ చేసినా మంచిదే. ఈ వ్రతాచరణ వల్ల విఘ్నాలు తొలగి పనులు సజావుగా సాగుతాయి. కేతుగ్రహబాధలు తొలగుతాయి.

## గణపతిపూజ ఆచరించాలి ఇలా...

ఏ పని చేపట్టినా ముందుకు సాగక ఇబ్బందులు పడేవారు బుధవారం లేదా చవితి తిథి లేదా వేరే ఏదైనా మంచి తిథినాడు దంతధావనం కూడా చేయకుండానే **'ఓం గం గణపతయే నమః'** అనే మంత్రాన్ని 21 మార్లు పఠించాలి. ఇలా కనీసం 21 రోజులు విడవకుండా పఠించడం వల్ల శుభం కలుగుతుంది. అయితే అది పెద్దలసలహాతో ఆచరించడం మంచిది.

ఏ పూజలోనైనా ముందుగా హరిద్రా గణపతిని (పసుపుతో గణపతి ప్రతిమను చేసి, తమలపాకులో ఉంచాలి) పూజించడం మంచిది.

వినాయకచవితినాడు తప్ప తక్కినరోజుల్లో ఆయనను తులసిదళాలతో పూజించరాదు.

గరికపోచలతోనూ, పత్రితోనూ పూజిస్తే గణపతి ప్రసన్నుడౌతాడు. నారికేళం, అరటిపండ్లు, ఉండ్రాళ్ళు, కుడుములు, వడపప్పు నివేదిస్తే సంతుష్టుడౌతాడు.

గణపతిని పూజిస్తే లక్ష్మి, సరస్వతి, పార్వతి ముగ్గురి ప్రసన్నతా లభిస్తుంది. బుధవారం నాడు గణపతి ప్రీత్యర్థం తెల్లటివస్త్రాలు ధరించడం మంచిది.

## మీకు తెలుసా...

- **గణపతికి మూడు వత్తులతో దీపారాధన ప్రశస్తం.**
- **గణపతిప్రతిమను ఉత్తరముఖంగా ఉంచడం మంచిది.**
- **గుంజీళ్లు తీస్తే గణపతి ప్రసన్నుడౌతాడు.**
- **ఇంటిలో వాస్తుదోషం ఉందని తెలిసి, దాన్ని తొలగించడం సాధ్యంగాక ఏం చేయాలో తెలీక సతమతమయ్యేవారు దోషం ఉన్న ప్రదేశంలో పసుపుకొమ్ముతో లేదా తెల్లజిల్లేడు వేరుతో రూపొందించిన వినాయకుని ప్రతిమను ఉంచి ప్రతి రోజూ ధూపదీపనైవేద్యాలు సమర్పించడం వల్ల దోషం చాలా వరకు తొలగుతుంది.**
- **ఏదైనా ముఖ్యమైన పనిమీద బయల్దేరి వెళ్లేటప్పుడు *"వక్రతుండ మహాకాయం కోటిసూర్యసమప్రభం నిర్విఘ్నం కురుమేదేవ సర్వకార్యేషు సర్వదా"* అని చదువుకుని వినాయకునికి భక్తితో నమస్కరించి వెళితే కార్యజయం కలుగుతుంది.**
- **గణపతికి 21 ఇష్టమైన సంఖ్య. కాబట్టి ఏదైనా కోరిక కోరుకొని వినాయకునికి 21 ఉండ్రాళ్లు నివేదిస్తానని మొక్కుకుని, కోరిక తీరిన తర్వాత ఆ మొక్కు తీర్చుకుంటే మంచిది.**
- **జిల్లేడు, పల్లేరు, గరిక వినాయకునికి ప్రీతికరమైనవి. గణేశునికి చేసే పూజలో వాటిని ఉపయోగిస్తే మంచిది.**

# విశేషాల వైశాఖం

- శ్రీమతి పి. రమాదేవి

'విశాఖ' అయిదు నక్షత్రాల కూటమి. విశాఖకు కాంతిని వ్యాపింపచేసేది అని అర్థం. అలాంటి విశాఖ నక్షత్రంతో కూడిన పున్నమకు వైశాఖి అనిపేరు. ఏ మాసంలో వైశాఖి పూర్ణిమ వస్తుందో ఆ మాసానికి వైశాఖమాసమని పేరు. వైశాఖిని మహావైశాఖి అని గొప్పగా చెబుతారు.

## వైశాఖస్నాన విశేషం

పృథ్వీచంద్రోదయంలో విష్ణుస్మృతి పద్మపురాణాల్లో చెప్పబడింది. తులా, మకర, మేషమాసాలలో చేసిన ప్రాతః స్నానం హవిష్యం(హవిష్యమంటే హవిస్సు. అనగా అగ్నియందు వ్రేల్చుటకు ఇగురబెట్టిన అన్నం) ఇది మహాపాతకాలను నశింప చేస్తుంది. ఈ విషయం సౌరమానాన్ని అనుసరించి చెప్ప బడింది.

## చాంద్రమాసవిషయం పద్మపురాణంలో ఇలా...

"వైశాఖం సకలం మాసం మేషసంక్రమణేరవేః
ప్రాతఃస నియమః స్నాస్యే ప్రీయతాం మధుసూదనః
మధు హంతుః ప్రసాదేన బ్రాహ్మణానాం మనుగ్రహాత్
నిర్విఘ్నమస్తుమేపుణ్యం వైశాఖ స్నానమన్వహమ్"

వైశాఖమాసంలో శుక్ల ఏకాదశియందు, పూర్ణిమ యందు, మేషసంక్రమణంలో బ్రాహ్మణుల అనుజ్ఞతో సంకల్ప పూర్వకంగా మధుసూదనుని పూజించి, వైశాఖస్నానం నియమంగా చేయాలి.

## అప్పుడు చెప్పవలసిన మంత్రార్థం..

"నేను వైశాఖ మాస మంతా స్నానం చేస్తాను, మధుసూదనుడు సంత సించుగాక! విష్ణుమూర్తి దయచేత బ్రాహ్మణుల అనుజ్ఞ వల్ల ప్రతి దినం వైశాఖపుణ్యస్నానం ఆటం కాలు లేకుండా జరుగు గాక! మధుసూదన! నా పాపం హరించి ఫలము నిమ్ము!"

## ఎక్కడ స్నానమాచరించాలి?

ఈ స్నానాన్ని నదియందు, సరస్సు నందు, సెలయేటి యందు దైవనిర్మితమైన తటాకంలో, బావిలో విష్ణువును స్మరిస్తూ చేయాలి. స్నాన సమయంలో తీర్థనామం చెప్పాలి. తీర్థనామం తెలీనప్పుడు విష్ణుతీర్థమని చెప్పాలి. అన్ని తీర్థాలకు విష్ణువే దేవత!

## వైశాఖస్నాన ఫలితం

వైశాఖమాసంలో తులసితో విష్ణువును పూజిస్తే నరుడు నారాయణుడౌతాడు. ఈ మాసమంతా మూడు వేళల తులసితో విష్ణువును పూజించినవారికి మళ్లీ జన్మముండదు. విధి ప్రకారం స్నానంచేసి రావిచెట్టుకు సమృద్ధమైన నీరుపోసి, ప్రదక్షిణం చేయాలి. రావిచెట్టు సర్వదేవాత్మకం. ఈ విధంగా నీరుపోసిన వారి వంశీయులు పదివేలమంది నిస్సంశయంగా తరిస్తారు. ఆవును పృష్ఠంవైపునగోకి, రావిచెట్టుకు నీరుపోసి గోవింద నామస్మరణ చేసినవారు దుర్గతిని పొందరు. వైశాఖంలో ఏకభుక్తం చేసి క్రింద పరుండి యాచన చేయనివారు సర్వ



కోరికలను పొందుతారు. ఈ మాసంలో శాస్త్రప్రకారం నదీ స్నానం, హవిష్యం, బ్రహ్మచర్యం, భూశయ్య, దానం, మధు సూదన పూజ చేసినవారికి వేయిజన్మాల పాపం నశిస్తుంది.

## విశేషపండుగలమాసం వైశాఖం

### వైశాఖ శుక్ల తదియ

ఈ వైశాఖ శుక్ల తదియను అక్షయతృతీయ అంటారు. ఈ అక్షయతృతీయ సోమవారంనాడుగాని, బుధవారం నాడు గాని అయితే మరీ పవిత్రమైంది. కృత్తిక, రోహిణీనక్షత్రాలతో కూడిన ఈ పర్వం అతి ప్రశస్తం, ఈనాడు చేసే దానాలు అక్షయఫలాన్నిస్తాయి. ఈ వైశాఖ శుద్ధ తదియ 'బలరామ జయంతి' అని పంచాంగాలు పేర్కొంటున్నాయి.

### వైశాఖ శుద్ధ పంచమి

ఈ వైశాఖశుద్ధపంచమితిథి యందు శంకరాచార్యులు అవతరించినందున ఆనాడు శృంగేరి మున్నగు జగద్గురుపీఠా లలో జయంత్యుత్సవాలుగా అనాదిగా జరుగుతూ వస్తున్నాయి.

### వైశాఖ శుద్ధషష్ఠి

ఈ వైశాఖ శుద్ధ షష్ఠి శ్రీమద్రామానుజుల జయంతి. శంకర, రామానుజ, మధ్వ అను త్రిమతాచార్యులలో ఈయన రెండవవారు. విశిష్టాద్వైతమతోద్ధారకుడు.

### వైశాఖశుద్ధసప్తమి

గంగానది జహ్నుముని చెవినుండి పుట్టినరోజు వైశాఖ శుద్ధసప్తమి. కాగా ఈ రోజున గంగానదిలో స్నానం చేసి పూజ చేయాలి. శర్కరాసప్తమి, నింబాసప్తమి, అనోదసప్తమి, ద్వాదశ సప్తమి మున్నగు వ్రతాలు ఈనాడు చేస్తారని "చతుర్వర్గ చింతామణి" గ్రంథం చెబుతోంది.

### వైశాఖ శుద్ధ ఏకాదశి

దీనికే 'మోహినీ ఏకాదశి' అనిపేరు. ఈ రోజున దీన్ని ఆచరిస్తే విశేషపుణ్యం లభించి ధనవంతులౌతారు.

### వైశాఖ శుద్ధ ద్వాదశి

ఈ రోజును చతుర్వర్గ చింతామణి జామదగ్న్య వ్రత దినమని చెప్తూ పరశురామ జయంతి అని చెప్పింది. ఇదే విషయాన్ని పంచాంగాలలో ఈనాటి వివరణలతో 'పరశురామ ద్వాదశి' అని చెప్పింది. కనుక ఈరోజే 'పరశురామ జయంతి' చేసుకోవాలి.

### వైశాఖ శుద్ధ చతుర్దశి

స్మృతి దర్పణం, గదాధర పద్ధతి, పురుషార్థ చింతా మణి, చతుర్వర్గచింతామణి మున్నగు గ్రంథాలన్నీ వైశాఖశుక్ల చతుర్దశిని నరసింహ చతుర్దశి వ్రతదినంగా పేర్కొన్నాయి. కాగా ఈనాడే నృసింహజయంతి అని చెప్పబడింది.

ఈరోజున నరసింహమూర్తిని పూజిస్తే శత్రుజయం కల్గుతుంది. అంతేగాక దుష్టగ్రహపీడలు తొలగి అష్టైశ్వర్యాలు కలుగుతాయని హేమాద్రి, నృసింహపురాణం, స్కాంద పురాణాలు వివరిస్తూ ఉన్నాయి.

### వైశాఖ శుద్ధ పూర్ణిమ

ఈ రోజున సముద్రస్నానం చేయాలి. అది పాపాలను తొలగిస్తుంది. ఈనాడు ధర్మరాజు ప్రీతిని కోరి నానావిధ దానాలు చేశాడనీ, ఇలా చేయడంవల్ల అనంత ఫలితాల్ని పొందాడని తిథితత్త్వం చెబుతోంది.

మరొక విశేషం – ఈరోజున శివుడు శరభావతారాన్ని ఎత్తాడు. విష్ణువు నృసింహావతారమెత్తి హిరణ్యకశిపుణ్ణి సంహ రించాడు. తరువాత కూడా నరసింహమూర్తికి ఉగ్రం తగ్గలేదు. తుదకు లక్ష్మీదేవి కూడా ఆ రౌద్రాన్ని తగ్గించలేకపోయింది. అప్పుడు దేవతలంతా శివుణ్ణి ప్రార్థించగా శివుడు ఈ రోజున శరభావతారాన్ని ధరించి సింహ ఉగ్రాన్ని ఆపాడు. కనుక శరభ జయంతి అయ్యింది.

ఇంకొక విశేషం– విష్ణువు కూర్మావతారం ధరించి, పాలసముద్రంలో మందర పర్వతం మునిగిపోకుండా కాపాడాడు. అందువల్ల దేవతలు, రాక్షసులు సులువుగా పాల సముద్రాన్ని చిలికారు. కనుక ఈరోజు కూర్మజయంతి అయ్యింది.

### వైశాఖ బహుళ విదియ

ఈరోజు నారద జయంతి. ఈనాడు వీణను దానం చేయాలని మతగ్రంథాలలో ఉంది. నారదుడు సదా విష్ణుగానం చేస్తూ త్రిలోకాలలో సంచరిస్తూంటాడు. కనుక ఈరోజు నారద జయంతి ప్రశస్తిని పొందింది.

ఈ ఒక్క వైశాఖమాసంలోనే ఇన్ని చారిత్రాత్మక పండుగలుండటం వల్ల వైశాఖమాసం వైశిష్ట్యాన్ని పొందింది.



ధారావాహిక

# తిరుమల సమయాచారములు

## (తిరుమల-తిరుపతి ఐతిహ్యమాల)

తెనుగు అనువాదకులు:
కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,
కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు

*(గత సంచిక తరువాయి భాగం...)*

బ్రహ్మ బ్రహ్మాండ వామనపురాణాల్లో తిరుమల కొండను ప్రాకృతశరీరంతో త్రొక్కమని శుకాదులు పర్వత పరిసరాల్లోనే ఉండి భగవదనుభవం చేసుకోవడాన్ని భగవన్నిర్హేతుక కటాక్షం చేత సాక్షాత్కృత భగవత్స్వరూప రూపగుణ విభూతి విశేషాలుగలవారైన ఆళ్వారులు కూడ తెలిసి స్వస్వస్థానాలందే ఉండి మంగళాశాసనం చేస్తూ కృతార్థులైయున్న రీతిని శ్రీభాష్యకారులు తమ దివ్యహృదయంలో చింతించి శ్రీరంగాది దివ్యదేశాల్లో ఆళ్వారుల శ్రీ ప్రతిష్ఠను చేయించి ఆళ్వారుల దివ్యహృదయం నరసిన వారవడంచేత తిరుమలలో ఆళ్వారులను ప్రతిష్ఠ చేయకయుండి తాము కూడ ఆళ్వారులవలే శ్రీవేంకటాచలాన్ని అధిరోహింపక ఒక విశిష్టసమయంలో ఒక ముఖ్యకారణంచేత మూడు దినాలు శుష్కోపవాసంతో ఉండి, శరీరశోధన చేసుకుని వేంకటాచలాన్ని ఆరోహించి శ్రీస్వామి వారికి దివ్యశంఖచక్రాలు ధరింపజేసి మంగళాశాసనం చేసి ఉండడాన్ని ఆకాలంలో పెద్దలైన స్థలాభిమానులమూలంగా తెలిసి శ్రీవృశ్చిక (కార్తికై) మహోత్సవంలో శ్రీవేంకటాచలపతి శాసనాన్ని ఆళ్వారులకు ప్రసాదించేటట్లు కట్టడచేసి అధ్యయనోత్సవంలో శ్రీమణిమండపంలో మిగిలిన ఆళ్వార్లకు ఆచార్యులైన నమ్మాళ్వార్లకు ఆచార్యులైన సేనై మొదలియార్ అనే విష్వక్సేనులను, అనంతార్యుల కైంకర్యమైన అర్చారూపియై విజయం చేయింపబడినవారైన శ్రీవైష్ణవదర్శనాభిమానియైన శ్రీభగవద్రామానుజులను కూడ స్వామివారి సన్నిధిలోనే విజయంచేయించి ఆళ్వారుల శ్రీసూక్తులైన దివ్యప్రబంధాలను స్వామివారు ఆకర్ణించి ఆనందించేనట్లుగా శ్రీమణవాళ మహామునులు కట్టడ చేశారని పెద్దలు చెబుతారు.

శ్రీగోవిందరాజస్వామి, శ్రీవేంకటేశ్వరుడు ఛాయానువర్తనం చేయువారగుటచేత తమ సన్నిధికి శ్రీభగవద్రామానుజుల నియమనంచొప్పుననే ఆళ్వారులు విజయం చేసి ఉన్నారు శ్రీముఖపట్టం మాత్రం పంపించడం. మిగిలిన శ్రీరామానుజ దర్శనాలన్నీ పేరోలగంలో జరేగేటట్లు పెద్దలు నియమనం చేశారు.

సాళువ నరసింహరాయలు ప్రభువై రాజ్యమేలుచుండగా మ్లేచ్ఛదండయాత్ర సంభవింప వారీ దేశానికి వచ్చి దేవబ్రాహ్మణ హింస చేస్తుండగ అప్పుడు వీరనరసింహరాయలు శ్రీవేంకటాచలపతి పాదారవిందాలపై భక్తిగలవాడవడంచేత తిరుమలలో మలైకునియనిన్ట పెరుమాళ్లను, గోవిందరాజస్వామి మున్నగువారిని, శ్రీభండారాన్ని పాపవినాశతీర్థానికి తూర్పుగా అతి గోప్యమగు గుహలో విజయం చేయించి నిత్యారాధన తప్పకుండా జరిపిస్తూ పెద్దపెరుమాళ్ల విగ్రహానికి రక్షకంగా కొండపై శిలాప్రాకారం కట్టిస్తుండగా మ్లేచ్ఛులు కొండ సమీపానికి వచ్చియుండగా రాజు మ్లేచ్ఛులను సంహరించగల శక్తిలేక ఒకరోజున శ్రీవేంకటేశ్వర సన్నిధానానికి వచ్చి "స్వామీ! మీరే ఈ మ్లేచ్ఛోపద్రవాన్ని పోగొట్టాలి." అని ప్రపత్తి చేయగా నాటి రాత్రి రాయల స్వప్నంలో శ్రీవేంకటాద్రి సింహమైన శ్రీసుందర నరసింహస్వామి సాక్షాత్కారమై శ్రీభగవద్రామానుజుల ముద్రకు ధర్మాధికారియైన ఏకాంగి శ్రీవైష్ణవులను సాధనంగా చెసుకుని మ్లేచ్ఛోపద్రవాన్ని తొలగిస్తాం. వారితోడ మీ చతురంగ సైన్యాన్ని కూర్చివారికి నరవాహనాన్నిచ్చి మ్లేచ్ఛుల కెదురుగా పోవునట్లు పంపిస్తే వారే సమస్తపాపాలు పోద్రోలెదరు అని ఆజ్ఞాపించాడు.

*(ఇంకా ఉంది)*

# శ్రీవేంకటేశ్వరలీలలు



## నిరాశ ఉండదు!

- శ్రీ ఆర్.సి.కృష్ణస్వామి రాజు, 93936 62821

అది నా 50వ పుట్టినరోజు. కొండకెళ్లి స్వామివారిని దర్శనం చేసుకుందామని అనుకున్నాను. అలాగే ఆరోజునాడు కొండపైన నిద్ర చేస్తే బాగుండునని తలచాను. ఉదయమే స్నేహితుడితో కలిసి బస్సు ఎక్కాను. దర్శనం టిక్కెట్ ఉంది కాబట్టి గది కోసం ప్రయత్నం చేద్దామనుకున్నాం. బస్సు దిగి సి.ఆర్.ఓ., ఆఫీసు వద్దకు వెళ్లాము. జనమంటే జనం కాదు. అక్కడ గదుల కోసం చాంతాడంత క్యూ కనిపించింది. అంత పెద్ద క్యూని చూసి భయపడ్డాం.

మాకిద్దరికీ ఏమి చేయాలో తోచలేదు. అక్కడే మెట్ల మీద కూర్చున్నాం. మైకులో మధురమైన అన్నమాచార్యకీర్తనలు వినిపిస్తూ ఉన్నాయి. ఉప్పు, కారం చల్లిన మామిడికాయ దబ్బలు కొనుక్కుని తిన్నాం. తిన్నాక చేయి కడుక్కుందామని కుళాయి దగ్గరకు వెళ్లి శుభ్రంగా నోరు, చేతులు కడుక్కున్నాం.

గుడి వైపుగా తిరిగి "స్వామీ... ఈ శేషాచలం కొండ పైన నిద్రించే అవకాశం కల్పించవా" అని వేడుకున్నాను. 'గది దొరక్కపోతే ఏమయ్యింది, గుడి ముందరపడుకుందాం, ఉదయాన పుష్కరిణిలో స్నానం చేద్దాం. కొండపైన ఎక్కడ పడుకున్నా ఒక్కటే కదా' అనుకున్నాను. ఇంతలో చల్లటి గాలి సర్రున వీచింది. చలికి ఆరుబయట పడుకునే సాహసం చేయడానికి ధైర్యం చాల్లేదు. మళ్లీ గుడి ప్రక్కకి తిరిగాను 'స్వామీ... నా కోరిక తీర్చరాదా... గది సాయం చేయరాదా' అని వేడుకుంటూ తల తిప్పాను.

క్యూలో ముందు వరుసలో నిలబడి ఉన్న ఒక యువకుడు నాకు సైగ చేస్తున్నట్లుగా అనిపించింది. "నన్నేనా?" అని ప్రశ్నార్థకంగా అతడివైపు చూశాను. నన్నే అన్నట్లుగా తల ఊపాడు. క్యూలో ఉన్నవారిని బతిమలాడి అతడి దగ్గరకు చేరుకున్నాను. "మీరు గది కోసం ప్రయత్నిస్తున్నారా?" అని అడిగాడు. దేవుడిలాగా అగుపించిన అతడికి అవునన్నట్లు గట్టిగా తల ఊపాను.

"నా పేరు రామకృష్ణ, నేను హైదరాబాద్ నుంచి ఒక్కడినే వచ్చాను. ఒక్కరికే గది ఇవ్వరని తెలిసింది. మీరు నా గదిలో ఉండవచ్చు. మీ ఆధార్‌కార్డు జిరాక్స్ ఇవ్వండి" అని అడిగాడు. "ఒకటి కాదు, రెండు ఆధార్ కార్డులివ్వగలను. నా ఫ్రెండు కూడా ఉన్నాడు" అంటూ నా మిత్రుడిని కూడా చూపాను. అలాగేనని తీసుకున్నాడు. పదిహేను నిమిషాలకంతా గది దొరికింది. మా ఆనందానికి అవధుల్లేవు.

'ఆశించిన వాడిని స్వామి ఎప్పటికీ నిరాశపరచడని' తెలుసుకున్న మేము గోవింద నామస్మరణలు చేస్తూ గదికి వెళ్లాం. దర్శనం చేసుకుని ఆ రాత్రి గదిలో ఉండి మరుసటి రోజున కమ్మటి ఉచితభోజనప్రసాదాన్ని తిని వెనుదిరిగాం.



## 108 దివ్యదేశాలు

# తిరుక్కురుంగుడి

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

అందమైన వామనుడి రూపంలో లోకాలను కొలిచిన త్రివిక్రమస్వరూపుడైన పెరుమాళ్ నివాస స్థలమే తిరుక్కురుంగుడి. ఇది అత్యంత ప్రాచీనమైన దివ్యదేశం. మహేంద్రగిరి పర్వత శ్రేణుల మధ్య, ప్రకృతి సౌందర్యంతో అలరారే ఈ క్షేత్రం తిరునెల్వేలి - తెన్కాసి మార్గంలో చేరన్మాదేవి రైల్వే స్టేషన్ నుండి సుమారు 2.5 కిలోమీటర్ల దూరంలో ఉంది. 18 ఎకరాల విస్తీర్ణంలో, ఐదు ప్రాకారాలు, ఐదు అంతస్తుల రాజ గోపురంతో, అద్భుతమైన శిల్పకళతో ఈ ఆలయం నిర్మించ బడింది.

వరాహావతార కాలంలోనే స్వామివారు ఈ క్షేత్రంలో వేంచేసి ఉన్నారని స్థలపురాణం. పరమభక్తుడైన నంబాడువాన్ తన గానభక్తి కైంకర్యంతో స్వామిని మెప్పించిన పవిత్ర చరిత్ర ఇక్కడ ఉంది.

| | | |
|---|---|---|
| **మూలవర్లు** | : | **నిన్రనంబి** |
| **ఉత్సవమూర్తి** | : | **అళగియనంబి** |
| **అమ్మవార్లు** | : | **కురుంగుడి వల్లి, భూమిదేవి** |
| **పుష్కరిణి** | : | **తిరుప్పార్ కడలి** |
| **క్షేత్రం** | : | **వామనక్షేత్రం** |
| **విమానం** | : | **పంచకేతక విమానం** |
| **ముఖం** | : | **తూర్పుముఖం** |
| **మంగళాశాసనం** | : | **నమ్మాళ్వార్, పెరియాళ్వార్, తిరుమంగై ఆళ్వార్** |
| **ఆగమం** | : | **వైఖానసం** |

**నది(శిలంబారు):** స్వామి లోకాలను కొలిచేందుకు పాదాలను పైకి ఎత్తినప్పుడు, ఆయన కాలి గజ్జెల నుండి రత్నాలు జారి పడి ఇక్కడ నది ఉద్భవించిందని చెబుతారు. దీన్ని "నంబినది" అని కూడా అంటారు.

### ఇక్కడ ఐదుగురు నంబిలు ప్రసిద్ధం

1) నిన్ర నంబి (నిలబడిన రూపం)
2) ఇరున్ద నంబి (కూర్చున్న రూపం)
3) కిడన్ద నంబి (శయనించిన రూపం)
4) మలైమేల్ నంబి (కొండపై ఉన్న రూపం)
5) తిరుప్పాఱ్కడల్ నంబి (క్షీరాబ్ధిరూపం)

విశేషమేమిటంటే, నిలబడ్డ, శయనించిన పెరుమాళ్ సన్నిధుల మధ్యలో "మహేంద్రగిరి నాథుడు" అనే పేరుతో శివ భగవానుడు కూడా కొలువై ఉంటారు.

### పరివట్టప్పాత్తై (వట్టప్పాత్తై)

రామానుజాచార్యులు తిరువనంతపురంలో ఉన్నప్పుడు, పద్మనాభస్వామి వారిని రాత్రికి రాత్రే గరుడవాహనంపై తీసుకు







వచ్చి తిరుక్కురుంగుడి నంబినది తీరాన చేర్చారు. ఆ సమయంలో స్వామివారే స్వయంగా శిష్యుడి రూపంలో వచ్చి రామానుజుల వద్ద ఉపదేశం పొందారు. రామానుజులు ఒక పెద్ద బండరాయిపై కూర్చుని స్వామికి ఉపదేశం చేసినందున ఆ రాయిని "తిరుప్పరివట్టప్పాఱై" అని పిలుస్తారు.

## నంబాడువాన్ - కైశిక ఏకాదశి

నంబాడువాన్ అనే భక్తుడు ఆలయం వెలుపల నుండే స్వామిని గానంతో ఆరాధించేవాడు. ఆయన భక్తికి మెచ్చి స్వామి తనకు అడ్డంగా ఉన్న ధ్వజస్తంభాన్ని పక్కకు జరగమని ఆజ్ఞా



పించారు. నేటికీ ఇక్కడ ధ్వజస్తంభం కొంచెం పక్కకు జరిగి ఉండటం కనిపిస్తుంది.

ఒక కైశికఏకాదశినాడు, నంబాడువాన్ అడవి మార్గంలో వస్తుండగా ఒక బ్రహ్మరాక్షసుడు అతణ్ణి పట్టుకున్నాడు. నంబాడువాన్ ఏమాత్రం భయపడకుండా, "స్వామిని సేవించి తిరిగి వస్తాను, అప్పుడు నన్ను భక్షించు" అని మాట ఇచ్చాడు. తిరిగి వచ్చేటప్పుడు స్వామి వృద్ధుడి రూపంలో వచ్చి హెచ్చరించినా, నంబాడువాన్ తన మాట తప్పనని రాక్షసుడి వద్దకు వెళ్లాడు. ఆ రాక్షసుడు తన పూర్వజన్మ పాపాల వల్ల ఆ రూపం పొందాడని తెలుసుకున్న నంబాడువాన్, తాను పాడిన "కైశికరాగం" పుణ్యాన్ని అతడికి ధారపోసి శాపవిమోచనం కలిగించాడు. ఈ ఘట్టాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా కార్తిక మాసంలో "కైశిక ఏకాదశి" ఉత్సవం ఘనంగా జరుగుతుంది.

## ధ్యాన శ్లోకం

శ్రీమత్ ఖ్యాత కురంగ నగరే తిష్ఠన్ స్వపన్ సంచరన్
ఆసీనశ్చ ధరాధరాగ్ర విలసత్ దేవస్స పూర్ణాహ్వయః।
తాదృజ్ మందిర నాయికా అంజన సరః తీర్థం చ పంచగ్రహ-
ఆఖ్యాతం తత్ర విమానం ఈశ గజయోః సాక్షాత్కృత: ప్రాఙ్ముఖః॥

## తాత్పర్యం

తిరుక్కురుంగుడి పుణ్యక్షేత్రంలో నిలబడ్డ, శయనించిన, సంచరించే, కూర్చున్న, పర్వతంపై వెలసిన పూర్ణనంబి రూపంలో ఉన్న పెరుమాళ్ నమస్కారం! కురుంగుడివల్లి అమ్మవారితో, పంచకేతక విమానం కింద, అంజన పుష్కరిణి తీరాన తూర్పు ముఖంగా వెలసిన స్వామి! శివుడికి, గజేంద్రుడికి దర్శనమిచ్చినట్లుగా మాకు కూడా దర్శనమిచ్చి అనుగ్రహించండి!!


**భక్తులకోసం...**

అలిపిరినుండి కాలిబాటలో భక్తులకు దారిపొడవునా త్రాగునీటి వసతి కల్పించబడింది. నీటిని పొదుపుగా వినియోగించండి.

యాత్రికుల రక్షణార్థం తి.తి.దేవస్థానం సెక్యూరిటీ గార్డులను నియమించింది.




సుందరకాండలో హనుమంతుడే ప్రధానంగా కన్పిస్తాడు

# హనుమాన్ చాలీసా



హనుమంతుని స్మరణవల్ల మంచిబుద్ధి, సత్కీర్తి, గొప్ప దేహబలం, ధైర్యం, భయం లేని తనం, రోగాలు లేని లక్షణం, జడత్వం లేని స్థితి, వాక్కులలో పాటవం కలుగుతాయి. ఈ గొప్ప ప్రయోజనాల్ని అశేషజనానికి కలుగజేయాలనే సత్సంకల్పంతోనే సంత్ తులసీదాసు 'హనుమాన్ చాలీసా' రచించారు. దీన్ని నిత్యం పారాయణం చేస్తే భక్తులకు భయాలుపోతాయి. కార్యసిద్ధి, విజయం లభిస్తాయి కనుక 'సప్తగిరి' పాఠక మహాశయులకు ప్రత్యేకంగా అందిస్తున్నాం! 'హనుమజ్జయంతి' సందర్భంగా హనుమాన్ భక్తులందరికీ శుభాకాంక్షలు!

శ్రీగురుచరణ సరోజరజ నిజమనుముకుర సుధారి
వరనౌ రఘువరఁ విమల యశ జో దాయకు ఫలచారి॥
బుద్ధిహీన తను జానికై సుమిరౌఁ పవనకుమార్
బలబుద్ధి విద్యాదేహు మోహి హరహు కలేశ వికార్॥

శ్రీగురుచరణ కమలాలోని రజస్సుచే నా మనస్సనే అద్దాన్ని శుభ్రం చేసుకుని ధర్మార్థ కామమోక్షాలనే చతుర్విధ పురుషార్థాలను ఇచ్చే... శ్రీరామచంద్రుని విమలకీర్తిని వర్ణిస్తాను. ఈ శరీరం బుద్ధిహీనతచే కలిగిందని తెలుసుకుని పవన కుమారుణ్ణి స్మరిస్తాను. అతను నాకు బలాన్ని, బుద్ధిని, విద్యను ఇవ్వడమేగాక కామాది వికారాల వల్ల కలిగిన క్లేశాల్ని హరించుగాక!

## చౌపాయి

జయ హనుమాన జ్ఞానగుణసాగర।
జయ కపీశ తిహుఁలోక ఉజాగర॥ 1

**తాత్పర్యం:** జ్ఞానగుణసాగరుడవైన నీకు జయమగుగాక! త్రిలోకాలను ప్రకాశింప జేసే ఓ కపీశా! నీకు జయమగుగాక!

రామదూత అతులిత బలధామా।
అంజనిపుత్ర పవనసుత నామా॥ 2

**తాత్పర్యం:** రామదూతా! సాటిలేని బలానికి ఆటపట్టైన వాడా! అంజనీసుతా! పవనసుతుడనే పేరు గలవాడా!



మహావీర విక్రమ భజరంగీ।
కుమతి నివార సుమతికే సంగీ॥ 3

**తాత్పర్యం:** మహావీరా! విక్రమస్వరూపా! వజ్రం వంటి శరీరం కలవాడా! చెడ్డబుద్ధిని పోగొట్టేవాడా! మంచిబుద్ధిగలవారికి తోడ్పడేవాడా!

కంచన వరణ విరాజ సువేశా।
కానన కుండల కుంచిత కేశా॥ 4

**తాత్పర్యం:** బంగారం వంటి శరీరచ్ఛాయ గలవాడా! మంచి వేషంతో ఒప్పేవాడా! చెవులకు కుండలాలు ధరించేవాడా! జుట్టుముడి వైచుకొన్నవాడా!

హాథవజ్ర ఔరధ్వజా విరాజై।
కాంథే మూంజ జనేవూ సాజై॥ 5

**తాత్పర్యం:** చేతిలో వజ్రాన్ని, ధ్వజాన్ని గల్గి విరాజిల్లువాడా! స్కంధమందు ముంజను జందెమును కల్గినవాడా!

శంకరసువన కేసరీ నందన।
తేజప్రతాప మహాజగవందన॥ 6

**తాత్పర్యం:** శంకరుని పుత్రుడా! కేసరి (అంజని భర్త) తనయా! గొప్ప తేజః ప్రతాపాన్ని గలవాడా! సమస్తజగాలచే నమస్కరింపబడువాడా!

విద్యావాన గుణీ అతిచాతుర।
రామకాజ కరివేకో ఆతుర॥ 7

**తాత్పర్యం:** విద్వాంసుడా! కల్యాణగుణా! చతురత్వం కలవాడా! రామకార్యాన్ని నెరవేర్చడానికి ఆత్రుతపడేవాడా!





ప్రభుచరిత్ర సునివేకో రసియా।
రామలఖన సీతా మన బసియా॥ 8

**తాత్పర్యం:** శ్రీరామప్రభు చరిత్రను వినే రసికుడా! సీతారామలక్ష్మణులను మనస్సున ధరించేవాడా!

సూక్ష్మరూప ధరి సియహిఁధిఖావా।
వికటరూప ధరి లంక జలావా॥ 9



**తాత్పర్యం:** సూక్ష్మరూపాన్ని ధరించి సీతకు కన్పించావు. వికట రూపాన్ని ధరించి లంకను కాల్చావు.

భీమరూపధరి అసురసంహారే।
రామచంద్రకే కాజఁ సంవారే॥ 10

**తాత్పర్యం:** భయంకర రూపాన్ని ధరించి, అసురులను సంహరించావు. రామ చంద్రుని కార్యాన్ని నెరవేర్చావు.



లాయ సంజీవన లఖన జియాయే।
శ్రీ రఘువీర హరషి ఉరలాయే॥ 11

**తాత్పర్యం:** సంజీవని తీసుకువచ్చి లక్ష్మణుని బ్రతికించావు. దానికి శ్రీరాముడు సంతోషించి నిన్ను హృదయానికి హత్తుకున్నాడు.



రఘుపతికీన్హీ బహుత బడాయీ।
కహా భరత సమ తుమప్రియ భాయి॥ 12

**తాత్పర్యం:** శ్రీరామచంద్రమూర్తి నిన్ను గొప్పగా పొగడి "సోదరా! నీవు నాకు భరతునితో సమానమైనవాడ"వని పలికాడు.

సహస్రవదన తుమ్హారోయశగావైఁ।
అస కహి శ్రీపతి కంఠ లగావైఁ॥ 13



**తాత్పర్యం:** వేయినోళ్ల నీ యశాన్ని గానం చేసి శ్రీరాముడు నిన్ను కౌగిలించుకున్నాడు.

సనకాదిక బ్రహ్మాది మునీశా।
నారద శారద సహిత అహీశా॥ 14

యమ కుబేర దిగపాల జహాఁతే।
కవి కోవిద కహి సకై కహాఁతే॥ 15

**తాత్పర్యం:** సనకాది దేవర్షులు, బ్రహ్మాది దేవతలు, మునీశ్వరులు, నారదుడు, సరస్వతి, ఆదిశేషుడు, యమకుబేరాది దిక్పాలకులు, కవులు, పండితులు మొదలైనవారు నీ యశోగానం ఎంతని చేయగలుగుతారు.

తుమ ఉపకార సుగ్రీవ హిఁ కీన్హా।
రామ మిలాయ రాజపద దీన్హా॥ 16

**తాత్పర్యం:** నీవు సుగ్రీవునకు ఉపకారం చేశావు. రామునితో అతనికి చెలిమి చేయించి రాజ్యసంపద ఇప్పించావు.

తుమ్హారో మంత్ర విభీషణ మాచినా।
లంకేశ్వర భయ సబ జగ జానా॥ 17

**తాత్పర్యం:** నీ ఆలోచనలు విభీషణుడు అంగీకరించి లంకకు రాజైన సంగతి లోకాని కంతటికీ తెలిసిందే.

యుగ సహస్ర యోజన పర భానూ।
లీల్యో తాహి మధుర ఫల జానూ॥ 18

**తాత్పర్యం:** రెండువేల ఆమడల దూరంలో ఉన్న సూర్యుణ్ణి మధురఫలంగా భావించి లీలగా గ్రహించావు.

ప్రభు ముద్రికా మేలిముఖ మాహీఁ।
జలధి లాంఘిగయే అచరజ నాహీఁ॥ 19

**తాత్పర్యం:** శ్రీరామముద్రికను నోట నుంచుకుని సముద్రాన్ని దాటావనడంలో ఆశ్చర్యమేముంది?



దుర్గమ కాజ జగతకే జేతే।
సుగమ అనుగ్రహ తుమ్హరే తేతే॥ 20

**తాత్పర్యం:** ప్రపంచంలో కష్టమైన కార్యమేది ఉందో, అది నీ అనుగ్రహంతో సుగమం అవుతుంది.

రామ దుఆరే తుమ రఖవారే।
హోత న ఆజ్ఞా బినుపైసారే॥ 21

**తాత్పర్యం:** నీవు రామద్వారాన్ని కాచేవాడవు. నీ ఆజ్ఞ లేనిదే లోనికి వెళ్లడానికి వీలులేదు.

సబ సుఖ లహై తుమ్హారీ శరణా।
తుమ రక్షక కాహూకో డరనా॥ 22

**తాత్పర్యం:** నిన్ను శరణు వేడితే సమస్త సుఖాలూ లభించగలవు. నీవు రక్షకుడవుగా ఉండగా నేనెవరికీ భయపడాల్సిన పనిలేదు.

ఆపన తేజ సమ్హారో ఆపై।
తీనోం లోక హాంక తే కాంపై॥ 23

**తాత్పర్యం:** నీ తేజాన్ని సంభాళించుకొనువాడవు నీవే! ఒక్క కేక వేస్తే మూడు లోకాలు వణికిపోతాయి.

భూత పిశాచ నికట నహిం ఆవై।
మహావీర జబనామ సునావై॥ 24

**తాత్పర్యం:** మహావీరా! నీ నామాన్ని వింటే భూతప్రేత పిశాచాలు దగ్గరకు రావు.

నాసై రోగ హరై సబ పీరా।
జపత నిరంతర హనుమత వీరా॥ 25



**తాత్పర్యం:** నిరంతరం వీర హనుమాన్‌ను జపిస్తే సమస్తరోగాలు, సమస్తపీడలు తొలగుతాయి.

సంకటసే హనుమాన ఛుడావై।
మన క్రమ వచన ధ్యాన జో లావై॥ 26

**తాత్పర్యం:** మనోవాక్కాయాలచే ఎవరు హనుమంతుని ధ్యానిస్తారో, వారిని అతడు సమస్త సంకటాల నుండి బయట పడేస్తాడు.

సబ పర రామ తపస్వీ రాజా।
తినకే కాజ సకల తుమ సాజా॥ 27

**తాత్పర్యం:** రాముడు రాజులందరకీ మకుటం వంటివాడు. తాపసులందరకీ ప్రభువు వంటివాడు. ఆయన కార్యాలను అన్నింటినీ నీవు చక్కగా సవరిస్తుంటావు.

ఔర మనోరథ జో కోయి లావై।
సోయి అమిత జీవన ఫల పావై॥ 28

**తాత్పర్యం:** ఎవరు ఏయే మనోరథం గలిగి ఉన్నా వారికి జీవన ఫలితం అమితంగా లభిస్తుంది.

చారోం యుగ పరతాప తుమ్హారా।
హై పరసిద్ధ జగత ఉజియారా॥ 29

**తాత్పర్యం:** నీ ప్రతాపం నాలుగు యుగాలలోను గలదనుట ప్రసిద్ధం. దానిచే జగత్తు ఉజ్వలమైంది.

సాధు సంతకే తుమ రఖవారే।
అసుర నికందన రామ దులారే॥ 30

**తాత్పర్యం:** సాధుసజ్జనులను నీవు రక్షిస్తుంటావు. అసురులను చంపి రామునకు ప్రియుడవైయ్యావు.

అష్టసిద్ధి నవనిధికేదాతా।
అస వర దీన జానకీమాతా॥ 31

**తాత్పర్యం:** అష్టసిద్ధులను, నవనిధులను ఇచ్చే వాడవనే వరం నీకు జానకీదేవి ప్రసాదించింది.













రామ రసాయన తుమ్హారే పాసా।
సదా రహౌ రఘుపతికే దాసా॥ 32

**తాత్పర్యం:** రామరసాయనం నీ దగ్గ రుంది. నీవు రామచంద్రునకు శ్రద్ధాళుడ వైన దాసుడవు.

తుమ్హారే భజన రామకో పావై।
జన్మ జన్మకే దుఃఖ బిసరావై॥ 33



**తాత్పర్యం:** నిన్ను ప్రార్థిస్తే శ్రీరాముడు సంతసిస్తాడు. జన్మాంతర దుఃఖాలు నశి స్తాయి.

అంతకాల రఘుపతి పుర జాయీ।
జహాఁ జన్మ హరిభక్త కహాయీ॥ 34

**తాత్పర్యం:** ఎక్కడ జన్మించినా హరిభక్తు లని పిలువబడుతారు. శ్రీరాముని పురానికి అంత్యకాలంలో వెళ్తారు.



ఔర దేవతా చిత్త న ధరయీ।
హనుమత సేయి సర్వసుఖకరయీ॥ 35

**తాత్పర్యం:** మరో దేవతను చిత్తంలో ధరించక హనుమంతుని సేవిస్తే సర్వ సుఖాల్ని అతడు ఒనగూర్చుతాడు.

సంకట హటై మిటై సబ పీరా।
జో సుమిరై హనుమత బలవీరా॥ 36



**తాత్పర్యం:** బలవీరుడైన హనుమంతుని తలచితే సంకటాలు, పీడలు, కష్టాలు నశిస్తాయి.

జై జై జై హనుమాన గోసాయీ।
కృపా కరో గురుదేవ కీ నాయీ॥ 37

**తాత్పర్యం:** హనుమత్ప్రభువుకు జేజేలు! శ్రీగురుదేవుని వలే కృప చూడుము!



జో శతబార పాఠకర కోయీ।
ఛూటహిబంది మహాసుఖహోయీ॥ 38

**తాత్పర్యం:** దీన్ని నూరుసార్లు ఎవరు పఠనం చేస్తారో వారికి బంధాలు వీడి సుఖాలు కలుగుతాయి.

జో యహ పఢై హనుమాన చాలీసా।
హోయ సిద్ధి సాఖీ గౌరీసా॥ 39

**తాత్పర్యం:** హనుమాన్ చాలీసా అనే ఈ స్తోత్రం ఎవరు పఠిస్తారో వారికి పార్వతీ పరమేశ్వరుల సాక్షిగా సిద్ధి కలుగుతుంది.

తులసీదాస సదా హరిచేరా।
కీజైనాథ హృదయ మహఁడేరా॥ 40

**తాత్పర్యం:** తులసీదాసు ఎల్లప్పుడూ హరి దాసే! ఓ నాథా! నీవు నా హృదయంలో ఉండుము.

## దోహా

పవనతనయ సంకటహరణ
మంగళమూరతి రూప్
రామలఖన సీతాసహిత
హృదయ బసహు సురభూప్

ఓ! మంగళరూపా! సీతారామలక్ష్మణ సహితుడవై సమస్తసేవలతో నీవు నా హృదయంలో ఉండుము.

శ్లో॥ రామాయ, రామభద్రాయ,
రామచంద్రాయ వేధసే।
రఘునాథాయ నాథాయ
సీతాయాః పతయే నమః॥

**శ్రీ రాజా రామచంద్రజీకీ జై**
**హనుమాన్ చాలీసా సంపూర్ణం.**

శ్లో॥ అంజనేయం మహావీరం
బ్రహ్మవిష్ణు శివాత్మకం।
బాలార్క సదృశాకారం
రామదూతం నమామ్యహమ్॥

*(చిత్రాలు: నీలి వెంకటరమణ)*



గృహ లక్ష్మి

# వ్రత కథలూ - పరమార్థం

-బ్రహ్మశ్రీ డా॥మైలవరపు శ్రీనివాసరావు

ఎక్కడ పెళ్లి, గృహప్రవేశం వంటి శుభకార్యాలు జరిగినా, ఆ కార్యక్రమాలకు ఏదో పనుల కారణంగా వెళ్లలేకపోతే వెళ్లినట్లుగా అంగీకరింపజేసేది ఆ శుభకార్యం తర్వాత జరిగిన సత్యనారాయణస్వామి వ్రతానికి వెళ్తేనే! ఆ సత్యనారాయణ స్వామి వ్రతంలో కూడ పూర్తిగా, ఏవో పనుల కారణంగా- కూచోలేకపోయినా ఆ వ్రతానికొచ్చే పుణ్యాన్ని సంపూర్ణంగా అందజేసేది-వ్రతకథని విన్నపక్షంలోనే. శుభకార్యానికీ, వ్రతానికీ కూడ దూరాభారం వ్యయప్రయాసల కారణంగా రా(లే)క పోయినా ఆ ఫలితాన్నిచ్చేది-శ్రీసత్యనారాయణస్వామి వ్రత ప్రసాదాన్ని స్వీకరించిన పక్షంలోనే. ప్రసాదాన్ని స్వీకరించినా ఆ స్వామి అనుగ్రహం లభించడమనేది ప్రారంభమయ్యేది- నేనూ సత్యనారాయణస్వామి వ్రతాన్ని చేసుకోదలిచానని మొక్కుకున్న సందర్భంలోనే. ఇంతటి శీఘ్రఫలితాన్నిచ్చేదీ శుభకార్యానికి పిలిచినారాలేదనే నిందని రాకుండా చేసేదీ శ్రీ సత్యనారాయణ స్వామివ్రతమే. అందుకే అన్నవరక్షేత్రంలో కొండమీద ఆ దైవ సమక్షంలో రోజుకి వ్రతాలు సాగుతూ ఉంటాయి. ఈ సందర్భంలో ఆ వ్రతానికున్న కథల్లోని రహస్యాలని ఓ మారు అనుకుందాం!

## వ్రతానికి కథ ఎందుకు?

సాధారణంగా ఎవరైనా ఏ పనైనా చేయాలంటే ముందుగా దాని వల్ల వచ్చే ప్రయోజనాలూ, ఎవరైనా ఆ పని చేసి ఉంటే వారి వివరాలూ, ఇలా కనుక్కుని ఆ మీదట ఆ పనిని చేయాలనే ఆలోచనకు వస్తారు. ఇలా చేయడం తప్పేమీ కాదు. ఆ పని మీద గురి కుదరడానికి ఇదో మంచి అవకాశం. ఈ ఆలోచనను దృష్టిలో పెట్టుకున్న ప్రాచీనులు ప్రతి వ్రతానికీ చివర్లో ఓ జరిగినకథను (కల్పితం కానే కాదు) ఉదాహరణగా చూపిస్తూ ఆ వ్రతానికి అనుసంధానం చేశారు.

ఇది నిజం కాబట్టే, వ్రత ప్రారంభం నుండీ ఉండక పోయినా కనీసం వ్రతకథ చెప్పే సమయానికైనా ఉండవలసిందే నన్నారు పెద్దలు. పదిమందీ సుఖసంతోషాలతో ఉండా లన్నదే వారి ఆశయం కాబట్టి ఇలాంటి నియమాన్ని పెట్టారు. అలాంటి అభిప్రాయంతో అనుసంధానం చేసిన సత్యనారాయణ వ్రతకథలు ఒకప్పుడు 9 ఉండేవి. అవి కాలక్రమంలో 8, 7 గా మారి నేడు 5 కథలుగా ప్రసిద్ధిలో ఉన్నాయి. ఎందుకీ సంఖ్యని తగ్గించారు? కల్పితాలా? అనుకోకూడదు. దాదాపు సమానమైన భావాన్నే తెలియజెప్పేకథను ఒక్కొక్క దాన్ని ఉంచి మొత్తం 5 కథలుగా కుదించారు మధ్యకాలంలో. కథ అయ్యాక ఎన్ని కొబ్బరికాయల్ని కొట్టామా? కొట్టాలా? అనేదాన్ని మాత్రమే ప్రధానంగా భావించకుండా, కథలోని అంతరార్థాన్ని గ్రహిం చడం అత్యంత ముఖ్యమని గమనించుకోవాలి.

## దైవానిది జాలి బుద్ధి

మొదటికథకు వెళ్లాం! నైమిశమనే అరణ్యంలో సూత మహర్షిని శౌనకుడూ మొదలైన మహర్షులంతా కలియుగంలో జనులంతా నానాకష్టాలూ పడుతున్నారు గదా! వీళ్లకు ఆ బాధల నుండి తరణోపాయం ఏమిటి? అని అడిగారు. సూతులవారు దానికి సమాధానాన్ని ప్రారంభిస్తూనే, ఇదే ప్రశ్నని నారదుడు ఓమారు శ్రీహరిని అడిగాడంటూ సమాధానాన్ని చెప్పడం ప్రారంభించారు. బ్రహ్మ సృష్టిస్తే ఆయువు తీరే వేళ లయాన్ని శంకరుడు చేస్తూంటే, ఇక పుట్టిన ఈ జీవులందర్నీ స్థితి (రక్షించడం) చేయవలసిన బాధ్యత శ్రీహరిది కదా!

అందుకని ఆయన ఈ కలిలో జనులైన మన దుఃఖాలను ఒక్కసారి పరిశీలించాడు. మనం పడుతున్న ఆ బాధని భరించలేక నారదునికి 'మనని గురించి అడిగి కష్టాల నుండి గట్టెక్కే ఉపాయమేమి?టని' అడగాలనే బుద్ధి పుట్టిం చాడు. నారదునికి ఈ అడుగుతున్న ప్రశ్న తనకు ఎలా తట్టిందో తెలీదు, అడిగాడంతే. సమాధానాన్ని శ్రీహరి చెప్పనే చెప్పాడు.



అంటే ఏమన్నమాట? మనను రక్షించదలిచిన శ్రీహరే మన కష్టాల నుండి మనం దాటే ఉపాయాన్ని మనకు చెప్తున్నాడన్న మాట 'ఆ కష్టాలనుండి తరించాలంటే సత్యనారాయణవ్రత మనేది ఒకటుందనీ దాన్ని చేసుకోవాలనీ ఈ మొదటి అధ్యాయంలో వ్రతాన్ని చేసుకోవాల్సిన రోజుల్ని గురించి చెప్తూ మంచిరోజులైన ఏకాదశి పూర్ణిమ సూర్యుడు రాశి నుండి రాశికి మారే రోజూ. ఇలా వీటిని చెప్పి, చివర్లో "ఎప్పుడు మనసుకు కష్టం తగిల్తే అప్పుడు" అని కూడ చెప్పాడు శ్రీహరి. ఎందరికో ఓ అనుమానం "ఫలాన రోజున చేసుకోవచ్చా? మంచిరోజు కాదు కదా!" అని. కాబట్టి కష్టం కలిగిందంటే మనకు వ్రతాన్ని చేసుకోవాల్సిన మంచిరోజు అదే అని గమనించుకోవాలన్న మాట. 'మన గురించి ఆలోచించి నివారణోపాయాన్ని తెలిపాడంటే... భగవంతునికి మనమీద ఎంతటి జాలి?".

## మనది అనుమానించే బుద్ధి

సత్యనారాయణవ్రతం చేయాలి. మంచిదే! మరి ఇలా ఎవరైనా చేశారా? ఫలితాన్ని పొందారా? అని ఆలోచించే తీరు మనది. అందుకే తరువాతి అధ్యాయం చెప్తోంది– ఓ బ్రాహ్మణుడు ఈ వ్రతాన్ని నిరంతరం చేస్తూ సుఖసంతోషాలతో ఉంటూండగా ఓసారి ఓ కట్టెల్ని కొట్టి జీవించే వ్యక్తి ఈ వ్రతాన్ని చేస్తూండే కాలంలో చూసి వివరాలని అడిగాడని. ఊరికే అడిగి, ఎన్నెన్నో చెప్పినవి చేశాం? అలా ఎన్నని చేస్తాం? అనుకోకుండా సంపూర్ణవిశ్వాసంతో అనుకున్నాడతను– మరునాడు కట్టెలమ్మగా ఎంత ద్రవ్యం (లాభం కాదు) వస్తే అంత ద్రవ్యంతోనూ వ్రతాన్ని చేస్తానని. విశ్వాసమనేది భగవంతునికి మరింత ఇష్టమైన ద్రవ్యం. అందుకే రోజూ వచ్చే దానికి మించి లాభాన్ని ఇప్పించాడాయన. భగవంతుని విషయంలో నమ్మకంతో మనం ఒకడుగు ముందుకేస్తే ఆయన మన దగ్గరికి పది అడుగులు ముందుకేసి వస్తాడు. ఆ కట్టెలమ్మే భక్తుడు మొత్తం సంతోషంగా వ్రతాన్ని చేసుకుని సుఖసంతోషాల్ని పొందాడు. తాను చేస్తున్న వృత్తి ఎంతో చిన్నదైనా ఆ వృత్తిలో గడించిన ఒకరోజు సంపాదనతో వ్రతాన్ని చేశాడంటే దాన్ని బట్టి అతని విశ్వాసశక్తిని గమనించాలి. ఏ తల్లీ తన పుత్రునికి కష్టం కలగాలని కోరుకోదు. ఏదో ఓ దురదృష్టకర ఘడియలో తనతో పాటు వాణ్ణి చంపుకోవాలనీ భావించి విషాన్ని పెట్టబోతే– తల్లి మీది విశ్వాసబుద్ధితో, అపుడు కూడ నోరు తెరుస్తాడే తప్ప బిడ్డడు కాదనడు. భగవంతుడు మనకు మన పాపకర్మకు అనుగుణంగా ఓ కష్టాన్ని తప్పని సరిగా ఈయవలసి ఇస్తూంటే, తీవ్రబాధను మనం పడేలా చేస్తూ ఓ కష్టాన్నిచ్చి మళ్లీ అందులోనే చేదుమాత్రని మింగడానికి పంచదారని కలిపి ఇచ్చినట్లు కొంతసుఖాన్ని కల్గిస్తాడు ఏదో ఓ తీరుగా. అలాటి విశ్వాసబుద్ధిని కలిగించే కథ మనమనుకున్నది.

## దైవాన్నే పరీక్షించే బుద్ధి

ఆ మీదటి అధ్యాయానికి వెళ్తే సంతానం లేని ఆ వ్యాపారి 'తనకు సంతానం కలిగితే వ్రతాన్ని చేస్తా' – నన్నాడు. నిజానికి భగవంతుడు తానున్నానని నిరూపించుకోడానికి ఈ వ్యాపారికి సంతానాన్నిచ్చాడు. భార్య చెప్తున్నా కాదంటూ 'వివాహం కుదిరితే అప్పుడు వ్రతం చేద్దా!' మన్నాడు. భగవంతుడెప్పుడూ అనుకూలవాది మాత్రమే. అందుకే వివాహం కుదిర్చాడు. భార్య తనకు మళ్లీ గుర్తు చేసినా తర్వాత చేద్దాం లెద్దూ! ముందు వ్యాపారం కదా ముఖ్యమనుకుని **వ్రతాన్ని కావాలని మానాడు.**

**మరుపో వీలు కుదరకో భగవంతుణ్ణి సేవించని పక్షంలో ఏమీ అనుకోడు తప్ప, కావాలని నిరాదరణ చేస్తే మాత్రం ఆయన సహించడు.** అందుకే తన శక్తిని చూపించ దలిచి, మళ్లీ అంతలోనే జాలి చూపించదలిచి వ్యాపారులారా! పడవ బరువుగా వెళ్తంది ఏటిలో. పడవలో ఏముందేమిటని అడిగాడు.

ఆ రోజుల్లో సంన్యాసులు దైవప్రతినిధులుగా భావింప బడేవాళ్లు. నిత్యం తపస్సూ, నిష్ఠ నియమాలతో ఉండేవాళ్లు. అలాంటి సంన్యాసి ఈ ప్రశ్నని ఎందుకడుగుతున్నాడా? అనే ఆలోచన కూడ లేకుండా 'ఆకులూ అలములూ ఉన్నాయి పడవలో' అన్నారు వెటకారంగా మామా అల్లుళ్లను. దైవం 'తథాస్తు' అనడం కథ తలకిందులు కావడం ఇద్దరికీ బుద్ధి రావడం సంన్యాసిని ప్రార్థించడం జరిగింది. భగవంతునితో వేళాకోళం, ఆయనకే అసత్యాన్ని చెప్పడం వల్ల వచ్చే ప్రయోజనాన్ని అర్థమయ్యేలా చెప్తుంది ఈ వృత్తాంతం.

భగవంతుని పట్ల అపచారం చేశారు గనుకనే మామా అల్లుళ్లకు కారాగారశిక్ష కూడ పడింది కథలో. తప్పు తెలుసుకుని అటు తల్లీకూతుళ్లూ, ఇటు మామాఅల్లుళ్లూ కూడ క్షమార్పణ వేడుకున్న కారణంగా మామాఅల్లుళ్లు విడుదలయ్యారు. కారాగారం నుండి విడుదలకు కారణం శ్రీ సత్యనారాయణస్వామి ఆ రాజుకి కలలో కన్పించడమే. మనం అనుకోనితీరులో,

ఊహించని రీతిలో పరిష్కారం దొరుకుతుందని భావించడానికి సాక్ష్యం ఈ వృత్తాంతంలోని ఈ సంఘటన.

వ్రతం అంటే ప్రసాదాన్ని స్వీకరించడం వరకూ ఉండే భాగం అని అర్థం. ఆ ప్రసాదాన్ని మరిచి కూతురు తన భర్తను చూడాలని వెళ్లడం కూడ నేరమే. ప్రసాదమనే మాటకి వండబడిన నైవేద్యం అని కాదు అర్థం. అనుగ్రహం అని అర్థం. వ్రతమంతా ముగిసాక స్వామి అనుగ్రహానికి ఎదురు చూడాల్సింది పోయి, స్వామికంటే ఎక్కువ శ్రద్ధతో భర్త కోసం పరుగెత్తింది కూతురు. లోకంలో మనం కూడ ఆదరాబాదరగా వ్రతం మీది దృష్టి కంటే మరో స్వప్రయోజనం మీది దృష్టితో ఉంటూ వెళ్లిపోవాలి, వెళ్లిపోవాలి, త్వరగా, త్వరగా కానీయండి అంటుంటాం. లోకసాధారణమైన అంశమేమంటే– శ్రీ సత్యనారాయణస్వామివ్రతం అనగానే ఎక్కడెక్కడినుండో బంధువులు, మిత్రులు, ఆప్తులు రావడం, ఆ ఇంటివారు వారి మర్యాదల్లో మునిగితేలడం, కొందరువంటల్లో సమయాన్ని వెచ్చిస్తూ గృహిణులంతా కబుర్లలో మునగడం చేసుకుని, బాగా ఆలస్యంగా పూజని ప్రారంభించుకుని వాయువేగ, మనోవేగాలతో ఈ వ్రతాన్ని పూర్తిచేసుకోవడం అనేదే. అందుకే 'త్వరగా' అనే మాట ఈ వ్రతం విషయంలో సరికాదని చెప్తోంది ఈ కథ.

## సర్వమానవతాదృష్టి

లోకంలో ఓ దృష్టి ఉంది భక్తుల్లో– వారెక్కువా, వీరు తక్కువా అని. అయితే ఈ చివరికథ మనకు భక్తులందరూ సమానమేననీ, భక్తుల్లో ఉండవలసిన దైవభక్తిస్థాయిని బట్టి ఎక్కువతక్కువలు తప్ప అందరూ భక్తులేనని చెప్తుంది. జన్మని బట్టి రాజూ, పరిపాలకుడూ అయిన ఆయనకు సమీపంలో గోపబాలురందరూ వ్రతం చేసుకుని ప్రసాదాన్నియ్యబోతే, వారి పట్ల తక్కువభావంతో వద్దన్నాడు రాజు. సత్యనారాయణస్వామి ఆ రాజుకున్న అహంకారాన్ని తొలగించేసరికి అజ్ఞానపు పొరలు వీడి స్వయంగా ప్రసాదాన్ని గ్రహించాడు. తోవ తప్పి నడుస్తున్న పశువుని గోవులకాపరి కట్టితో బెదిరించి తోవకి తెచ్చినట్లు భక్తుల్లో కొందరిలో కన్పించే అహంకారాన్ని తొలిగిస్తాడు భగవంతుడని చెప్పే కథ ఇది.

ఈ కథలు సత్యనారాయణస్వామివ్రతానికి నాలుగు మూలస్తంభాల్లాటివి. వ్రతం చేసుకుంటున్న భక్తులందరూ తాము ఈ కథల్లో ఏదో ఓ చోట పాత్రధారులుగా కన్పిస్తారు, పరిశీలించి చూసుకుంటే.



ఇంత గొప్పవ్రతం ఇది కావడానికి కారణం ఇది సత్యలోకంలో ఉండే నారాయణుణ్ణి ఆహ్వానించుకుని చేసుకునే వ్రతం కావడం, అష్ట దిక్పాలకుల్నీ తమతమ భార్యలతో ఆహ్వానించుకోవడం, పంచలోకపాలకులూ (ఆదిత్య, అంబిక, విష్ణు, గణనాథ, మహేశ్వరులు) ఆహ్వానింపబడేది కావడం, వీరితో పాటు గ్రహబాధలు నివారింపబడేందుకై నవగ్రహాలనూ పేరు పేరునా వారివారి పరివారంతో సహా మంత్రపూర్వకంగా ఆహ్వానించుకుని చేసుకునే వ్రతం కావడమే.

## వైజ్ఞానికరహస్యం దాగుంది

మన ప్రాచీనులు ఏర్పాటు చేసిన పండుగలు, పూజలు వ్రతాలనే అన్నింటిలోనూ వైద్య, సామాజిక, సాంస్కృతిక, వైజ్ఞానికరహస్యాలుంటాయనేది అనేక పర్యాయాలు అనుకున్న విషయమే.

ఖగోళంలో సూర్యుడు ఎక్కడుంటాడో ఆయన చుట్టూ ఏ గ్రహాలు ఏ వైపుకి ఎలా ఏ కక్ష్యలో తిరుగుతూ ఉంటాయో అవి మన కంటికి ఏ రంగులో కన్పడుతూ ఉంటాయో ఆ విశేషాలనన్నింటినీ భక్తునిచేత గుర్తింపజేస్తూ ఉండే ధర్మం మనది

కాబట్టే దీన్ని సనాతనధర్మం అన్నారు. దీనికే మరోపేరు హిందూధర్మం అని.

ఈ తొమ్మిది గ్రహాల ఆకారాలూ (సూర్యుడు గుండ్రంగా చంద్రుడు చతురస్రాకారంగా...) అలాగే ఈ అన్ని గ్రహాలకీ సంబంధించిన లోహాలూ (సూర్యుడు బంగారం, చంద్రుడు వెండి...) అదే తీరుగా ఆ యా గ్రహాల బాధనుండి బయట పడడానికి సంబంధించిన ధాన్యాల వివరాలూ (సూర్యునికి గోధుమలూ, చంద్రునికి బియ్యం...) ఆ యా గ్రహాల రంగులూ (సూర్యుడు ఎర్రగా, చంద్రుడు తెల్లగా...) ఇలా ఎన్నో పరిశీలించదగిన రహస్యాలు దాగున్న వ్రతమిది. ఈ నవగ్రహాలూ వాటి కదలిక ఆధారంగా కాలచక్రం తిరుగుతుందనే యధార్థాన్ని తెలియజేసేందుకే ఈ వ్రతాలకు మాత్రమే క్షేత్రంగా ఉండే అన్నవరంలో ఆలయంలో ఘటికాయంత్రం (సూర్య గడియారం) కన్పిస్తుంది. నీడని బట్టి కచ్చితంగా గంటల్నీ, నిమిషాల్నీ లెక్కించే తీరు అక్కడ గీతల రూపంలో ఉంది.

## విష్ణు పంచాయతన క్షేత్రమిది

అన్నవరం ఆలయంలో యంత్రశాల అని ప్రత్యేకంగా కన్పిస్తుంది స్వామి మూలవిరాట్టు కింది ఆవరణలో, ఈశాన్యంలో శంకరుడూ, ఆగ్నేయంలో వానరరూపంలో గణపతీ, నైఋతిలో స్త్రీ రూపంలో కన్పడే సూర్యుడూ (సవిత లేదా గాయత్రి), వాయువ్యంలో అంబికా ఉంటారు. ఈ నలుగురికీ సరిగా మధ్యభాగంలో పైనున్న బిందువు మీద శ్రీ సత్యనారాయణస్వామి విగ్రహం పై ఆవరణలో ఉంటుంది. ఈ తీరుగా నాలుగుదిక్కుల్లో ఉన్న నలుగురిమధ్యలో మహా విష్ణువు ఉండడమనేది ఈ క్షేత్రం విష్ణు పంచాయతనమనే విశేషాన్ని చెప్తుంది. వ్రతంలో కూడ ఇదే తీరు అమరికని చేయిస్తారు పురోహితులు. మరో విశేషమేమంటే శివకేశవులకు భేదం ఏ మాత్రమూ లేదని ఋజువు చేస్తూ ఒకే వేదిక మీద ఇటునుండి చూస్తే ఎడమవైపున శివలింగాకారం ఆయన కుడిపక్కగా శ్రీ వీరవెంకట సత్యనారాయణస్వామీ, ఆయనకు కుడిపక్కగా రమాదేవీ (ఆద్యాది అనంతలక్ష్మి) కన్పిస్తారు.

ఈ స్వామి హరి హర హిరణ్యగర్భ (బ్రహ్మ) స్వరూపాలు మూడూ కలిసినవాడు కాబట్టే 'హరిహర హిరణ్యగర్భాత్మక శ్రీ వీరవేంకటసత్యనారాయణ స్వామినే...' అంటూ చెప్తారు. సంకల్పంలో ఇదే తీరుగా అమ్మ అయిన ఆద్యాది అనంతలక్ష్మీ దేవి కూడ ముగ్గురు తల్లుల రూపాలూ కలిసిన మూర్తే. అందుకే ఈమెని అనంత లక్ష్మీసత్యవతి అంటారు. అంతం అనేది లేనిది ఏవరో ఆమె అనంత (పార్వతీదేవి). లక్ష్మి మరెవరో కాదు శ్రీహరికి భార్య. సత్యమైన వాక్కు కలదీ- సత్యలోకంలో ఉండేదీ సత్యవతి (బ్రహ్మ భార్య సరస్వతి). కాబట్టి ఈమె త్రిశక్తిరూపిణి అన్నమాట.

## స్వామివారి రూపంలో విశేషాలు

కలియుగానికి నిర్ణయింపబడ్డ వర్ణం నలుపు. అందుకే స్వామి నల్లని శరీరచ్ఛాయతో ఉంటాడు. శుభాలని కలిగించే వాడూ, ఏ కోరిక మనం తీరాలని మనలో అనుకుంటామో అలా అనుకున్న కోరికను తీరుస్తూ వరమిచ్చే స్వామి కాబట్టి, అన్నవరస్వామీ అయిన కారణంగా ఈయన్ని అన్నవరస్వామి అంటారు. ఇంత గొప్పవాడు కాబట్టే, ఈయన పేరుకు ముందు 'శ్రీ' చేర్చారు. తన భుజానికి ధనుస్సూ, బాణమూ ఉంటాయి కాబట్టి ఈయన పేరులో 'వీర' అనే విశేషణాన్ని పెట్టారు. యుద్ధవీరుడూ, ధర్మవీరుడే కాక దయావీరుడు కూడ (దయని చూపించడంలో ఇంత అంత కాదు). వేం పాపాలని, కట- నాశనం చేయగల శక్తి కలవాడు కాబట్టి ఈయన పేరులో 'వేం-కట' శబ్దాన్ని చేర్చారు. ఇన్ని గొప్ప గుణాలు కలిగి వీరగుణం విశేషంగా కలవాడు కాబట్టే ఈయన ఆకారంలో ముఖానికి మీసాలను ఉంచారు. ఈ వీరుని ఆలయానికి క్షేత్ర పాలకులు సీతారాములు కాబట్టే వారి ఆలయం ఈ ప్రాకారంలోనే ఉంటుంది. భద్రాచల సీతారాముల ఆలయానికి ఈయన క్షేత్ర పాలకుడు.

ఇక అన్నవరం ఆలయానికి ప్రధానద్వారం దగ్గర వనదుర్గ ఉంటుంది. వనదుర్గా మంత్రమని ఒకటుంది. దాన్ని మననం చేస్తే వ్యక్తికి తిరుగు ఉండదనేది ఈ వనదుర్గా ఆలయపు ఏర్పాటులోని రహస్యం. అన్నిటికీ మించి ఈ స్వామి చేతికి ఒక కంకణం ఉంటుంది. అడిగిన భక్తునికి అడిగినట్లుగా అర్హతను బట్టి కోరికని తీర్చితీరుతానని కంకణాన్ని కట్టుకున్నాడట- అదీ ఈ కంకణరహస్యం. ఈ హరిహర హిరణ్యగర్భాత్మక (త్రిమూర్తి స్వరూపుడు) స్వామి క్రింద శ్రీమత్ త్రిపాత్ విభూతి మహావైకుంఠ నారాయణయంత్రం ఉంది. దానికి నిత్యం అదే ఉపనిషత్తుతో అర్చన జరుగుతూ ఉంటుంది కూడ. ఆ కారణంగానే ఇంత వైభవం ఆ స్వామికి!



ధారావాహిక ప్రారంభం

శ్రేష్ఠలూరి వేంకటార్య ప్రణీత

# శ్రీనివాస విలాస సేవధి-ద్విపదకావ్యం

సంక్షిప్తవచనం- ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి

శ్రీనివాస విలాససేవధి ద్విపదకావ్యం తిరుమల శ్రీనివాసుని దివ్యలీలావిలాసాల్ని వర్ణించిన చక్కనికావ్యం. వేంకటపతి లీలావృత్తాంతాలకీకావ్యం నిధి.

వేంకటార్యుడు భారద్వాజగోత్ర సంభవుడు. ఆపస్తంబసూత్రుడు, అష్టభాషాకవిత్వ రచనాప్రవీణుడు, అష్టావధాన విఖ్యాత బిరుదాంచితుడు. ఈయన కావ్యరచనాభిలాషియై ఉన్న వేళ శ్రీ వేంకటాచలపతి అతడికి స్వప్నంలో సాక్షాత్కరించి ఇలా ఆజ్ఞాపించాడు- "ఓ కవివర్యా! నీవు ఇంతకుపూర్వమే అనేక ప్రబంధాలు రచించావు. ఇప్పుడు మాకు సంతోషం కలిగేటట్టుగా శేషాచల వైభవాన్ని వర్ణించే ఒక కృతిని చెలువైన రీతిలో రచింపుము."

శ్రీ వేంకటేశ్వరుని ఆనతి ప్రకారం వేంకటార్యుడు వెనువెంటనే మేల్కొని ఆనందతరంగి తుడై కావ్యరచనకు పూనుకున్నాడు.

వివిధపురాణాల్లోని శ్రీనివాసుని కథలను ఏరి, వాటిలోని పునరుక్తులను తొలగించి, ఆ కథలకు ఆద్యంతాల్ని వేర్పరచి, పూర్వోత్తర విరోధాలను పరిహరించి, ఇంపైన మహాకావ్య లక్షణాల్ని సమకూర్చి వేంకటాద్రిమాహాత్మ్యం ప్రకటితమయ్యేట్లు, ఈ ద్విపదకావ్యాన్ని రచించాడు. 'శ్రీనివాస విలాస సేవధి' అనే ఈ ఆరు ఆశ్వాసాల కావ్యాన్ని శ్రీవేంకటాచలపతికే అంకితమిచ్చాడు.

వేంకటార్యుని తల్లి లక్ష్మి. తండ్రి కృష్ణయార్యుడు. గురువు అన్నావి అప్పలాచార్యులు.

కావ్యాంతంలో కవి వివరించిన గొప్ప రహస్యం శ్రీవేంకటాద్రీశుని మహిమను ప్రస్ఫుటంగా వెల్లడిస్తుంది. అదేమంటే సకల వేదాంతార్థసార రూపమే శ్రీనివాసస్వామి. స్వామి కొలువుతీరిన వేంకటాద్రి ఆనందనిలయం. స్వామిపుష్కరిణి జీవకోటులను పాప విముక్తులను చేయడానికి పావనస్థితితో వెలసినటువంటిది. వేంకటాచలమాహాత్మ్యాన్ని సంపూర్ణంగా తెలిసి ప్రపంచంలో ఎక్కడున్నా, ఎలాంటి వ్యక్తి అయినా వేంకటాచలానికి అభిముఖంగా వ్రాలి, నమస్కరించి, మనసులో ధ్యానిస్తే చాలు శ్రీనివాసుడు వారి ముందు నిలిచి, కరుణతో వారి కోరికలు నెరవేర్చుతాడు. వేదశాస్త్రంవంటి విద్య, శ్రీదేవికి సాటి వచ్చు దేవత, పంచభూతాల్లో భూమికి సాటి వచ్చేది, స్వామిపుష్కరిణికి సాటివచ్చే తీర్థం, వేంకటాద్రికి సమానమైన దైవము సృష్టిలో లేనే లేవు. దీనికి ఉమాపతే ప్రత్యక్షసాక్షి. ఇంతటి బృహత్తరమైన, మహత్తరమైన స్వామి శ్రీనివాసుని విలాస కథలకు నిధి ఈ కావ్యం.

(ఇంకా ఉంది)



# ఏకాదశీవ్రత మాహాత్మ్యం

– శ్రీ కె.ఎస్.వి.కె.స్రవంతి

సూర్యవంశానికి చెందిన ఋతధ్వజుడు విదిశా మహారాజు. ఆయన కొడుకు రుక్మాంగదుడు. ఋతధ్వజుడి తదనంతరం రుక్మాంగదుడు రాజ్యభారాన్ని చేపట్టాడు. రుక్మాంగదుడి భార్య సంధ్యావళి. విష్ణుభక్తుడైన రుక్మాంగదుడికి సంధ్యావళి అన్నివిధాలా అనుకూలమైన భార్య. వారికి ధర్మాంగదుడనే కొడుకు కలిగాడు. విష్ణుభక్తితత్పరులైన తల్లిదండ్రుల పెంపకంలో ధర్మాంగదుడు కూడా బాల్యం నుంచి విష్ణుభక్తుడయ్యాడు.

విష్ణుభక్తులలో అగ్రగణ్యుడైన అంబరీషుని ద్వాదశీ నియమం మాదిరిగానే, రుక్మాంగదుడికి ఏకాదశి నియమం ఉండేది. దశమి ద్వాదశి తిథులలో ఏకభుక్తం పాటిస్తూ, ఏకాదశి తిథినాడు ఉపవాసం చేసేవాడు. తాను మాత్రమే కాకుండా తన రాజ్యంలోని ప్రజలందరూ ఈ వ్రత నియమాన్ని పాటించాలని చాటింపు వేయించాడు. రాజభక్తులైన ప్రజలు తు.చ. తప్పకుండా ఏకాదశి వ్రత నియమాన్ని నియమం తప్పకుండా పాటించేవారు. రుక్మాంగదుడి పాలనలోని ప్రజలందరూ ఏకాదశి వ్రత పరాయణులు కావడంతో వారందరూ మరణించిన తర్వాత స్వర్గానికి వెళ్లసాగారు.

రుక్మాంగదుని రాజ్యంలో యమదూతలకు అడుగు పెట్టే అవకాశం లేకుండా పోయింది. యమునికి పనిలేకుండా పోయింది. ఈ పరిస్థితికి యముడు కలతచెందాడు. వెంటనే బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్లాడు. “కమలసంభవా! విదిశారాజ్యంలో నేను శిక్షించదగిన వారెవరూ లేరు. ఎలాగైనా వారి ఏకాదశీ వ్రతానికి భంగం కలిగించు.” అని కోరాడు. యముని ద్వారా రుక్మాందుని వ్రతదీక్షను, అతని ప్రజల భక్తి తత్పరతలను తెలుసుకున్న బ్రహ్మదేవుడు వారి వ్రత దీక్షను పరీక్షించదలచాడు. అప్పటికప్పుడే తన సంకల్పంతో ‘మోహిని’ అనే అప్సరసను సృష్టించాడు.

“మోహినీ ! నువ్వు భూలోకానికి వెళ్లు. అక్కడ రుక్మాందుని ఏకాదశీవ్రతానికి భంగం కలిగించు” అని బ్రహ్మదేవుడు ఆదేశించాడు. బ్రహ్మదేవుని ఆదేశం మేరకు మోహిని భూలోకానికి చేరుకుంది. విదిశా రాజధాని వెలుపల అరణ్యప్రాంతంలో ఉన్న శివాలయంలో కూర్చుని వీణ వాయిస్తోంది. అదే సమయానికి రుక్మాంగదుడు మృగయావినోదం కోసం అరణ్యానికి వచ్చాడు. కీకారణ్యంలో సంచరిస్తూ, ఎన్నో క్రూరమృగాలను వేటాడాడు. వేటముగించుకుని రాజధాని వైపు తిరుగు ప్రయాణం ప్రారంభించాడు. కొంతదూరం వచ్చాక శ్రావ్యమైన వీణానాదం వినిపించింది. అరణ్యంలో వీణానాదం ఎక్కడిదని రుగ్మాంగదుడు ఆశ్చర్యపోయాడు. వీణానాదం వస్తున్న దిశగా ముందుకు సాగుతూ శివాలయం వద్దకు వెళ్లాడు. ఆలయంలోకి అడుగుపెడుతూనే ఆలయమండపంలో వీణ వాయిస్తున్న ముగ్ధమోహన సుందరాంగి మోహిని కనిపించింది. ఆమె రూపలావణ్యాలను చూడగానే



ఆంజనేయుడు పారిజాతవృక్షం మూలంలో కూర్చుని ఉంటాడు

రుక్మాంగదుడు మోహపరవశుడయ్యాడు. "సుందరాంగీ ! నిను చూడగానే వలచాను. నీకు సమ్మతమైతే క్షత్రియోచితంగా గాంధర్వవివాహం చేసుకుంటాను" అన్నాడు. ఆమె అంగీకారంతో ఆమెను ఆ ఆలయంలోనే గాంధర్వపద్ధతిలో వివాహం చేసుకుని, ఆమెను వెంటపెట్టుకుని రాజధానికి చేరుకున్నాడు రుక్మాంగదుడు. కొన్నాళ్లకు యథావిధిగా ఏకాదశి వచ్చింది. రుక్మాంగదుడు నియమానుసారం దశమినాడు ఏకభుక్తుడై ఏకాదశి రోజున ఉపవాసం ప్రారంభించాడు. "నన్ను అనుదినం సుఖభోగాలలో ముంచెత్తుతానని చెప్పి, ఉపవాసాలు, వ్రతాలు అంటూ నన్ను ఉపేక్షించడం తగునా? ఉపవాసం చాలించి, నాతో విహరించు, పద" అని పల్కింది మోహిని.

'సూర్యుడు పడమరన ఉదయించినా, మేరు, మంథర పర్వతాలు భూమిలోకి కుంగిపోయినా, అగ్నిహోత్రం చల్లబడిపోయినా, నా వ్రతనియమాన్ని మాత్రం తప్పను నేను" అని పల్కాడు రుక్మాంగదుడు.

అతని సమాధానానికి ఆగ్రహించిన మోహిని, నానా దుర్భాషలాడింది. "ఏకాదశి వ్రత నియమాన్ని విడిచిపెట్టడం తప్ప నీకు ఇష్టమైంది ఇంకేం చేయమన్నా చేస్తాను. చెప్పు" అనునయంగా రుక్మాంగదుడు పల్కాడు.

"అలాగైతే నీ కొడుకు తలనరికి ఇవ్వు" అందామె. రుక్మాంగదుని కొడుకు ధర్మాంగదుడు ఆమాట విన్నాడు. తన తండ్రి వ్రత నియమానికి భంగం కలగకుండా ఉండడం ముఖ్యమని తలచాడు. వెంటనే ఖడ్గం తీసుకుని, మోహిని ఎదుట నిలిచి, తన కంఠాన్ని తానే నరికేసుకున్నాడు. ఇది చూసి మోహిని భయభ్రాంతురాలైంది. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురూ ఒక్కసారిగా అక్కడ ప్రత్యక్షమయ్యారు. "రుక్మాంగదా! నీ వ్రత నియమం సాటిలేనిది, ఇహ పరాలలో అనంతసౌఖ్యాలను అనుభవించు, ఇప్పుడే నీ కొడుకును బ్రతికిస్తున్నాం" అని పలికి, ధర్మాంగదుని బ్రతికించి, అంతర్ధానమయ్యారు. మోహిని సత్యలోకానికి వెళ్లిపోయింది.

## ఏకాదశి - పాటించాల్సిన నియమాలు

**సూర్యోదయం కాకముందే నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకుని, చల్లని నీళ్లలో స్నానం చేయాలి. తొలినాడు ఉతికి ఆరవేసిన తెల్లనివస్త్రాలు ధరించాలి. (ఒకటి కట్టుకునేది, ఒకటి ఉత్తరీయం. ఉత్తరయం లేనిదే ఏకవస్త్ర ధారియైన వ్యక్తి చేసే పితృకార్యాలకు ఫలితం లేదు. పైగా రాదు) అశుచిగా ఉండరాదు. అసత్యమాడరాదు. కానిపనులు చేయకూడదు. నిద్రించరాదు. మనసు ఎలాంటి దుష్టచింతనకూ లోను కారాదు. తాంబూలం వేయరాదు. విష్ణుకథలనే చదవాలి, వినాలి.**

**దశమినాడు ఏకభుక్తం చేయాలి. మర్నాడు పగలూరాత్రీ పూర్తిగా ఉపవాసం చేయాలి. విష్ణ్వాలయానికి వెళ్లి ఈ రాత్రి జాగారం చెయ్యాలి. వేకువజాము కాగానే స్నానంచేసి, హరి నామ సంకీర్తనం చేయాలి. ద్వాదశి గడియలు రాగానే విష్ణు భక్తులూ, విద్వాంసులూ అయిన బ్రాహ్మణులకు షడ్రసోపేతమైన విందు చేసి వారికి సంతృప్తి కలిగించాలి. భోజనానంతరం తాంబూలం సువర్ణపు నాణాలు దక్షిణగా ఇవ్వాలి. తరువాత మిత్రులతో పారణ చెయ్యాలి. ఆ భోజనం నూనె పిండివంటలతో, మాంసంతో చెయ్యకూడదు, శాస్త్రనిషిద్ధమైన కూర తినరాదు. ఆ పగలు కూడా నిద్రించకూడదు. ఆ రాత్రి భుజించరాదు. ఆ రాత్రి స్త్రీ సంగమం పనికిరాదు. ఏకాదశి రోజున స్వేచ్ఛావిహారం పనికిరాదు.**



# ధర్మం కాపాడడానికే భగవంతుని అవతారాలన్నీ

-శ్రీ సన్నిధానం నరసింహశర్మ

ధర్మాన్ని కాపాడటానికే భగవంతుడు అవతారాలు ధరిస్తాడు. పూర్వం తారకాసురుడు అనే రాక్షసుడు బ్రహ్మ గురించి ఘోర తపస్సు చేశాడు. బ్రహ్మ ప్రత్యక్షమయ్యాడు. "తారకాసురా! నీ తపస్సు అమోఘమైంది. నన్ను మెప్పించితివి. నీకేమి వరం కావాలో కోరుకో" అన్నాడు. తారకాసురుడు బ్రహ్మతో "ఓ! విధాతా! సృష్టికర్తా! నాకంటే బలవంతుణ్ణి ఇక ముందు నీవు సృష్టించరాదు. నేనే అందరికన్నా మిక్కిలి బలవంతుడినవ్వాలి" అని కోరుకున్నాడు. బ్రహ్మ "సరే" నన్నాడు.

బ్రహ్మవరంతో తారకాసురుడు గర్విష్టుడై లోకాలన్నింటిని బాధించడం మొదలుపెట్టాడు. ఇంద్రాది దేవతలు మళ్లీ బ్రహ్మవద్దకు పోయి "స్వామీ! తారకాసురుడు మితిమీరిన వరగర్వంతో విర్రవీగి కన్నుమిన్నుగానక ప్రవర్తిస్తున్నాడు. తన మాట వినని వారందరినీ చంపివేస్తున్నాడు. ప్రజలను వివిధరకాలుగా బాధిస్తున్నాడు. మేమతని బాధలకు ఓర్వలేక పోతున్నాం. మీరే మాకు శరణ్యం. మమ్ములను కాపాడే బాధ్యత మీ మీదే ఉంది. ఏం చేయవలెనో విన్నవించు"మని ప్రాధేయ పడ్డారు.

బ్రహ్మ వారితో "దేవతలారా! దీనికొక్కటే మార్గం. శివుని కుమారుడొక్కడే తారకుని చంపగలవాడు. మరెవరూ ఆతనిని చంపలేరు." అని చెప్పాడు.

అంతట దేవతలు బ్రహ్మ, విష్ణుమూర్తితో సహా శివ పార్వతుల కల్యాణం జరిగేటట్లు చూచారు. తరువాత శివునికి కుమారస్వామి జన్మించాడు. కుమారస్వామిని దేవతలకు సేనాపతిగా నియమించారు. సకలదేవతలు తమశక్తిని కుమార స్వామికి ధారపోశారు. కుమారస్వామి మిక్కిలి బలోపేతుడయ్యాడు. సహజంగా పుట్టుకతో వచ్చిన తేజస్సు కాక మహాత్ములు ధారపోసిన తేజస్సుతో వెలుగొందసాగాడు.

తారకాసురునికి ఈ విషయం తెలిసింది. శివుని కుమారుడైన కుమారస్వామి ఈశ్వరాంశతో జన్మించాడని, దేవతలకు సైన్యాధ్యక్షుడయ్యాడని తెలుసుకున్నాడు. కుమారస్వామి దేవగణాలతో వెళ్లి తారకాసురునితో తలపడ్డాడు. తారకాసురునికి, కుమారస్వామికి ఇద్దరికి ఘోరయుద్ధం జరిగింది. ఆ భీకర యుద్ధంలో కుమారస్వామి తారకాసురుని సంహరించాడు.

తారకాసురుని కుమారులు తమతండ్రిని చంపిన కుమారస్వామి పై పగతీర్చుకోవాలనుకొన్నారు. వారు ముగ్గురు- విద్యున్మాలి, తారకాక్షుడు, కమలాక్షుడు. వీరు బ్రహ్మను గురించి తీవ్రమైన తపస్సు చేశారు. వారి కఠోరతపస్సుకు లోకాలు తల్లడిల్లసాగాయి.

బ్రహ్మ ప్రత్యక్షమై "మీకేం వరం కావాలో కోరుకొనండి" అన్నాడు. "దేవా! మా ముగ్గురికి మరణం లేకుండునట్లు వరం ప్రసాదించండి" అని కోరుకున్నారు. "వీలుకాదు నాయనలారా! నాకు అలాంటి వరం ఇవ్వడానికి సాధ్యపడదు. మరేదైనా వరం కోరుకోండి" అన్నాడు.

అంతట తారకాసురుని కుమారులు "దేవాదిదేవా! మా అన్నదమ్ములకు మూడు కామగమనం గల (ఎవరికీ కనిపించకుండా సంచరించే) పట్టణాలను ప్రసాదించండి. మే మా పట్టణాలతో సహా ఆకాశమార్గాన కామగమనం చేస్తూ ఉంటాం. ఆ పట్టణాలు శత్రువులు ప్రవేశించటానికి వీలుగాకుండా ఉండాలి. మేము అనుకున్న చోటికి పోగల శక్తిని గలిగి యుండాలి. అలాంటి వరాన్ని ప్రసాదించండి" అని కోరుకున్నారు. బ్రహ్మ 'సరే' నని వరం ఇచ్చాడు. వారు అడిగిన ప్రకారం త్రిపురాసురుని ముగ్గురి కుమారులకు మూడు కామగమనం కల పట్టణాలు నిర్మించి ఇచ్చాడు. మొదటిపట్టణాన్ని బంగారంతోను, రెండవదాన్ని వెండితోను, మూడవదాన్ని ఇనుముతోను నిర్మించి ఇచ్చాడు. ఈ మూడు పట్టణాలు విడి విడిగా ఉన్నంతవరకూ మిమ్మల్ని ఎవరు జయించలేరని, మూడుపట్టణాలు కలిస్తే మాత్రం మీ శక్తి నశిస్తుందని షరతును విధించాడు.

ఇంతలో తారకాసురుని మనుమడు, తారకాక్షుని కుమారుడైన హరి అనేవాడు విష్ణుమూర్తిని గూర్చి ఘోర



ప్రతి మంగళవారం ఆంజనేయ అష్టోత్తరాన్ని ఆకుపూజతో చేస్తే చాలా మంచిది

తపస్సు చేశాడు. విష్ణుమూర్తి ప్రత్యక్షమై "నీకేం వరం కావాలి. కోరుకో" అన్నాడు. "నారాయణా! మా వారిలో ఎవరు చని పోయినా, వారి శరీరాలు నీటిలో పడగానే ఒక్కొక్క శరీరం మరల పది సజీవశరీరాలుగా అయ్యేటట్లు వరం ప్రసాదిం చండి" అని కోరాడు. విష్ణుమూర్తి ఆ వరాన్ని ఇచ్చాడు.

తారకాసురుని కుమారులు ఇలా అమోఘమైన వరాలు పొంది మహోన్నత బలోపేతులైనారు. ముగ్గురుకుమారులు మూడుపట్టణాలలో నివసిస్తూ ఎక్కడబడితే అక్కడికి పోయి వస్తూ కాలక్షేపం చేయసాగారు. ఎవరికీ కనిపించకపోవటం వల్ల వారి పట్టణాలు ఎక్కడ వాలితే అక్కడ ఉన్న ప్రజలు చనిపోయేవారు. ప్రజల కట్టడాలన్నీ ధ్వంసం అవుతూవచ్చాయి. మూడులోకాలలో ఉన్న జీవరాశికి వీరివల్ల ఉపద్రవం వచ్చింది. సాహసించి తమపై దండెత్తటానికి వచ్చిన ఇంద్రుణ్ణి వారు తరిమికొట్టారు. స్వర్గాన్ని వదలి ఇంద్రుడు వీరిని తప్పించుకుంటూ తిరగసాగాడు.

రాక్షసులు యజ్ఞయాగాదులు నియమనిష్ఠలతో చేస్తు న్నారు. దీంతో వీరి తేజస్సు ఎక్కువై, దేవతల తేజస్సు తగ్గి పోసాగింది. దేవతల శక్తియుక్తులు క్షీణించసాగాయి. శక్తి సన్నగిల్లటంతో దేవతలు అందరూ బ్రహ్మవద్దకు పోయి మొర పెట్టుకున్నారు. "స్వామీ! రాక్షసుల ముందు, మేము నిలువ లేకున్నాం. వాళ్లు తమ ధర్మశక్తితో మమ్మల్నే మించిపోతున్నారు. దీనికే దైనా ఉపాయమాలోచించి మమ్మ లను ఉద్ధరించండి" అని ప్రాధేయ పడ్డారు. బ్రహ్మ విష్ణుమూర్తి వద్దకు వెళ్లాడు. త్రిపురాసురుల వల్ల దేవతలకొచ్చిన కష్టాలను వివరించి చెప్పాడు.

అంతట విష్ణువు బ్రహ్మతో "చతుర్ముఖా! నీవు భయపడవద్దు. నేను ఆవు రూపం ధరిస్తాను. నీవు దూడరూపం ధరించు. మని ద్దరమూ రాక్షసుల అధీనంలోనున్న అమృత బావిలోపడి అమృతాన్ని త్రాగి వారికి ఇంక అమృతం త్రాగే అవకాశం లేకుండాచేద్దాం." అన్నాడు. బ్రహ్మ 'సరే' నని అంగీకరించాడు.

విష్ణుమూర్తి ఆవురూపం గాను, బ్రహ్మ దూడరూపం గాను మారి త్రిపురాసురుల అమృతబావిలో పడ్డారు. రాక్షసులు అదిచూసి "అయ్యయ్యో! ఆవు, దూడ అమృతబావిలో పడ్డాయే! బయటకు తీద్దాం! పదండి." అంటూ బావిదగ్గరకు వచ్చారు. కాని బావిలో అమృతమూ లేదు. ఆవు, దూడ కూడ కనిపించ లేదు. అప్పటికే బ్రహ్మ, విష్ణువులు, బావిలోని అమృతం అంతా త్రాగేశారు. అదృశ్యమయ్యారు.

రాక్షసులకు ఆశ్చర్యం వేసింది. తారకాసురునికి ఈ విషయం విన్నవించారు. ఎందుకిలా జరిగిందని తారకాసురుడు ఆలోచనపడ్డాడు. ఇంతలో విష్ణుమూర్తి, బుద్ధావతారందాల్చి రాక్షసులను చెడుమార్గం పట్టించాలనుకొన్నాడు.

ఋషీశ్వరునిరూపంలోనున్న విష్ణుమూర్తిని చూచి రాక్షసులు అతణ్ణి ఒక ఋషీశ్వరుడని తలంచారు. ఋషీశ్వరుడు, రాక్షసులవద్దకు వస్తూనే "మీరంతా నాకు నమస్కరించండి. నన్ను గౌరవిస్తే మీరు సుఖసంతోషాలు అనుభవించగలరు." అన్నాడు. రాక్షసులు నవ్వుకుని "మేమంతా నీకు నమస్కరిం చాలా! మాకంటే నీ గొప్పతనమేమిటి? మేమూ నీ వలే ధర్మ



యుక్తంగా నడుచుకుంటున్నాం. నీకెందుకు నమస్కరించాలి" అని ఎదురు ప్రశ్నించారు.

అంతట బుద్ధని అవతారంలోనున్న విష్ణుమూర్తి "రాక్షసులారా! మీవన్నీ మూఢనమ్మకాలు. యజ్ఞయాగాదులు చేస్తే ఏమొస్తుంది. వేదాలు, శాస్త్రాలు, పురాణాలు అన్నీ అబద్ధాలే! పాపపుణ్యాలన్నీ పూజలు పునస్కారాలతో పోతాయా? జప తపాలు, స్నానాలు మనిషిని గట్టెక్కిస్తాయా! మీ వెర్రిగానీ అంతా వట్టి భ్రమ" అన్నాడు.

రాక్షసులకు బుద్ధుడు చెప్పినవి వింతగా తోచాయి. "ఎవరీయన? ఎందుకిలా మాట్లాడుతున్నాడు. ఇందులోని రహస్యమేమిటి? ఎందుకొచ్చాడిక్కడకు?" అనే ప్రశ్నలు వారిలో తలెత్తాయి.

## మార్చి నెల క్విజ్-44 సమాధానాలు

| | | |
|---|---|---|
| 01)దైవం | 06)వేటకు | 11)వేదం |
| 02)దశమి | 07)కాలం | 12)జైమిని |
| 03)ధర్మం | 08)ఋషులు | 13)అయిదు |
| 04)దిక్సూచి | 09)లక్షణ | 14)భాగవతం |
| 05)దైవత్వం | 10)ఐశ్వర్యం | 15)యముడు |

**సరైన సమాధానాలు వ్రాసినవారు-**

**01)యామర్తి శ్రీనివాస సత్కృత్, బెంగళూరు; 02)పి.నితీష్, కోనమ్మ తోట; 03)చిప్పాడ తేజస్వి వేదాంశు, విశాఖపట్నం; 04)గొలివి కౌండిన్య కృష్ణంనాయుడు, పూడివలస; 05)సుంకర మోక్షిత్, తాడికొండ; 06)మేడపాటి కీర్తిక, కుతుకులూరు; 06)జె.లక్ష్మణ్‌వీర్, కుప్పం; 08)భట్టిప్రోలు సూర్యకృష్ణవీరాజ్‌శర్మ, బెంగళూరు; 09)పర్వతం వేంకటభరద్వాజ్, హైదరాబాదు; 10)పులికంటి చైత్ర, హైదరాబాదు; 11)క్రిష్టిపాటి భార్గవ్, హైదరాబాదు; 12)చిప్ప చిన్మయి, పోచారం; 13)కె.గోవిందాచార్యులు, ప్రొద్దుటూరు; 14)తేతల గీతిక, కుతుకులూరు; 15)వేదాంతం అక్షరశ్రీ, హైదరాబాదు; 16)రావిళ్ల రాగమహిక, హైదరాబాదు; 17)ఋత్త్విక్ సాయి, ఖమ్మం; 18)డి.ముక్తేశ్వర్, విజయవాడ; 19)పైడి లక్ష్మిశ్రీ అన్విత, విశాఖపట్నం; 20)కాండూరి శ్రీచరణ్, కోదాడ; 21)జి.అతులిత్ రెడ్డి, హైదరాబాదు, 22)డి.ఎస్.వి.కె.లక్ష్మి సాహితి, తిరుపతి; 23)డి.అహలాదిత, మందమర్రి; 24)సూరంపూడి సత్యసూర్య అభయరామ్, అలంపురం; 25)మామిళ్లపల్లి అభిజ, హైదరాబాదు; 26)జోగంటి ఛాద్విక్, ధర్మవరం; 27)డి.ఎన్. శిరీష, కుప్పం**

అంతట రాక్షసులు ఆయనతో "స్వామీ! ఎవరు మీరు? ఎందుకు విపరీతంగా మాట్లాడుతున్నారు. ఇందులోని రహస్య మేమిటి? మాకు విన్నవించండి" అన్నారు. బుద్ధరూపంలోని విష్ణుమూర్తి "రాక్షసులారా! మీవన్నీ విపరీతబుద్ధులుగా ఉన్నాయి. మనం బ్రతికిఉండటమనేదే సహజం, భౌతికం. దేవుణ్ణి నేను చూడలేదు. మీరు చూశారా? మీ పిచ్చి ఊహ గాని, మీరు సుఖించడం చూడలేక గిట్టనివారెవరో మిమ్మల్ని మాయాపద్ధతిలో ముంచేస్తున్నారు. చెట్లూ, పుట్టలూ, రాళ్లు, రప్పలూ మీకేమి ఇస్తాయి. కావున మూర్ఖులై ప్రవర్తించకండి. దేవుడిచ్చిన సుఖభోగాలను అనుభవించండి" అని బోధించి వారి మనస్సులను చెడునడవడిక వైపు మళ్లించసాగాడు. రాక్షసులు నిజమేననుకుని నమ్మారు.

నాటినుండి ఎక్కడచూచినా రాక్షసులంతా చెడు మార్గంలో నడువసాగారు. పూజలు, పునస్కారాలు మానేశారు. అధర్మాలు, అన్యాయాలు చేస్తూ లోకకంటకులై మునులను, దేవతలను హింసించసాగారు. బుద్ధుడు రాక్షసస్త్రీలను గూడ చెడునడతలోనికి పడద్రోయించాడు. ఈవిధంగా రాక్షసులను చెడుమార్గం పట్టించి ధర్మభ్రష్టులుగా చేశాడు.

ధర్మం నశించి, పాపం పండజొచ్చింది. ఇదే మంచి సమయమనుకొన్నాడు. దేవతలు వచ్చి త్రినేత్రుణ్ణి వేడుకున్నారు. విష్ణువు శివునితో "నీవు వెంటనే త్రిపురాసురుణ్ణి చంపటానికి ప్రయత్నించు. బ్రహ్మరథం నడుపుచుండగా త్రిపురాసురుణ్ణి వధించటానికి ప్రయత్నించు అని చెప్పాడు. బ్రహ్మ రథం నడుపుతుండగా త్రిపురాసురుని మీదకు యుద్ధము చేయడానికి పోయాడు. వారికి విష్ణుమూర్తి ఒక దివ్యాస్త్రంగా మారాడు.

శివుని ప్రభావం వల్లనూ, ఆయన ప్రయోగించిన గొప్ప అస్త్రాలవల్ల రాక్షసులు తగ్గుముఖం పట్టసాగారు. శంకరుడు ప్రయోగించిన దివ్యాస్త్రం వల్ల మూడుపట్టణాలు ఏకకాలంలో కాలిపోయాయి. రాక్షసులంతా మంటలలో చిక్కుకొని భస్మమై పోయారు.

శ్రీమన్నారాయణుడు బుద్ధ అవతారంలో రాక్షసులను చెడుమార్గంలోనికి ద్రోసి, ముల్లోకాలు రాక్షసులబారిని పడ కుండ ఆపుచేయగలిగాడు.



హనుమంతుణ్ణి ఉపాసించడమంటే, ఆయనకు దగ్గరగా ఉండడమే

# ప్రాణాధారం!

- డా॥ యల్లాప్రగడ మల్లికార్జునరావు, 98485 43520

నీటిని ఎందుకు దైవస్వరూపంగా భావించాలంటే సకల చరాచరజగత్తు జలం నుంచి ఆవిర్భవించిందే. అంటే అన్నిటికీ మూలం జలమే. నీరు ఎక్కడ లేకపోతే అక్కడ ప్రాణులకు జీవనవ్యాపారమే ఉండదు. క్రిములు, కీటకాలకు, పక్షులకు జలమే ముఖ్య ఆశ్రయం. నీరున్నచోట సకలదేవతలూ, ఋషులు అంతా ఉంటారు. మనుషులందరికీ పరలోకంలో కూడా సుఖాన్ని కలిగించేది నీరొక్కటే. అది ఎలాగంటే ఈ లోకంలో జలదానాలు చేస్తే పైలోకాల్లో స్వర్గసుఖాలు లభిస్తాయి. అందుకే వివేకి అయిన వాడు జలాశయాలను నిర్మించాలి. బావులను తవ్వించినందువల్ల అగ్నిష్టోమ ఫలితం దక్కుతుంది. సరస్సులు నిర్మిస్తే అశ్వమేథఫలం దక్కుతుంది. నిరంతరం నీరుండేలాగా బావిని నిర్మిస్తే జీవితంలో చేసిన సగం పాపాలు హరించుకుపోతాయి. దిగుడుబావి పది మామూలు బావులతో సమానమైంది. ఒక మాదిరి చెరువును నిర్మించినా ఆ వ్యక్తికి వరుణ, దేవలోక ప్రాప్తి కలుగుతుంది. ఆ లోకాల్లో పదివేలసంవత్సరాలపాటు హాయిగా సుఖించవచ్చు. గోవులు మేతమేసి బీడుదగ్గర చెరువును తవ్వించినవారికి గోలోకం లభిస్తుంది. ప్రజలకు ఉపయోగపడేలా చెరువులు తవ్వించిన వారికి ఇంద్రలోకప్రాప్తి కలుగుతుంది. ఎడారి ప్రదేశాలలో చెరువులు తవ్వించి అది నిరంతరం నీటితో ఉండేలా చేసిన వ్యక్తి సూర్య సమానతేజస్సుతో ప్రకాశించే విమానంలో బ్రహ్మలోకానికి చేరే అర్హత లభిస్తుంది. తవ్వించిన చెరువులో వర్షాకాలంలో నీరు నిలువ ఉంటే ఆ చెరువు తవ్వించిన వ్యక్తికి అగ్నిష్టోమ యాగఫలం లభిస్తుంది. అదే శరత్కాలంలో అయితే "ద్వాదశాహం" అనే యజ్ఞఫలం, హేమంతంలో అయితే "గోసవ" యాగఫలం, శిశిరంలో అయితే "పౌండరీక" యాగఫలం, వసంతఋతువులో చెరువులో నీరు నిలిచేలా చేస్తే "వాజపేయ" యజ్ఞఫలం, గ్రీష్మంలో అయితే "అశ్వమేథ" యజ్ఞఫలం దక్కుతాయి. పంటలకు ఉపయోగపడేలా పంటకాల్వలను నిర్మిస్తే అన్న, ప్రాణ, దాన ఫలితాలు దక్కుతాయి. అలాంటి వ్యక్తి భగీరథుడు పొందిన లోకాలను పొందుతాడు. సహజంగా ఏర్పడిన జలాశయాలలో పూడిక తీయించటంలాంటి పనులు చేసి నీటి సౌకర్యాన్ని కల్పిస్తే పదిగోవులను దానం చేసిన ఫలితం దక్కుతుంది. జలాశయాలు పాడుపడ్డప్పుడు వాటిని బాగుచేయించి చక్కటి గట్లు వేయించి కొండ రాళ్ల వంటి వాటితో వాటి గట్ల నిర్మాణాన్ని పటిష్ఠం చేసి ఆ జలాశయాల్లోని నీరు అందరికీ ఉపకరించేలా చేస్తే ఆ వ్యక్తి స్వర్గలోకంలో పూజలందుకుని సుఖిస్తాడు. చెరువులోని నీరు బయట పొలాలకు అందేలా తగిన కాలువలు, రాతి గొట్టాల లాంటివి నిర్మిస్తే గొప్ప పుణ్యఫలం దక్కుతుంది. చెరువుల్లోని నీరు పరిశుభ్రంగా ఉండేలా తగిన చర్యలు తీసుకున్న వ్యక్తి కూడా ఉత్తమ పుణ్యఫలానికి అర్హుడు. ఇవన్నీ చేతకాకపోయినా, చెయ్యడానికి వీలుకాకపోయినా దప్పిగొన్న వ్యక్తికి కాసిని మంచినీళ్లు ఇచ్చినా స్వర్గంలో పూజలు లభిస్తాయి. ఇక తనకు తానుగా తన చేతులతో కొద్దిపాటి జలాశయాన్ని నిర్మించినా అతడు రాజసూయ, అశ్వమేధయాగ ఫలితాలను పొందుతాడు. ఇలాంటి జలాశయాలలో స్నానం చేసిన వ్యక్తి నదీస్నాన పుణ్యఫలానికి అర్హుడు. ఇలా చెరువును నిర్మించేటప్పుడు ఎవరు సహాయం చేసినా పుణ్యఫలం దక్కుతుంది. జలాశయాల నిర్మాణం వల్ల వాటిలోని నీటితో ఈ లోకంలో తృప్తి, సుఖమూ లభిస్తే అవి నిర్మించినందువల్ల ఎంతో గొప్ప పుణ్యఫలం పైలోకాల్లో లభించి తీరుతుంది. పురాణాలకాలం లోనే నీటి విలువను తెలుసుకొని ఆ నీటిని పవిత్రంగా చూసుకోవటం, నీటి సౌకర్యాలను తగిన విధంగా ఏర్పాటు చేసుకోవటం అనేవి ఎంత అవసరమో తెలియచెప్పినట్లు మనకు కన్పిస్తుంది. ఒకరు చేసిన మంచి పని వల్ల సమాజానికి మేలు కలిగితే దాన్ని మించిన పుణ్యఫలం మరేదీలేదు.



# అన్నమయ్య జానపదం

- శ్రీ గంధం బసవ శంకరరావు,
93464 79649

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారిని 32,000 సంకీర్తనలతో అర్చించి తరించిన పరమ భాగవతోత్తముడు శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యులవారు. దక్షిణభారతదేశంలో తొలి వాగ్గేయకారుడైన ఈ భక్తాగ్రగణ్యుడు కడపజిల్లా రాజంపేట తాలూకా తాళ్లపాక గ్రామంలో 1408 సం॥లో వైశాఖమాసం విశాఖనక్షత్రంలో జన్మించాడు.

అన్నమయ్య పాటలను "ఆంధ్రవేదం"గా అభివర్ణిస్తారు. దీనికి కారణం వేదాల్లోని సారాన్నంతా అలతి అలతి అచ్చ తెలుగుపదాలుగా మలచి, పామరులకు అర్థమయ్యే సులభమైన రీతిలో అందించడమే. ప్రబంధకవులు రాజ్యమేలుతున్న కాలంలో పద్యాన్ని త్రోసిరాజని పదానికి పట్టం కట్టిన ధీరుడు అన్నమయ్య. ఈయన తన పాటలను పండితుల కోసం కంటే, పామరులకోసమే రాశాడు, జానపదులతో మమేకమైనాడు. సామాన్యమానవులతో తిరిగి విష్ణుభక్తిని ప్రచారం చేశాడు.

జానపదసంగీతాన్ని తన పాటలలో చొప్పించాడు. జీవితంలోని ప్రతి ఘట్టానికి అనువైన పాటనొకదాన్ని సృష్టించాడు. ఈయన సంకీర్తనలలో జాజఱలు, చందమామలు, కోవెల, చిలుక, తుమ్మెద పదాలు, లాలి, సువ్వి, గొబ్బి, ఉయ్యాల, లాల, జోల, జోజో, జేజే, జయజయ, విజయీభవ, శోభన, మంగళ, వైభోగాలు, మేలుకొలుపులు, నలుగులు, దంపుళ్లు, కొట్నలు, కూగూగులు, గుజ్జనగూళ్లు, చందమామ గుటకలు, నివాళులు, ఆరతులు, మంగళారతులు, జయమంగళాలు, అల్లోనేరేళ్లు, చాగుబళాలు, బళాబళాలు, సొసముఖాలు, అవధానాలు, తందానలు, వెన్నెలలు కోకొల్లలు.

ప్రతి తెలుగుతల్లి తన మురిపాలబిడ్డను పొత్తిళ్లలో పొదుగుకొని సాయంసంధ్యవేళ వినీలాకాశంలో వెలుగులీనుతున్న చందమామను చూపిస్తూ 'చందమామ రావో జాబిల్లి రావో, మంచి కుందనంపు వెండికోర వెన్నపాలు తేవో' అంటూ కమ్మని గోరుముద్దలు తినిపిస్తుంది, తరువాత ఆ బిడ్డను ఉయ్యాలలో పడుకోబెట్టి, 'జో అచ్యుతానంద, జోజో ముకుంద, రావె పరమానంద రామగోవింద' అంటూ జోల పాడుతుంది. అన్నమయ్యపాటలోని మాధుర్యానికి, అమ్మప్రేమలోని కమ్మదనానికి పరవశించిన బిడ్డ హాయిగా నిద్రలోకి జారుకుంటాడు. తరతరాలుగా తెలుగువారిని అలరిస్తున్న ఈ పాటలు అన్నమయ్య అందించిన వరాలు.

అన్నమయ్య వేదాంతసారాన్ని 'బ్రహ్మమొక్కటే, పరబ్రహ్మమొక్కటే, తందనాన ఆహి, తందనాన పురే' అంటూ ఎలుగెత్తి చాటాడు. 'నిండార రాజు నిద్రించు నిద్రొకటే! అండనే బంటు నిద్రదియు నొకటే, అందరికీ శ్రీహరే అంతరాత్మ' అంటూ సర్వసమానత్వాన్ని జానపద కీర్తనలలో చాటి చెప్పాడు. పంచభూతాలకు లేని తారతమ్యాలు మానవులమైన మనకెందుకని ఎదురు ప్రశ్నించాడు.

*"ఏకులజుడేమి ఎవ్వడైననేమి, ఆకడ నాతడె హరి నెఱిగిన వాడు"* అంటూ కులభేదాలను నిరసించాడు. సత్యసంపన్నత, ధర్మతత్పరత, భూతదయ మొదలైన లక్షణాలు కలిగినవాడు ఉత్తముడన్నాడు

అన్నమయ్య కవిత్వంలో స్త్రీ సంబంధమైన జానపద కీర్తనలు అనేకం ఉన్నాయి. శ్రీవేంకటేశ్వరస్వామివారి దేవేరి అలమేల్మంగ పైనా అన్నమయ్య పాటలనేకం రాశాడు. చక్కని తల్లికి ఛాంగుభళా, తన చక్కెర మోవికి ఛాంగుభళా అంటూ అమ్మవారి అతిశయ సౌందర్యాన్ని కీర్తిస్తాడు. అందమైన అచ్చ



తెలుగుపదాలతో నిండిన ఈ పాటలో లాలిత్యం, సౌకుమార్యం, సహజత్వం ఒప్పారి ప్రవహిస్తున్నాయి. సువ్వి సువ్వి అని స్త్రీలు రోకళ్లతో దంచే దృశ్యాలను మనం పల్లెటూళ్లలో చూస్తుంటాం! అన్నమయ్య 'సువ్వి సువ్వనచు దేవకినందను గనియె' అంటూ కృష్ణుని పుట్టుకని వర్ణిస్తాడు. ఇక్కడ దేవకీదేవి అందరి తల్లుల్లా ప్రసవవేదనతో కాకుండా నవ్వుతూ ప్రసవించిందట! ఈ పాటలో చంద్రోదయం కావడం, కలువలు వికసించడం, గాడిద అరవడం వంటి ప్రకృతి సంబంధమైన విషయాలు కూడా ప్రస్తావితమైనాయి.

సంక్రాంతి నెలలో యువతులు తమ ఇళ్ల ముందు గొబ్బిళ్లు పెట్టి వలయాకారంలో వాటి చుట్టూ తిరుగుతూ 'గొబ్బిళ్లో,



గొబ్బి' అని పాడుకుంటారు. 'కొలనిదోపరికి గొబ్బిళ్లో, యదు కులము స్వామికిని గొబ్బిళ్లో' అంటూ ఈ సందర్భాన్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తాడన్నమయ్య!

లోకంలో అత్తా కోడళ్ల మధ్య ఉండే తగాదాలు మనందరికీ తెలిసినవే! అన్నమయ్య చమత్కారంగా లక్ష్మీసరస్వతుల మధ్య గల గొడవలను ఓ పాటలో చిత్రీకరించాడు. 'రావే కోడల' అని లక్ష్మీదేవి సరస్వతీదేవిని పిలిస్తే, ఈవిడ రెండాకులు ఎక్కువ చదివినట్లుగా 'పోవే పోవే అత్తయ్యా, పొందులు నీతో చాలును' అంటూ ఎత్తిపొడుస్తుంది. ఈ విధంగా పాటంతా ఒకరినొకరు తిట్టుకుంటూ హాస్యధోరణిలో సంభాషణాత్మకంగా సాగుతుంది.

వసంతోత్సవాలలో పూలతో, వాటి పుప్పొడులతో ప్రేయసీప్రియులు సరసంగా ఆడుకునే ఆట జాజరాట! జగడపు చనవుల జాజర, సగినల మంచపు జాజర అంటూ అన్నమయ్య వేంకటేశ్వరస్వామి జాజరను వర్ణిస్తాడు. 'తొల్లింటి వలె గావు మమ్ము తుమ్మెదా! ఇంక నొల్లవుగా మమ్ము వో తుమ్మెదా' అంటూ తుమ్మెద పదాలను రాశాడు అన్నమయ్య! ఇక ప్రకృతి వర్ణనలో భాగంగా సూర్యచంద్రులను స్వామివారి నేత్రాలతో పోల్చిన అన్నమయ్య ఒక పాటను పూర్తిగా చందమామపై రాశాడు.

**"సందెకాడ బుట్టినట్టి చాయలపంట యెంత**
**చందమాయ చూడరమ్మ చందమామ పంట"**

అద్భుతమైన భాషా భావ సంపదతో చందమామను వర్ణించాడు. **'అరుదై తూరుపు కొండ ఆరగ పండిన పంట'** అని అన్నమయ్య జానపద ధోరణిలో వర్ణిస్తుంటే, వినేవారి మనసులలో వెన్నెల ప్రకాశించి చల్లని అనుభూతినిస్తుంది.

శ్రీమహావిష్ణువు యొక్క దశావతార విశేషాలను జానపదకీర్తనలలో అన్నమయ్య అందించాడు. "శిఖుత నవ్వుల వాడె శిన్నెకా" అనే పాట పొడుపుకథారూపంలో సాగుతుంది.

అన్నమయ్య జానపదకీర్తనలలో భాగంగా వ్యవసాయపు పనులను వర్ణించాడు. తిమ్మిరెడ్డి నిచ్చె దిష్టమైన పొలము అని ఓ సంకీర్తనలో ప్రస్తావిస్తూ, ఈ భూమి తిరుపతి వేంకటేశ్వరుడు ప్రసాదించాడని, దాన్ని అందుకున్న రైతులు భాగ్యవంతులు అంటూ **"పంటల భాగ్యులా వ్యవసాయులు"** అని ప్రస్తావిస్తాడు పదకవితాపితామహుడు.

అలాగే **'వాడల వాడల వెంట వాడెవో వాడెవో, నీడ నుండి చీరలమ్మే నేత బేహారి'** అంటూ చేనేత పద్ధతులను, చీరలమ్మే విధానాన్ని తెలియజేశాడు. **'ఆటవారి గూడితౌరా, బొమ్మలాటవారి గూడితౌరా'** అని వర్ణిస్తూ సంచార జానపదులైన తోలుబొమ్మలాట వారిపైనా అన్నమయ్య పాటలు రాశాడు. **'తిరుమలయ్య విందు మంచిదే వుండంటే వుంటినమ్మ, సరవి లేని చెంచువారి సంగతేల తనకు'** అనే పాటలో చెంచువారిని అన్నమయ్య వర్ణించాడు.

ఈ విధంగా అన్నమయ్య జానపదుల జీవభాషలో పాటలు రాసి, వాటిని దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరునికి అంకితం చేసి చరిత్రలో చిరస్మరణీయుడయ్యాడు.

# శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయం

- ఆచార్య వేదాన్తం శ్రీవిష్ణుభట్టాచార్యులు, 94907 41414

శ్రీగోవిందరాజస్వామివారు శ్రీమహావిష్ణువు. స్వామివారు అచింత్య దివ్యయవ్వన స్వభావ లావణ్యాతిశయంతో ఆదిశేషునిపై శయనించి ఉన్నట్లుగా గర్భాలయంలో మూర్తి ప్రకాశిస్తూ ఉంటారు. దక్షిణశిరస్సు, ఉత్తరదిక్కున పాదాలు ఉండి శంఖచక్రాది ఆయుధాలతో చతుర్భుజుడై నాభికమలం నుండి బ్రహ్మ బయటకు రాగా శిరస్సున కిరీటిధారియై స్వామి ఉండగా, ఆదిశేషుడు ఛత్రంవలె ఉండి నీడ నిస్తూ ఉండగా శ్రీదేవి భూదేవేరులు పాదసేవ చేస్తు నట్లుగా ఉంటారు. మధుకైటభులు తమ రాక్షసభావం నుండి విముక్తులై స్వామిని ప్రార్థిస్తున్నట్లు ఉంటారు. ఈ ఆలయం తిరుపతి రైల్వేస్టేషనుకు అతి సమీపంలో ఉంది. ఆర్.టి.సి. బస్టాండుకు ఒక కిలోమీటరు దూరంలో ఉంది.

## ఆలయచరిత్ర

ఆలయచరిత్రను పరిశీలిస్తే విజయనగర కాలం నాటి వాస్తు శిల్పశైలి ఈ ఆలయంలో ప్రస్ఫుటంగా గోచరమౌతుంది. విజయనగరరాజులైన సాళువవంశ కాలంలో ఆలయం బాగా అభివృద్ధి చెందింది. 1239 సంవత్సరంలో వీరనరసింగ యాదవ రాయల భార్య ఈ ఆలయరథం మరమ్మతుల కోసం కొన్ని కానుకలు సమర్పించినట్లు శాసనాధారం. 1506 సంవత్సరంలో ఈ ఆలయం సర్వాంగసుందరంగా తీర్చిదిద్దబడింది. ఈ ఆలయానికి మూడు ప్రధాన గోపురాలు ఉన్నాయి. ప్రధానంగా బయట ఉన్న ఆలయగోపురం పెద్దది, ప్రాచీనమైంది. తరువాత రెండు గోపురాలు పురాతనమైనవి. రామాయణ, భారత, భాగవత సన్నివేశాల శిల్పాలు వీటిపై చెక్కబడియున్నవి.



దక్షిణదేశంలో మొదటి కుళోత్తుంగచోళుడు క్రిమి కంఠుడనే రాజు పరిపాలన సాగిస్తూ శైవమతాభిమానిగా ఉంటూ చిదంబరక్షేత్రంలో గల శ్రీగోవిందరాజస్వామి రూపంలో ఉన్న మహావిష్ణువు ఆలయ విగ్రహాలను ధ్వంసం చేయగా అర్చకులు ప్రాణభయంతో పారిపోయి అతికష్టంపై ఉత్సవ విగ్రహాన్ని తీసుకుని తిరుపతిలో ఉన్న శ్రీరామానుజాచార్యుల వారివద్దకు వచ్చి రక్షించమని ప్రార్థించగా రామానుజులు బాధపడి ఆ కుళోత్తుంగచోళుని మరణానంతరం తిరుపతిలో గల శ్రీ పార్థ సారథి ఆలయ ప్రాంతమే సరైన ప్రదేశమని భావించి అక్కడ ఆలయనిర్మాణం చేసి శ్రీ గోవిందరాజస్వామి విగ్రహాన్ని భద్రపరచి సుధావిగ్రహాన్ని తయారుచేసి ప్రతిష్ఠించారట.

పూర్వం పార్థసారథి ఆలయంలో వైఖానసార్చకులే అర్చనాదులు జరపటంచేత రామానుజులు శ్రీగోవిందరాజ స్వామివారి ఆలయాన్ని వారిచేతే ప్రతిష్ఠింపచేసి అర్చనాదులు వైఖానసాగమం ద్వారానే జరిగే విధంగా కట్టడి చేశారు.

తిరుపతిలో ముఖ్యఅర్చకులు, ఆచార్య పరిచారకులు, వర్తకులు నివాసముండుటచేత వీరికి, యాత్రికులకు భోజన సదుపాయం రామానుజకూటాలు, మఠాలు అన్న విక్రయశాలలు శ్రీగోవిందరాజ స్వామివారి ఆలయానికి అనుబంధంగా ఉండటంచేత శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయం కారణంగా తిరుపతి పట్టణం ప్రాముఖ్యత సంతరించుకుంది.

1219 సంవత్సరంలో వీరనరసింహరాయల రాణి శ్రీగోవిందరాజస్వామివారి ఆలయంలో అఖండదీపం వెల్గించుటకు గాను 32 గోవులను సమర్పిస్తూ ఒక దానశాసనం వేశారు. 1234 సంవత్సరంలో ఈ రాయలరాణి పైడిపల్లి గ్రామాన్ని ఆలయాలకు సమర్పిస్తూ ఆ గ్రామ ఆదాయం సగభాగం రాబడిని తిరుమల శ్రీవారి ఆలయ అభివృద్ధికి మిగిలిన సగభాగం గోవిందరాజస్వామివారికి సర్వమాన్యం క్రింద సమర్పించినట్లు శాసనం. 1220 సంవత్సరానికి పూర్వమే రామానుజుల సన్నిధి నెలకొల్ప

బడినట్లు శాసనం ద్వారా తెలుస్తోంది. శ్రీరామానుజులవారి సన్నిధిలో భగవద్రామానుజులవారి ఆరాధ్యదైవమగు శ్రీరాములవారి విగ్రహాలు కూడా ప్రతిష్ఠింపబడ్డాయి. 1219వ సంవత్సరంలోనే లోపలి గోపురం నిర్మాణం కాబడినట్లు తెలుస్తుంది. శ్రీగోవిందరాజస్వామివారి ఆలయంలో గల జయ – విజయ ద్వారపాలకుల ప్రతిష్ఠ 1549 సంవత్సరంలో నంద్యాల నారాయణప్ప గావించినట్లు శాసనం తెలుపుతుంది.



వేదాంతదేశికుల సన్నిధికి సమీపంలో గల నాలుగు కాళ్ల మంటపం 1494లో నిర్మించినట్లు శిలాశాసనం. జయ విజయ ద్వారపాలకులకు ముందున్న మంటపాన్ని చిత్రకూట మంటపమంటారు. శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో గల తిరుమంగై ఆళ్వార్ సన్నిధి 1234వ సంవత్సరంలో గోదాదేవి సన్నిధి 1254వ సంవత్సరంలో నిర్మింపబడినట్లు తెలుస్తుంది. 1495వ సంవత్సరం నుండి శ్రీ గోదాదేవికి ప్రతి శుక్రవారం అభిషేకం జరిగేవిధంగా కట్టడి ఏర్పడింది.

శ్రీ నమ్మాళ్వార్‌ను 1287లో, కులశేఖరాళ్వార్‌ను 1469లో, పెరియాళ్వార్‌ను 1300లో, మధురకవి ఆళ్వార్ సన్నిధి 1543లో, శ్రీరామానుజ సన్నిధి 1220 సం॥ తరువాత కూరత్తాళ్వాన్ సన్నిధి 1433లో, సాలై నాచ్చియార్ అనబడు పుండరీకవల్లీ తాయారు సన్నిధి 1457వ సంవత్సరంలో నిర్మాణం కాబడినట్లు తెలుస్తున్నది.

తిరుమల శ్రీనివాసుడు తిరుపతి శ్రీగోవిందరాజస్వామివారు ఈ రెండు విష్ణుస్వరూపాలే అయినా ఒకరు శయనమూర్తి కాగా మరొకరు స్థానకమూర్తి అయితే గోవిందరాజస్వామివార్ల ఉత్సవమూర్తులు ఆసనమూర్తిగా ఉంటారు. అందుకే తిరుపతి శ్రీగోవిందరాజస్వామివారిని తిరుమల శ్రీనివాసుని దర్శిస్తే స్థానక– ఆసన– శయనమూర్తులను దర్శించినట్లు కాగలదు. ఈ మూర్తులు సృష్టి– స్థితి– సంహారాలకు ప్రతీకలు.

## ఎత్తైన గాలిగోపురం

తూర్పుముఖంగా ఉన్న శ్రీగోవిందరాజస్వామివారి ఆలయానికి ముందు ఎత్తైన రాజగోపురం చక్కని శిల్పసౌందర్యంతో నిర్మింపబడింది. ఇది తిరుపతి పట్టణానికే ఒక శోభాయమానం. దీనిని 1624 సం॥లో మట్ల అనంతరాజు నిర్మించినట్లు తెలుస్తుంది. ప్రతి భక్తుడు ఈ గోపురం ద్వారానే ప్రవేశించి ఆలయానికి చేరుకోవాల్సి ఉంటుంది.

## భక్త ఆంజనేయస్వామి ఆలయం

శ్రీగోవిందరాజస్వామివారి ఆలయం సన్నిధివీధి ఆరంభంలో అభిముఖంగా శ్రీభక్త ఆంజనేయస్వామివారు శ్రీగోవిందరాజస్వామికి నమస్కరిస్తున్నట్లుగా ఏడడుగుల ఎత్తున విగ్రహం ప్రతిష్ఠింపబడి ఉంది. ఈ ఆంజనేయస్వామివారి ఆలయంలో మహామండపం, ముఖమండపం, గర్భగృహం, వేసర రూపంలో విమాననిర్మాణం చేయబడింది. ఈ ఆలయం 1509 సం॥లో నిర్మించినట్లు శాసనాధారం. ఈ స్వామికి ప్రతినిత్యం ఆరాధనలు, నివేదనలు శ్రీగోవిందరాజస్వామివారికి అర్చన అనంతరం వైఖానసశాస్త్రరీత్యా జరుపబడతాయి.

## ఆలయవర్ణన

శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయం విశాల ప్రాంగణంలో ప్రాఙ్ముఖంగా నిర్మింపబడింది. 11 కలశాలతో ప్రతిష్ఠించబడిన మొదటిగోపురం దాటి రెండవగోపురం వద్దకు రాగానే ఒక చిన్న కోనేరు ఉంది. దీన్నే బుగ్గ అంటారు. ఈ బుగ్గమీద శ్రీగోవిందరాజస్వామివారికి బుగ్గోత్సవాలు జరుగుతాయి.

ఆగ్నేయభాగంలో లక్ష్మీమండపం ఉంది. ఆ తరువాత 9 కలశాలతో అలరారుచున్న రెండవగోపురం దాటి లోపలకు ప్రవేశించగానే ఉత్తరాభిముఖంగా పుండరీకవల్లీ తాయారు







దర్శనమిస్తారు. ఆమె గోవిందరాజ స్వామివారి పట్టపురాణి. ఈమెనే శాలినాచ్చియార్ అని కూడా అంటారు.

అదేవరుసలో క్రమంగా కూరత్తాళ్వాన్ సన్నిధి, రామానుజాచార్యుల సన్నిధి, తిరుమల నంబి సన్నిధి ఉత్తరాభిముఖంగా ఉన్నాయి. అలాగే ఉత్తరదిక్కున దక్షిణాభిముఖంగా మధురకవి ఆళ్వార్ మరియు శ్రీ అనంతాళ్వాన్ సన్నిధులు మనం చూడవచ్చు. ఈశాన్య భాగంలో ఎత్తుగా ఉన్న ఆలయంలో చక్రత్తాళ్వార్లు వేంచేసియుండి భక్తులను అనుగ్రహిస్తున్నారు.

ఉత్తరభాగంలో శ్రీగోవిందరాజస్వామివారు జయవిజయ ద్వార పాలక సంరక్షకులుగా గరుత్మంతుడు అభిముఖంగా ఉండి దర్శనమిస్తారు. అటు బయట బంగారుతాపడంతో ధ్వజస్తంభ బలిపీఠాలు ఉండగా స్వామి గర్భాలయంలో శ్రీభూదేవేరులు పాదసేవ చేస్తుండగా నాభికమలంలో బ్రహ్మ అలాగే పాదాలకు కాస్త అవతల మధుకైటభులు స్వామిని సేవిస్తూండగా పట్టుపీతాంబరాలతో చక్కని సుగంధ పుష్పమాలలను ధరించి శయనమూర్తియై మనకు స్వామి దర్శనమిస్తారు.

గోపురాలకు అభిముఖంగా పార్థసారథిస్వామి ఆలయం. ఈ ఆలయానికి దక్షిణభాగంలో ఆండాళ్ అమ్మవారి సన్నిధి, ఆగ్నేయంలో పాకశాల, దక్షిణంలో వరదరాజస్వామి ఆలయం, తిరుమంగైయాళ్వార్ల సన్నిధి, చందనపు అర, శ్రీభూ సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి దివ్య ఉపాలయం, నైఋతిలో యాగమంటపం దర్శనమిస్తాయి. శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ముఖమండపానికి కల్యాణ మండపం అని ప్రసిద్ధి. ఈ కల్యాణమండపంలో ఆళ్వార్ ఆచార్యాదుల శాత్తుమొరలు, సకలవైదిక కార్యక్రమాలు, అభిషేకసేవలు వైభవంగా జరుగుతూ ఉంటాయి.

బయటకు రాగానే ఉత్తరం వైపున ప్రాఙ్ముఖంగా పొయిగై ఆళ్వార్, పూదత్తాళ్వార్, పేయాళ్వార్, మొదలియాండాన్ ఆళ్వారాచార్యుల సన్నిధులు దర్శనమిస్తాయి. ఈశాన్యంలో పశ్చిమాభిముఖంగా మణవాళమహాముసుల సన్నిధి దక్షిణాభిముఖంగా వేదాన్తదేశికుల సన్నిధి దర్శనమిస్తాయి.

చైత్రమాసంలో (మార్చి, ఏప్రిల్) ఉగాది ఆస్థానం జరుగుతుంది. వృషభ మాసంలో అనూరాధనక్షత్రానికి ముగిసే విధంగా శ్రీగోవిందరాజస్వామివారికి బ్రహ్మోత్సవాలు వైభవంగా తొమ్మిదిరోజులపాటు తిరుమలలో శ్రీవేంకటేశ్వర స్వామి వారికి జరిగే వాహనాల క్రమంతోనే వాహనసేవలు జరుగుతాయి. చక్రస్నానం మాత్రం ఆళ్వార్‌తీర్థం(కపిలతీర్థం) పుష్కరిణిలో జరుగుతుంది.

సంవత్సరకాలంలో సుమారుగా 300 రోజులపాటు అనేక ఉత్సవాలు ఈ గోవిందరాజస్వామివారి ఆలయంలో వైభవంగా జరుగుతాయి.

శ్రీగోవిందరాజస్వామివారి ఆలయానికి బయట కొద్దిదూరంగా ఈశాన్యంలో పుష్కరిణి నిర్మితమైంది. మధ్యలో నీరాళిమంటపం కూడా అత్యంతప్రాచీనపద్ధతిలో నిర్మింపబడినది. ఈ పుష్కరిణిలో మాఘపూర్ణిమకు పూర్వయ్యేవిధంగా ఏడురోజుల పాటు శ్రీ కోదండరామస్వామికి, శ్రీపార్థసారథి స్వామికి, శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామికి, గోదాకృష్ణులకు, శ్రీగోవిందరాజస్వామికి తెప్పోత్సవాలు వైభవంగా జరుగుతాయి.

1522లో గోవిందపుష్కరిణీ అనే పేరుతో ఈ పుష్కరిణి నిర్మించబడింది. ఈ పుష్కరిణికి కృష్ణరాయ కోనేరు అనే పేరు కూడా అన్వయించబడింది. ఈ పుష్కరిణీ తీరంలో ప్రతిరోజూ సాయంత్రం తి.తి.దే. హిందూధర్మప్రచార పరిషత్ ద్వారా హరికథ, సంగీతకచేరి, ఉపన్యాస కార్యక్రమాలు జరుపబడతాయి.

*(ముఖచిత్ర కథనం)*




# మనిషి కర్తవ్యం..!

–శ్రీ యు.విజయశేఖర రెడ్డి, 9597 36475

ఒక పండితుడి ఇంటి ముందు ఒక వ్యక్తి "ఆకలి.. ఆకలి" అంటూ సొమ్మసిల్లి పడిపోయాడు. పండితుడు బయటకు వచ్చి చూశాడు. ఆ వ్యక్తి మాసిన బట్టలతో కనిపించాడు. కానీ అతను ఆకలి.. ఆకలి అని పడిపోవడం పండితుడికి బాధ కలిగించింది. "దేవుడి నైవేద్యం తయారయ్యింది" అని భార్య కేక వినిపించింది. పదిమందికి ప్రవచనాలు చెప్పే పండితుడు ఆ వ్యక్తి గురించి ఆలోచించి అతణ్ణి వసారాలో కూర్చోబెట్టి, లోపలకు వెళ్ళి ఆ నైవేద్యం తెచ్చి అతడికి ఇచ్చి తినమన్నాడు.

అతను తిని మంచి నీళ్లు తాగిన తరువాత "అయ్యా..! నా పేరు రామయ్య. అన్నం తిని రెండు రోజులయ్యింది. నా భార్య పోయి చాలా కాలమయ్యింది. నాకు ఇద్దరు కొడుకులు పెద్దవాడికి మూడువంతుల ఆస్తి చిన్నవాడికి ఒక వంతు ఆస్తి పంచాను. నేను భారమని పెద్దవాడు నన్ను కట్టు బట్టలతో ఇంటి నుండి తరిమేశాడు. పక్క గ్రామంలో నా చిన్న కొడుకు ఉంటాడు. వాడి దగ్గరకు వెళుతుండగా సొమ్మసిల్లి పడిపోయాను. అన్నంపెట్టి నా ప్రాణం నిలబెట్టారు. మీకు కృతజ్ఞతలు" అన్నాడు.



"దానిదేముంది రామయ్యా! నీ చిన్నకొడుకు వద్దకు క్షేమంగా వెళ్లడానికి ఎద్దుల బండి ఏర్పాటు చేస్తాను" అన్నాడు పండితుడు. రామయ్య బయలుదేరాక ఇంట్లోకి వెళ్లాడు పండితుడు. "ఏరా నాయనా! దేవుడి కోసం చేసిన నైవేద్యాన్ని ఎవరో దారిన పోయే దానయ్యకు పెట్టావేంటి?" అంది పండితుడు తల్లి. "అమ్మా! దైవం మానుషరూపేణా! అన్నారు. ఆ దేవుడే ఆకలి ఆకలి అని మన ఇంటికి వచ్చాడనుకుందాం" అన్నాడు పండితుడు.

కొన్ని రోజులకు రామయ్య అతని కొడుకుతో గుర్రపు బండిలో పండితుడి ఇంటికి వచ్చాడు. "అయ్యగారు ఇంట్లోకి రావచ్చా?" అన్నాడు రామయ్య. పండితుడు వారిని "రండి" అని సాదరంగా ఆహ్వానించాడు. ఎన్నో రకాల పండ్ల బుట్టలు.. పట్టువస్త్రాలతో లోపలికి వచ్చారు రామయ్య, అతని కొడుకు. "అయ్యగారూ! ఆకలి తీర్చి మా నాన్న గారి ప్రాణాలు కాపాడారు. మీకు ధన్యవాదాలు. మేము తెచ్చినవి మీరు కాదన కుండా స్వీకరించాలి, అప్పుడే మాకు ఆనందం" అని పండితుడి పాదాలకు నమస్కరించాడు.

"లే నాయనా!" అని అతణ్ణి లేపి "నీ పేరెంటి.. నువ్వు ఏం చేస్తుంటావు?" అన్నాడు. "నా పేరు చంద్రం. రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి ధాన్యం కొని నగరంలో అమ్ముతాను. నా వ్యాపారం బాగా సాగుతోంది" అన్నాడు చంద్రం. ఇద్దరికీ ఫలహారం పెట్టింది పండితుడి భార్య. తిన్నాక వెళ్లి వస్తాం అన్నారు రామయ్య, చంద్రంలు. "వీలు కుదిరినప్పుడల్లా వస్తూండండి" అన్నాడు పండితుడు. "అలాగే అయ్యగారూ!" అన్నారు తండ్రీకొడుకులు.

మాసినబట్టలతో అశుభ్రంతో ఉన్నా పండితుడు మనిషిగా తన కర్తవ్యం మాత్రం మరువ లేదు. ఎదుటివారికి మంచి మాటలు చెప్పినప్పుడు మనం వాటిని ఆచరణలో పెట్టాలి అదే మనిషిగా మన కర్తవ్యం.

చిత్ర కథ

# ప్రాణం కాపాడిన శ్లోకం

కథ– 'కళారత్న' డా॥కంపల్లె రవిచంద్రన్
చిత్రాలు– శ్రీ తుంబలి శివాజీ





వైద్యుడు శస్త్రచికిత్స చేయడానికి ముందు రాజ భవనం నాలుగు గోడలకు అతికించిన శ్లోకాన్ని చదివాడు.
విషప్రభావంతో రాజు శరీరం నల్లబడుతుంది. విషయం నలుగురికీ తెలుస్తుంది. అప్పుడు నేను బ్రతకడం కష్టం. కనుక విషంకత్తిని పక్కకు పెట్టి నిజాయితీగా శస్త్రచికిత్స చేస్తాను.
ఓ వైద్యుడా! ఎందుకు కత్తి మార్చారు?
ఓ రాజా! ఏమీ లేదు... లేదు...
ఎందుకితను కంగారు పడుతున్నాడు. సంగతేంటో కనిపెడదాం..
రాజవైద్యుడు పెట్టెలోని ఆ కత్తిని తీసి దానిని పాలల్లో వేసి చూశాడు. కొద్దిసేపట్లో ఆ పాలన్నీ నల్లగా మారిపోయాయి.
ఓ వైద్యుడా! చెప్పు. ఎందుకు చేశావీ పని?
మహారాజా! నన్ను మన్నించండి! డబ్బుకు ఆశ పడి నా బుద్ధి గడ్డి తింది. దయచేసి నన్ను ఖైదు చేయకండి. నేను మళ్లీ మీకు కనిపించను.
జరిగిన కుట్ర బయటపడింది.
భటులారా! అత్యాశతో నన్ను హతమార్చాలని చూసిన ఈ మంత్రిని.. కాదు కాదు.. ఈ ద్రోహిని బంధించండి.
అవిచార్య న కర్తవ్యమ్ కర్తవ్య
కర్తవ్యమ్ సువిచారితమ్.
సాహిత్యానికి గల శక్తి అద్వితీయం. ఆహా! ఈ శ్లోకమే నా ప్రాణాన్ని కాపాడింది ఈపూట. ధన్యోస్మి మహాకవీ!
2

విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



# ఇంటిలోనిపోరు

చెప్పులోని రాయి, చెవిలోని జోరీగ,
కంటిలోని నలుసు, కాలిముల్లు,
ఇంటిలోని పోరు, ఇంతింత గాదయా!
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** జోరీగ= పశువులున్న చోటనుండు పెద్దఈగ (పశుమచ్చికం); నలుసు= ఎండుగడ్డిముక్క; పోరు= కొట్లాట.

**భావం:** చెప్పులో రాయి చేరితే నడవడం కష్టం. జోరీగ చెవిలో దూరి రొదపెడుతుంటే భరించలేం. కంటిలో నలుసు పడితే కన్ను తెరచి తిన్నగా చూడలేం. కాలిలో ముల్లు విరిగితే నడవలేం. ఇలాంటిదే ఇంట్లో కుటుంబసభ్యులమధ్య గొడవలు రావడం. ఈ అయిదింటినీ భరించడం కష్టం.

**వివరణ:** చెప్పులో రాయి దూరి కాలికి గుచ్చుకుంటుంటే ఆ బాధ ఎదుటివాడికి తెలీదు. ఏడ్చి గగ్గోలు పెట్టేంత మహాకష్టం అని చెప్పడానికి కూడ వీలు లేనిది. అలాగే, ఈగ చెవిలో దూరి జోరున రొద పెడు తున్నా, కంటిలో నలుసు పడి కన్ను తెరవనీయ కున్నా, కాలిలో ముల్లు కలుక్కుమంటున్నా, అలాగే ఇంట్లో సభ్యులమధ్య గొడవలు జరుగుతున్నా, ఆ బాధ ఎవరికీ చెప్పు కునేదీ కాదు. ఓర్చుకోగలిగిందీ కాదు. వెంటనే తొలగించుకోవాలి. సారాంశంగా ఇంటిలోని గొడవలను వెంటనే పరిష్కరించుకోవాలి. లేకపోతే ఆ గొడవలు పెద్దవై కుటుంబాన్ని ఛిన్నా భిన్నం చేస్తాయి.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

## హృషీకేశ్, నారాయణవనం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్ల బ్రహ్మోత్సవం




| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 27-05-2026 | బుధవారం | --- | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం |
| 28-05-2026 | గురువారం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 29-05-2026 | శుక్రవారం | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 30-05-2026 | శనివారం | సింహవాహనం | ముత్యపుపందిరి వాహనం |
| 31-05-2026 | ఆదివారం | కల్పవృక్షవాహనం | సర్వభూపాల వాహనం |
| 01-06-2026 | సోమవారం | పల్లకీలో మోహినీ అవతారోత్సవం | గరుడవాహనం |
| 02-06-2026 | మంగళవారం | హనుమద్వాహనం, సా॥వసంతోత్సవం | గజవాహనం |
| 03-06-2026 | బుధవారం | సూర్యప్రభవాహనం | చంద్రప్రభ వాహనం |
| 04-06-2026 | గురువారం | రథోత్సవం | అశ్వవాహనం |
| 05-06-2026 | శుక్రవారం | పల్లకీ ఉత్సవం, తీర్థవారీ, అవభృథం, చక్రస్నానం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం<br>ద్వాదశారాధానం, ఏకాంతసేవ |

# క్విజ్ 46

01) పేరంటాల వేషం దేనికి సంకేతం? జ)..............................

02) 'అధీత' అంటే అర్థం? జ)..............................

03) హనుమంతుని పేరుతో ఉన్న రాగం? జ)..............................

04) గీతగోవింద కర్త? జ)..............................

05) ఆముక్తమాల్యద కర్త? జ)..............................

06) స్వారోచిషుడు ఎక్కడ కనిపిస్తాడు? జ)..............................

07) రాధికాసాంత్వనం ఎవరి రచన? జ)..............................

08) అన్నమయ్యను తన మీద పాటలు పాడమన్నది ఎవరు? జ)..............................

09) యద్భావం తద్భవతి ఆధ్యాత్మిక కథల రచయిత? జ)..............................

10) కేతుమహర్దశ జరుగుతున్నవారు ఏ వ్రతం చేయడం మంచిది? జ)..............................

11) వైశాఖశుద్ధ ఏకాదశిని ఏమంటారు? జ)..............................

12) శివుడు శరభావతారం ఎత్తిన రోజు? జ)..............................

13) మహేంద్రగిరినాథుడు కొలువైన క్షేత్రం? జ)..............................

14) తారకాక్షుని కుమారుడు? జ)..............................

15) 'చందమామ రావో' పాట ఎవరిది? జ)..............................

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది **25-05-2026**.

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: .............................. వయస్సు: ..............

పాఠశాల: .............................. తరగతి: ..............

పేరు: ..............................................

చిరునామా: ..............................................

..............................................

..............................................

.............................. పిన్‌కోడ్: ..............

ఫోన్ సంఖ్య: ..............................................

### జవాబులు చేరాల్సిన చిరునామా

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.



# పిల్లలూ తెలుసా!

**ఏడాదిలో నెలకు రెండు చొప్పన మొత్తం 24 ఏకాదశులు వస్తాయి. అధికమాసం వస్తే మరో 2 ఏకాదశులు కలిపి మొత్తం 26 ఏకాదశులు వస్తాయి. ఒక్కొక్క ఏకాదశికి ప్రత్యేకత ఉంది.**

01) **చైత్రశుద్ధ ఏకాదశి–** 'కామదా' అని పేరు. ఈ ఏకాదశి కోర్కెలను తీరుస్తుంది.

02) **చైత్రబహుళ ఏకాదశి–** 'వరూధినీ' అని పేరు. సహస్ర గోదాన ఫలితం కలుగుతుంది.

03) **వైశాఖశుద్ధ ఏకాదశి–** 'మోహిని' అనిపేరు. ధనవంతులౌతారు.

04) **వైశాఖబహుళ ఏకాదశి–** 'అపరా' అనిపేరు. రాజ్యప్రాప్తి లభిస్తుంది.

05) **జ్యేష్ఠశుద్ధ ఏకాదశి–** 'నిర్జల' అనిపేరు. ఆహారసమృద్ధి కలుగుతుంది.

06) **జ్యేష్ఠబహుళ ఏకాదశి–** 'యోగినీ'అని పేరు. పాపాలను హరిస్తుంది.

07) **ఆషాఢశుద్ధ ఏకాదశి–**'దేవశయన' అనిపేరు. సంపదలు కల్గుతాయి. (ఈరోజు విష్ణువు యోగనిద్రకు శయనించే రోజు)

08) **ఆషాఢబహుళ ఏకాదశి–** 'కామికా' అనిపేరు. (కోరిన కోర్కెలు ఫలిస్తాయి)

09) **శ్రావణశుక్ల ఏకాదశి–** 'పుత్రదా' అనిపేరు. మంచి సంతానం కలుగుతుంది.

10) **శ్రావణబహుళ ఏకాదశి–** 'అజా' అనిపేరు. ఆపదలు నశిస్తాయి.

11) **భాద్రపదశుద్ధ ఏకాదశి –** 'పరివర్తన' అని పేరు. యోగసిద్ధి కలుగుతుంది. (ఈరోజు విష్ణువు యోగనిద్రలో పక్కకు పొర్లుతాడు)

12) **భాద్రపదబహుళ ఏకాదశి –** 'ఇందిరా' అనిపేరు. సంపదలు, రాజ్యం సంప్రాప్తిస్తాయి.

13) **ఆశ్వయుజశుక్ల ఏకాదశి–** 'పాపాంకుశ' అని పేరు. పాపాలు నశించి పుణ్యాలు కల్గుతాయి.

14) **ఆశ్వయుజబహుళ ఏకాదశి –** 'రమా ' అని పేరు. స్వర్గ ప్రాప్తి కల్గుతుంది.

15) **కార్తికశుక్ల ఏకాదశి–** 'ప్రబోధినీ' అనిపేరు. యోగనిద్రలో ఉన్న విష్ణువు మేల్కొనే రోజు.

16) **కార్తికబహుళ ఏకాదశి–** 'ఉత్పత్తి' అనిపేరు. దుష్టసంహారం జరుగుతుంది. (మురాసురుని సంహరించిన కన్య విష్ణు శరీరం నుండి జన్మించిన రోజు.)

17) **మార్గశిరశుక్ల ఏకాదశి–** 'మోక్షదా' అని పేరు. దీనికే 'వైకుంఠ ఏకాదశి' అని, 'ముక్కోటి ఏకాదశి' అని పేర్లు. మోక్షప్రాప్తి కల్గుతుంది.



18) **మార్గశిరబహుళ ఏకాదశి–** 'విమాలా' (సఫలా) అని పేరు. అజ్ఞానం నశిస్తుంది .

19) **పుష్యశుక్ల ఏకాదశి–** 'పుత్రదా' అని పేరు. అశ్వమేథ యజ్ఞఫలితాన్ని పొందుతారు.

20) **పుష్యబహుళ ఏకాదశి–** 'షట్తిల' అని పేరు. ఈతిబాధలు నశిస్తాయి.

21) **మాఘశుక్ల ఏకాదశి –** 'కామదా' (జయా) అనిపేరు. శాపవిముక్తి కల్గుతుంది.

22) **మాఘబహుళ ఏకాదశి–** 'విజయా' అనిపేరు. సకల కార్యవిజయం.

23) **ఫాల్గుణశుద్ధ ఏకాదశి–** 'ఆమలకీ' అనిపేరు. ఆరోగ్యాలు కల్గుతాయి.

24) **ఫాల్గుణబహుళ ఏకాదశి–** 'సౌమ్యా' అనిపేరు. పాప విముక్తుడౌతాడు .

25) **అధికమాసంలో శుక్ల ఏకాదశి–** 'పద్మినీ 'అనిపేరు.

26) **అధికమాసంలో బహుళ ఏకాదశి–** 'పరమ' అనిపేరు.

ఈ ఏకాదశీవ్రతాల్ని భక్తిశ్రద్ధలతో ఆచరిస్తే ఇహపర సౌఖ్యాలు కల్గుతాయి.

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** అధికార హోదా పెరుగుతుంది. ధనవృద్ధి కలుగుతుంది. సభాగౌరవం పెరుగుతుంది. సంతానం గురించి దిగులు, కలత కలుగుతాయి. వ్యాపారాలు కలిసివస్తాయి. లాభనష్టాలు అధిగమించి మనో నిబ్బరంతో దృఢంగా ఉంటారు.



**వృషభం–** పనిచేసేచోట ఒత్తిడి, స్థానచలన సూచన. ప్రయాణాల వల్ల ధనవ్యయం. శారీరక ఒత్తిడి, కుటుంబానికి దూరంగా గడుపుతారు. ధర్మసంపాదన. భూమి కొనుగోలు.



**మిథునం–** ఆకస్మిక ధనలాభం, పనులు నెరవేరుట, శుభకార్యాలు, బంధుమిత్ర సమాగమాలు, మృష్టాన్న భోజనములు, విందు వినోదాలలో పాల్గొనుట, పుణ్యక్షేత్ర సందర్శన, ఆనందదాయకమైన జీవనాన్ని ఆస్వాదిస్తారు.



**కర్కాటకం–**జ్ఞానం, ఆశావహదృక్పథం మరియు సమృద్ధి. ఆలోచన, వ్యక్తిత్వం మరియు జీవిత గమనంలో ఈ నెల నుండి గణనీయమైన ప్రభావం ఉంటుంది. పోటీపరీక్షలలో బాగా రాణిస్తారు. కొత్త ఉద్యోగం కోసం చూసేవారు విజయం సాధిస్తారు.



**సింహం–** వృత్తి జీవితం అనుకూలం, విద్యార్థులు విజయం మరియు పేరు ప్రఖ్యాతులు గడిస్తారు. ఆర్థికపరంగా పరపతి పెరుగుతుంది. భాగస్వాములతో సంయమనంతో ఉంటారు.



**కన్య–** ప్రత్యర్థులతో కొనసాగుతున్న వివాదాలు పరిష్కారమౌతాయి. కొత్త ప్రదేశాలు, సంస్కృతి, సంగీతం మరియు కళలను ఆస్వాదించడంలో ఉత్సాహంగా ఉంటారు.



**తుల–** నెలారంభంలో వస్తు వస్త్ర లాభాలు, ఉద్యోగంలో ప్రమోషన్లు, కొత్త ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉంది. వృత్తిపరంగా మంచి గుర్తింపు లభిస్తుంది. విద్యార్థులకు చదువులో మంచి ఫలితాలు వస్తాయి.



**వృశ్చికం–** ఆరోగ్యవిషయాలలో ఉపశమనం, అదృష్టవంతమైన కాలం, ప్రయత్నవిజయం. వ్యాజ్యాలలో ఉపశమనం. మీ స్థితి మరియు సంపాదన కూడా మెరుగుపడుతుంది.



**ధనుస్సు–** శత్రువులు పెరుగుతారు. ఆరోగ్య సమస్యల పట్ల చింత మీ జీవిత భాగస్వామితో కష్టాలు లేదా వాదనల వలన కావచ్చు. మానసిక క్షోభ అనుభవిస్తారు.



**మకరం–** శక్తి సామర్థ్యాలు, ఆరోగ్యం సంతృప్తి కరం. దీర్ఘకాలికవ్యాధి నయమగును. జీవితం ఆశావాహం. ఉద్యోగులు ప్రమోషన్ లేదా వేతన పెంపును పొందుతారు.



**కుంభం–** వ్యవహారజయం, కోర్టు విషయాలు అనుకూలత, పనులపట్ల విశ్వాసం, ఉత్సాహం. సరైన ఆలోచన, నిర్ణయంతో కార్యాన్ని సమర్థ వంతంగా నిర్వహిస్తారు.



**మీనం–** ఇతరులకు సహాయపడే నైజం కల్గి ఉంటారు. ఆచితూచి ఖర్చు చేస్తారు. తల్లి, పెద్దలనుండి సహకారం లభిస్తుంది. వ్యక్తిగత జీవితం శుభప్రదం, సుఖప్రదం, ఆత్మవిశ్వాసంతో కార్యసాధనకు ఉపక్రమిస్తారు. దానధర్మాలు చేస్తారు

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

**2.** కావలసినభాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-

జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :

(అ) చందానెంబరు :

(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

........................................ తేది :..................

ప్రదేశం :

తేది :

చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి' మ్యాగజైన్, తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# శ్రీపదకేళి

124



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

**అడ్డం** 1)పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న చిన్న తిరుపతి(7); 5)రుక్మిణి సోదరుడు(2); 6)మన్మథుని భార్య(2); 9)ఈ నదిలోనే సాలిగ్రామాలు లభిస్తాయి(5); 10)గంధర్వుడైన విశ్వావసుని వీణ(3); 11)దత్తాత్రేయుని కూతురు(2); 13)తుంబురుని వీణ(4); 15)బలి భార్య(4); 16)శివుని ఆయుధము(4)

**నిలువు** 1)ఈ యుగంలో విష్ణుమూర్తి కృష్ణునిగా అవతరించాడు(5); 2)భక్త కన్నప్ప(3); 3)అవాచీనుని భార్య(3); 4)శ్రీకృష్ణుని అష్టభార్యలలో ఒకరు(3); 7) వసిష్ఠుని హోమధేనువు(3); 8)నారదుని వీణ(3); 12)శ్రీకృష్ణుని అష్టభార్యలలో ఒకరు(4); 13)సరస్వతి వీణ(3); 14)నాట్య విశేషం(3)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



Printed by Sri R.V.Vijaya Kumar, B.A., B.Ed., and Published by Dr.V.G.Chokkalingam, M.A., Ph.D., P.G.Diploma in JMC., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D., P.G.Diploma in JMC

ఆంధ్రప్రదేశ్ గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి మనవడు, ఆంధ్రప్రదేశ్ విద్య & ఐ.టి. శాఖ గౌరవ మంత్రి శ్రీ నారా లోకేష్ గారి కుమారుడు చి॥ నారా దేవాన్ష్ పుట్టినరోజును పురస్కరించుకుని గౌరవ ముఖ్యమంత్రి కుటుంబం 21-03-2026న తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. ఈ సందర్భంగా తిరుమలలో ఒకరోజు అన్నప్రసాదానికి అయ్యే రూ.44 లక్షల వ్యయాన్ని శ్రీ నారా లోకేష్ తి.తి.దే.కి విరాళంగా అందించారు.

తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడు, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ముద్దాడ రవిచంద్ర, ఐ.ఏ.ఎస్., తి.తి.దే. అదనపు ఈ.ఓ. శ్రీ సి.హెచ్. వెంకయ్య చౌదరి, ఐ.ఆర్.ఎస్., గార్లు గౌరవ ముఖ్యమంత్రి కుటుంబాన్ని ఆలయమర్యాదలతో గౌరవించారు. శ్రీవారి దర్శనానంతరం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో గౌ॥ ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులతో కలిసి స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. ఇదే రోజున గౌ॥ ముఖ్యమంత్రి తిరుమలలో ఆధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన ఫుడ్ ఎనాలసిస్ ల్యాబ్‌ను ప్రారంభించారు.













SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams
Printing on 25-04-2026 and Posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under
RNI No.21139/1970. Postal Regd. No.TRP/155/2024-2026 "LICENCED TO POST WITHOUT PREPAYMENT
No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" Posting on 1st of Every Month.



శ్రియాసార్ధమీశస్సతాం రక్షణార్థం స్వయం రత్నశైలే సమావిర్బభూవ।
సముత్సాహతోయ స్సమాశ్చర్య వీరో భజే సత్యనారాయణం తం మహాంతమ్॥